www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రోబో కొంచెం.. తెలివి ఘనం

చైనాలో 12 పెద్ద రోబోల్ని కిడ్నాప్ చేసిన చిన్న రోబో

వైరల్ అవుతున్న సీసీ టీవీ దృశ్యాలు

ఎవరో ప్రోగ్రామింగ్ జరిపి ఇలా చేసి ఉండొచ్చన్న అనుమానాలు

11



ముందున్న చిన్న రోబోను (వృత్తంలో) అనుసరిస్తున్న పెద్ద రోబోలు

గురువారం | 21-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 216 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి సా. 5.03 తదుపరి సప్తమి; నక్షత్రం: పుష్యమి మ. 3.35 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె. 5.13 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.09-10.54, మ. 2.36-3.21; అమృతఘడియలు: ఉ. 8.59-10.38; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ముంబైలోని ఓ పోలింగ్ బూత్‌కు ఓటు వేయడానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన నటుడు షారుఖ్‌ఖాన్

మహాయుతిదే మహారాష్ట్ర!

బీజేపీ కూటమికే వి జయావకాశాలు ఎక్కువ



ఝార్ఖండ్‌లోనూ ఎన్డీయేకే చాన్స్!

పలు ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడి

మహారాష్ట్రలో 58.22% పోలింగ్

ఝార్ఖండ్‌లో 67.59%.. ఎల్లుండి ఫలితాలు

న్యూఢిల్లీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశంలో అధికార, ప్రతిపక్ష కూటములు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన 'మహా' యుద్ధానికి తెరపడింది. మహారాష్ట్రతోపాటు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఈవీఎంల్లో నిక్షిప్తం చేసిన తీర్పు శనివారం వెలువడనుంది. ఏ రాష్ట్రంలో అధికార పీఠం ఎవరిదో శనివారం మధ్యాహ్నానికే తేలిపోనుంది! అయితే.. మరాఠా గడ్డపై బీజేపీకి అత్యధిక అసెంబ్లీ సీట్లు దక్కనున్నాయని, అక్కడ అధికార పీఠం మహాయుతి కూటమికే దక్కుతుందని.. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ కూటమికి భంగపాటు తప్పదని.. అటు గనుల గడ్డ ఝార్ఖండ్‌లోనూ ఎన్డీయే కూటమిదే గెలుపని అత్యధిక సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ నియోజకవర్గాలకు

మిగతా 11వ పేజీలో...

ఏం జరుగుతోంది?

కీలక కేసుల్లో దర్యాప్తుపై చంద్రబాబు అసంతృప్తి!

మద్యనిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి మద్యం ఉత్పత్తి, సరఫరా, విక్రయాలు అన్నీ తన చేతిలో పెట్టుకున్నాడు. వేలకోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయి. బాధ్యులెవరో తెలుసు. వారిని అరెస్టు చేయాలి కదా? అసలు సూత్రధారులను అరెస్టు చేయకపోతే ప్రజలకు ఏమని సమాధానం చెబుతాం?

పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని వైసీపీ నేతలు తినేశారు. లక్షల టన్నుల బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు తరలించి వేల కోట్లు దోచేశారు. ఇదొక పెద్ద మాఫియా. సూత్రధారులు, పాత్రధారులు, దోపిడీదారులపై ఫోకస్ పెట్టలేదు. కాకినాడ గోడౌన్లలో వేల టన్నుల రేషన్ బియ్యం ఉంది. దానిపై కేవలం నిత్యావసరాల చట్టం సెక్షన్ 6ఏ కింద కేసులు పెడితే సరిపోతుందా? ఐదేళ్ల దోపిడీ సంగతేంటి?

కేవలం దోపిడీ చేసేందుకే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం పెట్టారు. ఆటగాళ్లే లేని ఆటలకు 119 కోట్లు ఖర్చు చేశారు. అవినీతి కోట్లలో జరిగింది. పరికరాల కొనుగోళ్లు, ముగింపు ఉత్సవాల్లో అడ్డగోలుగా దోచేశారు. అదెంత వరకు తేల్చారు? సీఐడీ ఇంత స్లోగా పని చేయడమా? - చంద్రబాబు

పోలీసు ఉన్నతాధికారులతో వరుస సమీక్షలు

గనుల వెంకటరెడ్డికి ఈజీగా బెయిల్ ఎలా?

మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో నత్తనడక

చిత్తూరులో వేల ఎకరాల భూములు కబ్జా

మద్యం కుంభకోణంలో అరెస్టులు లేవు

'ఆడుదాం ఆంధ్రా'లో అవినీతి పట్టదా?

రేషన్ బియ్యం మాఫియాను వదలొద్దు

మైనింగ్ దోపిడీదారులు జైలుకు వెళ్లాల్సిందే

ఉన్నతాధికారులకు సీఎం స్పష్టీకరణ

రెండు రోజుల్లో కీలక నిర్ణయాలు?



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కీలకమైన కేసుల దర్యాప్తులో పురోగతి లేదంటూ సీఐడీ, ఏసీబీ అధికారులపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. ఏపీలో వైసీపీ పోలీసింగ్ ముగిసిందని గ్రహించాలని.. తప్పు చేసిన వ్యక్తులకు వంత పాడే రోజులు పోయాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు పోలీసు వ్యవస్థ ఒక రాజకీయ పార్టీ కోసం పని చేసిందన్నారు. ఇప్పుడు శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పని చేయాలని,

మిగతా 13వ పేజీలో...

కీలకమైన కేసుల్లో అసలేం జరుగుతోంది? గనుల ఘనుడు వెంకటరెడ్డి బెయిలుపై ఎలా బయటికి వచ్చారు? మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసు దహనం కేసు దర్యాప్తులో పురోగతి ఏమిటి? ఐదేళ్ల రెచ్చిపోయిన మద్యం, రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోరా? 'స్కిల్ కేసు'లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ వాంగ్మూలాన్నే తారుమారు చేసిన ఉదంతంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఆయా కేసుల్లో సెక్షన్లు బలంగానే పెట్టారా? బలహీనంగా పెడితే దానికి కారణం ఏమిటి, కారకులు ఎవరు?... ఈ మొత్తం అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం, బుధవారం వరుసగా 2 రోజులు రాత్రి పొద్దుపోయాక పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. సీఐడీ, ఏసీబీతోపాటు ఐదుగురు అత్యున్నత స్థాయి అధికారులతో ఆయన భేటీ అయ్యారు. పోలీసు అధికారులు ఇచ్చిన వివరణలు, సమాధానంపై ఆయన అంతగా సంతృప్తి వ్యక్తం చేయలేదని తెలిసింది. తాజా పరిణామాలు, పరిస్థితుల ఆధారంగా 2 రోజుల్లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని సమాచారం. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం అసలేం జరిగిందంటే..



14

అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయరేం?

పోస్టులు పెట్టించిన వారినీ అరెస్టు చేయాల్సిందే

ప్యాలె్‌సలో ఉన్నోళ్లనూ అరెస్టు చేస్తేనే మహిళలకు భద్రత

నన్నూ, అమ్మనూ, సునీతనూ అవమానించారు

ఎమ్మెల్యేలను గెలిపించుకోలేని వాళ్లకు విపక్ష హోదానా?

చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లుగా కడప స్టీల్ ఫ్యాక్టరీ!

కడపలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యలు



14

ఇదేం భాష..?

నగర ప్రథమ పౌరుడు మాట్లాడేది ఇలాగేనా?

కుటుంబ సభ్యులూ, తల్లులపైనా దాడులా?

గుంటూరు మేయర్ భాషను అంగీకరించలేం

కావటి మనోహర్ నాయుడిపై మండిపడిన హైకోర్టు

బాధ్యతగా మెలగాలని చెప్పండి.. లాయర్‌కు ఆదేశం

41(ఏ) నోటీసు ఇవ్వాలని పోలీసులకు నిర్దేశం

25న రావాలని ఆర్జీవీకి మళ్లీ నోటీసు

జనంలోకి మనం

త్వరలో ప్రజలతో ముఖాముఖి

రాష్ట్రాభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యం

స్వయంగా గ్రామాల్లో పర్యటిస్తా

టీడీపీతోనే సంక్షేమం ప్రారంభం

అభివృద్ధితోనే రాష్ట్రానికి సంపద

సంక్షేమానికి సర్కారు ఆదాయం

వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం

అప్పులు, తప్పులు, పాపాలు, నేరాలు

సవాళ్లు, సమస్యలను అధిగమిస్తాం

శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం

సమాజానికి సవాల్‌గా మారితే బహిష్కరణే

కూటమి ప్రభుత్వ పాలనపై చంద్రబాబు అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం

రాష్ట్రంలో అభివృద్ధి జరిగితే ఆదాయం పెరుగుతుంది. ఆ ఆదాయం నుంచి ప్రజలకు సంక్షేమం అందిస్తాం. దీనికి సమయం కావాలి. ఇది అసాధ్యం కాదు. అలా అని రాత్రికి రాత్రే అన్నీ అయిపోవు. అభివృద్ధి, సంక్షేమంలో సవాళ్లు, సమస్యలను అధిగమించి ముందుకు వెళ్తాం. - చంద్రబాబు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ చూడని విధంగా ప్రజలు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. వారి ఆకాంక్షల మేరకు పరిపాలన చేస్తాం. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పిద్దాం" అని సీఎం చంద్రబాబు అన్నారు. బుధవారం శాసనసభలో

మిగతా 13వ పేజీలో...



కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రులు

గంజాయి, డ్రగ్స్‌పై 'ఈగిల్' కన్ను

సరఫరా, అమ్మకాల నియంత్రణకు కొత్త పోలీస్ విభాగం

అసెంబ్లీ ముందుకు 20 బిల్లులు.. రాష్ట్ర కేబినెట్ ఆమోదం

స్థానిక సంస్థల అధిపతులపై అవిశ్వాసం బిల్లులు మాత్రం వాయిదా

ఆలయ ట్రస్టుల్లో బ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులకు చోటు

ప్రాజెక్టులకు మొబిలైజేషన్ అడ్వాన్సుల పునరుద్ధరణ 12

జ్యుడీషియల్ ప్రివ్యూ రద్దు.. పర్యాటకం, క్రీడా విధానాలకు ఓకే

పది పరిశ్రమల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోద ముద్ర



మరో పదేళ్లు చంద్రబాబే సీఎం

ఐదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు ఏపీ ఎకానమీ

ఆర్థిక వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది

ప్రచార యావ కోసం పాస్ పుస్తకాలపైనా బొమ్మలు

జగన్ విధ్వంస ఫలితాలు వారసత్వంగా వచ్చాయి

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

చంద్రబాబు విజన్‌తో తిరిగి నమ్మకం ఏర్పడింది

ఆయన ఆదేశాల మేరకు మేం పనిచేస్తాం 12

అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

కూటమి ప్రభుత్వం 150 రోజుల పాలనపై చర్చ



14

నా తల్లి,చెల్లి పేరుతో రాజకీయాలు

చంద్రబాబుకూ కుటుంబం ఉంది

తన తల్లిదండ్రులకు తిండి పెట్టారా?

వారికి ఆయన తలకొరివి పెట్టారా?

షర్మిలపై బాలకృష్ణ తప్పుడు ప్రచారం చేయించలేదా?

కుటుంబంలో విభేదాలు నిజమే

మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు

14

నోరే కదా.. అనేస్తే పోలా!

చంద్రబాబు కుటుంబంపై జగన్ అక్కసు

నిరాడంబరతకు మారు పేరు వారు

ఏనాడూ నారావారిపల్లె దాటని తల్లిదండ్రులు

అధికారం వైపు కన్నెత్తిచూడని తోబుట్టువులు

బాబే వెళ్లి వారందరినీ చూసి వస్తున్నవైనం

వారి గురించి తెలియకుండా జగన్ అవాకులు



విశాఖలోని రుషికొండ ప్యాలెస్ పక్కన నిరుపయోగంగా ఉన్న పర్యాటక శాఖ భూమి

బే పార్కులో భూకోణం

వైసీపీ పెద్దల చేతిలో 300 కోట్ల భూమి!

కేటాయించిన భూమిలో 9 ఎకరాలు ఖాళీ

పాతికేళ్లయినా అభివృద్ధి చేయని వైనం

రుషికొండ బీచ్ పక్కనే మరో 3 ఎకరాలు ఆక్రమించి కంచె వేసిన వైసీపీ నేతలు

సర్కారు స్వాధీనం చేసుకుంటుందా?

వైసీపీ హయాంలో చేతులు మారిన ప్రాజెక్టు

లీజు గడువు అవ్వకుండానే 99 ఏళ్లకు పెంపు

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

వైసీపీ నేతలకు 'విశాఖ' ఒక బంగారు గని! భూములు దోచుకున్నారు. అస్మదీయులకు కారుచౌకగా కట్టబెట్టారు. పర్యాటక ప్రాజెక్టులను కైవసం చేసుకున్నారు. అలాంటి ప్రాజెక్టుల్లో ఒకటి.. 'బే పార్కు'! ఇందులో మరో భూకోణం బయటికి వచ్చింది. బేపార్కుకు ప్రభుత్వం లీజుకు అప్పగించిన స్థలంలో తొమ్మిదెకరాల భూమి పాతికేళ్లుగా

మిగతా 13వ పేజీలో...

వలంటీర్ల వ్యవస్థ

వైసీపీ హయాంలోనే

రద్దు



వారిని కొనసాగిస్తూ జగన్ జీవో ఇవ్వలేదు

లేని వ్యవస్థను ఎలా కొనసాగిస్తాం: మంత్రి డోలా

మండలిలో వైసీపీ నిరసనలకు సమాధానం

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ప్రస్తుతం వలంటీర్లు లేరు. వైసీపీ ప్రభుత్వం 2023 ఆగస్టు వరకే వలంటీర్ల వ్యవస్థ కొనసాగిస్తూ జీవో ఇచ్చింది. సెప్టెంబరు 2023లో వారిని కొనసాగిస్తూ జీవో ఇవ్వలేదు. అంటే వారు ఉనికిలో లేరు. కాబట్టే కొనసాగించలేకపోతున్నాం. లేని పిల్లవాడికి పేరు ఎలా పెడతాం?' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రశ్నించారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. 'గ్రామ, వార్డు వలంటీర్లను రెన్యువల్ చేయకుండా మోసం చేసింది జగనే. ప్రస్తుతం రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ లేదు. ఉనికిలో లేని వలంటీర్లతో ఎన్నికల ముందు ఫేక్ రాజీనామాలు చేయించారు. గత ప్రభుత్వం వలంటీర్లను కొనసాగించి ఉంటే మేం వారిని ఉంచి

మిగతా 12వ పేజీలో...

కర్నూలులో హైకోర్టు బెంచ్

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

లోకాయుక్త, హక్కుల కమిషన్ కార్యాలయాలు అక్కడే కొనసాగింపు

ఏపీఈఆర్‌సీ ఆఫీసు మాత్రం అమరావతికి



కర్నూలు బెంచ్‌పై హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ

సీమలో ఎన్ని కేసులు ఉన్నాయో తెలపాలని వినతి

ప్రజాగళం హామీ నెరవేర్చే దిశగా సీఎం చంద్రబాబు అడుగులు

బెంచ్ పరిధిలో 8 రాయలసీమ జిల్లాలు.. రాష్ట్ర విస్తీర్ణంలో ఈ ప్రాంతం 43% పైనే.. 4.95 కోట్ల జనాభాలో 1.59 కోట్ల మంది ఇక్కడివారే

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రజాగళం యాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. కర్నూలులో బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. దానిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపాలని నిశ్చయించింది. లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. వీటిని అమరావతికి తరలించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం వార్తలు వచ్చాయి. అయితే

మిగతా 3వ పేజీలో...



13

విద్యార్థులకు తీరిన ఫీజు కష్టాలు

ఇకపై కాలేజీలకే రీయింబర్స్‌మెంట్

ఈ ఏడాది నుంచే అమలు.. ఉత్తర్వులు జారీ

శ్రీ గురుభ్యోనమః

శ్రీ గురుభ్యోనమః

శ్రీ గురుభ్యోనమః

గర్తపురికి స్వాగతం ! సుస్వాగతం !!



జగద్గురు
శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి



జగద్గురు
శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి

దక్షిణామ్నాయ శృంగేరీ శారదా పీఠాధీశ్వరులు
జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి అనుగ్రహ ఆశీస్సులతో
జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి వారి ఆంధ్రదేశము నందు విజయయాత్రలో భాగముగా
గుంటూరు పట్టణమునకు విచ్చేయుచున్న శుభసందర్భములో **వందనం... పాదాభివందనం...**

ది. 21-11-2024 గురువారం
సాయంత్రం గం॥ 6.00ల నుండి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం,
ఆర్. అగ్రహారం నుండి శోభాయాత్రగా శ్రీ శృంగేరీ శంకరమఠం,
శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం, సంపత్ నగర్,
గుంటూరునకు విజయము చేయుచున్నారు.

అందరూ ఆహ్వానితులే

ది. 22-11-2024 శుక్రవారం
సాయంత్రం గం॥ 6.00లకు
గురు వందనం
వేదిక : శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం,
హిందూ కాలేజి ఎదురుగా, గుంటూరు

శ్రీ చరణుల ఆశీస్సులతో...

POLISETTY SOMASUNDARAM GROUP OF COMPANIES, GUNTUR

కర్నూలులో హైకోర్టు బెంచ్!!

(మొదటి పేజీ తరువాయి)



హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేయాలని నిశ్చయించిన నేపథ్యంలో లోకాయుక్త, హక్కుల కమిషన్ సహా న్యాయ వ్యవస్థకు చెందిన కొన్ని కార్యాలయాలను అక్కడే కొనసాగించాలని కేబినెట్ నిశ్చయించింది. అదే సమయంలో పై రెండు కార్యాలయాలను కర్నూలులో కొనసాగించాలని.. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయాన్ని మాత్రం అమరావతికి తరలించాలని నిర్ణయించింది. విద్యుత్ సంస్థల అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నందువల్ల ఏపీఈఆర్‌సీ కార్యాలయం రాష్ట్ర రాజధానిలో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. కాగా.. రాయలసీమలోని 8 జిల్లాలను ప్రతిపాదిత కర్నూలు బెంచ్ పరిధిలోకి తేవాలని నిర్ణయించిన ప్రభుత్వం.. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన సమాచారం ఇవ్వాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ కూడా రాసింది. సీమ ప్రాంతం పరిధిలో ప్రస్తుతం హైకోర్టులో ఎన్ని కేసులున్నాయో తెలపాలని కోరింది. సివిల్, క్రిమినల్, రివిజన్లు, రిట్ పిటిషన్లు, పారిశ్రామిక, పన్ను వివాదాలతో ముడిపడిన కేసులు, ఇతరత్రా కేసుల సంఖ్యకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అలాగే రెండు మూడేళ్లుగా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు పంపాలని అభ్యర్థించింది. ఒక బెంచ్ కొత్తగా ఏర్పాటు చేయాలంటే.. మొత్తం కేసుల్లో మూడింట ఒక వంతు సదరు ప్రాంతం పరిధిలో ఉండాలి. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 32 (3) ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం లభిస్తే బెంచ్ ఏర్పాటు చేయవచ్చు. గవర్నర్ ఆమోదం తర్వాత కేంద్రం, సుప్రీంకోర్టుల ఆమోదం లాంఛనప్రాయమేనంటున్నారు. అయితే సాధారణంగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా ఏకీభవించాల్సి ఉంటుంది. మొదటి నుంచీ కర్నూలుకు అన్యాయం జరుగుతోందన్న భావన ఆ ప్రాంత వాసుల్లో బలంగా ఉంది. 1953లో ఆంధ్ర రాష్ట్రం అవతరించినప్పుడు కర్నూలునే రాజధానిగా ప్రకటించారు. అయితే హైదరాబాద్ రాష్ట్రం విలీనంతో 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. హైదరాబాద్‌ను రాజధానిని చేయడంతో కర్నూలుకు నిరాశే ఎదురైంది. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా చేశారు, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఆనాడే ప్రకటించారు. అయితే జగన్ సీఎం అయ్యాక రాజధానిపై మూడు ముక్కలాట ఆడి.. కర్నూలును న్యాయరాజధానిగా చేస్తామని మభ్యపెట్టారు. ఏదీ జరక్కపోవడంతో సీమ ప్రజలు ఇలాంటి హామీలు నమ్మలేని స్థితికి వచ్చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటును సాకారం చేయాలని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. సదరు బెంచ్ కోసం స్థలసేకరణ చేసి శాశ్వత భవనాలు నిర్మించేందుకు వేగంగా అడుగులు వేస్తూనే.. మరోవైపు పై స్థాయిలో అవసరమైన అనుమతులు తీసుకునేందుకు శ్రీకారం చుట్టారు. 2022లో రాయలసీమలో 8 జిల్లాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర జనాభా 4.95 కోట్లు కాగా.. సీమలో 1.59 కోట్ల మంది ఉన్నారు. మొత్తం రాష్ట్ర జనాభాలో ఇది 25 శాతం కంటే ఎక్కువ. మొత్తం రాష్ట్ర విస్తీర్ణంలో ఈ ఎనిమిది జిల్లాల విస్తీర్ణం 43 శాతం పైనే.

బందరులో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

» సినీనటులు పాయల్ రాజ్‌పుత్, నయన్ సారిక సందడి



సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, సినీతారలు పాయల్‌రాజ్‌పుత్, నయన్ సారిక తదితరులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీనటులు పాయల్ రాజ్‌పుత్, నయన్ సారిక సందడి చేశారు. ఈ సందర్భంగా కొల్లు నీలిమ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో సీఎంఆర్ మాల్ రేట్లు ఉన్నాయన్నారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ సీఎంఆర్‌లో నాణ్యమైన వస్త్రాలు తక్కువ ధరలకు లభిస్తున్నాయన్నారు. సీఎంఆర్ వ్యవస్థాపక చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. మచిలీపట్నంలో 37వ షోరూంను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. సీఎంఆర్ ఎండీ మావూరి మోహన్ మాట్లాడుతూ అన్ని రకాల వెరైటీలు, డిజైన్లు తమ షాపింగ్ మాల్‌లో లభిస్తాయన్నారు.

నెల్లూరు జైలుకు మున్నా గ్యాంగ్

ఒంగోలు క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైవే కిల్లర్ మున్నా గ్యాంగ్‌ను రాజమండ్రి జైలు నుంచి నెల్లూరు జైలుకు తరలించారు. ఒంగోలు జిల్లా కోర్టులో మూడు కేసులకు సంబంధించి వాయిదాలు ఉండటంతో రాజమండ్రి జైలులో ఉన్న 12 మంది, నెల్లూరు జైలులో ఉన్న ముగ్గురిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ మూడు కేసుల విచారణను వచ్చే నెల 4వ తేదీకి న్యాయాధికారి అమ్మన్ రాజా వాయిదా వేశారు. దీంతో 15 మంది ముఠా సభ్యులను నెల్లూరు జైలుకు తరలించారు.

తెగులు సోకిన చైనా వెల్లుల్లి సీజ్

విజయవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి దిగుమతి అయిన తెగులు సోకిన వెల్లుల్లిని కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. ఇటీవలి కాలంలో చైనా నుంచి వెల్లుల్లి ఎక్కువగా దిగుమతి అవుతున్న నేపథ్యంలో విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ (ప్రివెంటివ్) అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. నెల్లూరుకు సమీపంలో 9,990 కిలోల వెల్లుల్లి బస్తాలతో వెళ్తున్న వ్యాన్‌ను బుధవారం పట్టుకున్నారు. రూ.21.97లక్షల విలువైన 333 బస్తాలు వ్యాన్‌లో ఉన్నట్టు గుర్తించారు. కేంద్రం తీసుకొచ్చిన ప్లాంట్ క్వారంటైన్ 2003 ఉత్తర్వుల ప్రకారం చైనా వెల్లుల్లిని దిగుమతి చేసుకోవడం నిషేధం. బిహార్‌లోని జహంజర్‌పూర్ నుంచి ఈ సరుకును తమిళనాడులోని కోయంబేడుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఈ వెల్లుల్లి నమూనాలను ప్రయోగశాలకు పంపగా వాటికి ఎంబెల్లిసియా అల్లి (పొడి తెగులు) ఉన్నట్టు నిర్ధారణ అయింది. దీనిపై తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

శిలలను శిల్పాలుగా మార్చిన అధ్యాపకులు

» జేకేసీ పూర్వ విద్యార్థినని చెప్పుకోవడానికి గర్వపడతా: డీజీపీ

» రూ.2.50 కోట్లతో ఆధునికీకరించిన ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియం ప్రారంభోత్సవంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, చిత్రంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): "గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎంతో మందికి చదువుతో పాటు సంస్కారం నేర్పించారు.. ఆకృతి లేని రాళ్లలాంటి మాలాంటి ఎంతోమందిని శిల్పాలుగా తీర్చిదిద్దారు.. ఆ ఘనత గుంటూరులోని జేకేసీ కళాశాల అధ్యాపకులదే" అని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గుంటూరులోని జేకేసీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో నూతనంగా రూ.2.50 కోట్లతో ఆధునీకరించిన జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి ఆడిటోరియాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. నాలుగున్నర దశాబ్దాల క్రితం జేకేసీ కళాశాలలో చదువుకున్నానని.. ఇక్కడ నేర్చిన చదువు, క్రమశిక్షణ కారణంగానే నేషనల్ పోలీసు అకాడమిలో చేరినట్టు తెలిపారు. ఇక్కడ చదివిన ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారన్నారు. ఏ రంగంలో ఉన్నా జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థిగా చెప్పుకోవడానికి గర్వపడతామన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తాను ఇక్కడ నేర్చిన క్రమశిక్షణ, అంకితభావంతోనే రాజకీయాల్లో రాణిస్తున్నానని వినుకొండ ఎమ్మెల్యే, రాష్ట్ర చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. జేకేసీ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ఉన్నతస్థానాల్లో ఉన్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు.

27న పోలవరానికి సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో 27న సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అధికారికంగా పర్యటన ఖరారు కానప్పటికీ... ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జలవనరులశాఖ అధికారులు చేస్తున్నారు.

రవాణా రంగం కుదేలు

» గత ప్రభుత్వంలో గ్రీన్ ట్యాక్స్ పెంపుతో ఇబ్బందులు

» సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలి

» లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

విజయవాడ(పటమట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రవాణా రంగం కుదేలైందని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్‌ను రూ.200 నుంచి రూ.25 వేల వరకు పెంచడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. విజయవాడలోని అసోసియేషన్ హాల్లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరాధ రుసుం వెయ్యి నుంచి రూ.20 వేల వరకు పెంచారని, క్వార్టర్లీ ట్యాక్స్ 30 శాతం పెంచారని, రవాణారంగంపై తక్కువ సమయంలో పెద్దమొత్తంలో ఆర్థిక భారం మోపినందుకు రవాణా యజమానులందరూ తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. వెంటనే రవాణాశాఖ మంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాల సంక్షేమ సంఘం చైర్మన్‌గా విజయకుమార్



విజయకుమార్‌ను అభినందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కృష్ణ ప్రసాద్

తాడేపల్లి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల సంక్షేమ సహకార ఆర్థిక సంఘం చైర్మన్‌గా పెదపూడి విజయకుమార్ గుంటూరు జిల్లా తాడేపల్లిలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విజయకుమార్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అభినందించారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి అంజనేయులును ఉండవల్లిలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి జ్యోతిబసు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి ఐఎంఏ ఏపీకాన్ 2024

గుంటూరు మెడికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ 66వ రాష్ట్ర సదస్సు ఐఎంఏ ఏపీకాన్ 2024 ఈ నెల 22, 23, 24 తేదీల్లో గుంటూరులో జరుగుతుందని సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ తెలిపారు. బుధవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో జరిగే ఈ సదస్సుకు 1500 మంది వైద్యులు హాజరౌతున్నట్లు తెలిపారు. 16 ఏళ్ల తర్వాత సదస్సు మళ్లీ గుంటూరులో జరుగుతోందన్నారు.

నేటి నుంచి కట్టుడు పళ్ల నిపుణుల జాతీయ సదస్సు

మంగళగిరి సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రోస్థోడాంటిక్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు కట్టుడు పళ్ల ప్రత్యేక వైద్య నిపుణుల 52వ జాతీయ స్థాయి సదస్సు జరుగుతుందని కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ టి.కృష్ణమోహన్ తెలిపారు. మంగళగిరి ఐటీఎన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ సదస్సు దేశంలోని ప్రోస్థోడాంటిక్ రంగానికి గొప్ప మైలురాయిగా నిలుస్తుందన్నారు.

పోలీసు పీఈటీ దరఖాస్తు గడువు పొడిగింపు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన ఉద్యోగార్థుల దేహదారుఢ్య పరీక్ష(పీఈటీ)లకు దరఖాస్తు గడువును వారం రోజులు పొడిగించినట్టు రాష్ట్ర పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. దేహదారుఢ్య శారీరక సామర్థ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల వినతి మేరకు దరఖాస్తు గడువును ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తున్నట్లు తాజా ప్రకటనలో పీఆర్‌బీ చైర్మన్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బైడెన్ చిచ్చు

అలా ఓడిపోయి, ఇక దిగిపోబోతున్న తరుణంలో, డోనాల్డ్ ట్రంప్‌కు ఇంత సెగపెట్టిపోవాలన్న ఆలోచన జో బైడెన్‌కు ఎందుకు కలిగిందో మరి. అమెరికా తయారీ లాంగ్‌రేంజ్ మిసైల్స్‌ను రష్యన్ భూభాగాలమీద ప్రయోగించడానికి ఆయన అనుమతించిన కొద్దిగంటల్లోనే ఉక్రెయిన్ ఆ దుశ్చర్యకు పాల్పడింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి వెయ్యిరోజులు అవుతున్న సందర్భంలో బైడెన్ తీసుకున్న ఈ దూకుడు నిర్ణయం దాని దిశనూ తీవ్రతనూ ఒక్కసారిగా మార్చివేసింది. ఉక్రెయిన్‌పై రష్యా ప్రతిదాడి ఏ స్థాయిలో ఉంటుందో ఊహకు అందని పాశ్చాత్యదేశాలన్నీ అమెరికా బాటలో నడచి ఉక్రెయిన్ రాజధానిలో తమ రాయబార కార్యాలయాలను మూసేస్తున్నాయి. అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సులభం చేసుకొని, రష్యా అధ్యక్షుడు తన అమ్ములపొదిని చక్కదిద్దుకోవడం పరిస్థితిని వేడెక్కిస్తోంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు ఆర్థిక, ఆయుధ సాయంతో అండగా ఉంటున్న బైడెన్, యుద్ధం ముగిసేవరకూ అలాగే నిలవాలనుకోవడంలో తప్పులేదు. ఆయన అధికారంలో కొనసాగితే వేరే విషయం. కానీ, అమెరికన్లు ఆయన పార్టీని ఓడించి, ప్రత్యర్థిని అధికారంలో కూచోబెడుతున్నప్పుడు, ఆఖరురోజుల్లో ఇలా అడ్డుతోవలు తొక్కడం నైతికంగా సరికాదు.


ట్రంప్ వచ్చేలోగా మరో రెండునెలలపాటు మంటలు రాజేయాలన్నది బైడెన్ ఆలోచనగా కనిపిస్తోంది. కమలాహారిస్ ఓటమి వెనుక ఉక్రెయిన్ యుద్ధం ఉన్నదో లేదో కానీ, ఆ యుద్ధాన్ని సత్వరమే ముగిస్తానన్న హామీ ట్రంప్ విజయంలో ఒక ముఖ్యమైన అంశం. యుద్ధం వెయ్యిరోజులకు చేరువవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఇటీవలే జర్మనీ సహా చాలా దేశాలు అది సత్వరమే ముగిసిపోవాలన్న ఆశాభావాన్ని వెలిబుచ్చాయి. వచ్చే ఏడాది తొలినాళ్ళలోనే దౌత్యంతో యుద్ధాన్ని ముగిసేట్టు చేయవచ్చునని ఉక్రెయిన్ అధ్యక్షుడు సైతం వ్యాఖ్యానించాడు. యుద్ధం ముగిసిపోవాలన్న వాదనలు ఎప్పటినుంచో ఉన్నా, ఇప్పుడు అవి గట్టిగా వినబడటానికీ, జోరందుకోవడానికీ ప్రధాన కారణం ట్రంప్ విజయం. ఆయన గాజా యుద్ధం ఆపుతాడన్న ఆశ ఎవరికీ లేదుగానీ, పుతిన్ కోసమే కావచ్చు, ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరిస్తాడన్న నమ్మకం మాత్రం అందరికీ ఉంది. తాను అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు ఇప్పటిలాగా అడ్డూఅదుపూ లేని ఆయుధసరఫరాలు ఉండబోవని ట్రంప్ ఇప్పటికే తేల్చేశాడు. యుద్ధాన్ని ముగించే ప్రణాళిక ఆయన వద్ద సిద్ధంగా ఉన్నదని ప్రచారం కూడా జరుగుతోంది. నాటోతో ఏ బాంధవ్యాలు, బాదరబందీలు లేనివాడు కాబట్టి, ఉక్రెయిన్ అన్నా, జెలెన్‌స్కీ అన్నా విశేషమైన ప్రేమాభిమానాలేమీ లేవు కనుక, పుతిన్ పక్షాన న్యాయనిర్ణయం చేస్తాడన్న వాదనలు బలంగా ఉన్నాయి.

ఉక్రెయిన్‌ను అడ్డుపెట్టుకొని రష్యామీద కక్ష తీర్చుకోవాలన్న కోరిక లేకుంటే ఈ యుద్ధం నిజానికి ఎప్పుడో ఆగిపోవాలి. రెండేళ్ళక్రితం కొన్ని కీలకమైన భూభాగాలు కోల్పోయిన ఉక్రెయిన్‌కు, ఇప్పుడు అది ఉన్నస్థితికీ తేడావుంది. ఆయుధసరఫరాలు నిరవధికంగా కొనసాగుతుంటే ఏ యుద్ధమూ ఆగదు. ఇజ్రాయెల్ విషయంలో మరింత అధికంగా జరుగుతున్నది ఇదే. అమెరికా అందించిన ఆయుధాలతో అది ఏకకాలంలో అనేకమంది శత్రువులతో యుద్ధం చేయగలుగుతోంది, వేలాదిమందిని ఊచకోతలు కోస్తోంది, పొరుగుదేశాల్లోకి చొచ్చుకుపోతోంది. ఉక్రెయిన్ యుద్ధంలో అటువైపు అణ్వాయుధాలున్న రష్యా ఉన్నందున, ఆయుధాల వినియోగం మీద అమెరికా ఇంతకాలమూ కొన్ని నియంత్రణలు పెట్టింది. ఇప్పుడు ఆ నిబంధనలకు స్వస్తిచెప్పి, రష్యా భాషలో చెప్పాలంటే, మూడో ప్రపంచయుద్ధానికి బైడెన్ స్వాగతం పలుకుతున్నారు. తాను దిగేలోగా, రేపు ట్రంప్‌కు పరిష్కారం సాధ్యంకాని స్థాయికి యుద్ధాన్ని తీసుకుపోవాలనీ, దౌత్యాలు, చర్చలు, ఇచ్చిపుచ్చుకోవడాలకు వీల్లేనిరీతిలో చిక్కుముళ్ళువేసిపోవాలనీ ఆయన అనుకుంటున్నారు. యుద్ధంతో ఇప్పటికే ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోయింది. రష్యాదాడుల్లో సర్వమూ నేలమట్టమై, నాలుగోవంతు జనాభాను కోల్పోయి, ఆర్థికంగా తేరుకోలేనిదశకు చేరుకుంది. పునర్నిర్మాణానికి ఐదువందలబిలియన్ డాలర్లు ఖర్చవుతాయన్నది ఎప్పుడో వేసిన అంచనా. ఇందుకు భిన్నంగా, ఆంక్షలతో మరింత లాభపడి, ఆర్థికంగా ఏ సమస్యలూ లేని రష్యా మరింతమంది సైనికులను బలిపెట్టడానికి సిద్ధంగా ఉంది. యుద్ధం తీవ్రమైతే అపారనష్టాలకు గురికావాల్సిన ఐరోపా దేశాలు తక్షణమే రంగంలోకి దిగి, రష్యాతో చర్చలు జరిపి, నిర్దిష్టమైన హామీలతో దానిని చల్లార్చాల్సిన అవసరం ఉంది.

చట్టసభల్లో మీ నడతను చరిత్ర గమనిస్తోంది!

న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో నేరుగా ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించే ఏకైక వ్యవస్థగా భారత రాజ్యాంగంలో శాసన వ్యవస్థకు విశిష్ట స్థానం ఉంది. 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించే ముందు రాజ్యాంగ సభలో అధ్యక్షులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగపు మూల స్వరూపం గురించి మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు ప్రజాభీష్టం మేరకు నడచుకోవాల్సి ఉంటుందని, ఈ ప్రజాభీష్టం నిరంతరం చట్టసభల్లో ప్రజాప్రతినిధుల ద్వారాను, అడపాదడపా నేరుగా సార్వత్రిక ఎన్నికల ద్వారాను వ్యక్తమవుతుందని అన్నారు. ఇదే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్రాల మంత్రివర్గాలు ప్రజలు నేరుగా ఎన్నుకునే లోక్‌సభకు, ఆయా రాష్ట్రాల శాసనసభలకు జవాబుదారీగా ఉండాలని రాజ్యాంగపు అధికరణాలు 75(3), 164(2) నిర్దేశిస్తున్నాయి. సభలో మెజారిటీ ఉంది కదా అని ప్రభుత్వాలు ఇష్టానుసారం వ్యవహరించడానికి లేదని, చట్టసభకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందని ఈ అధికరణాలు చెబుతున్నాయి. చట్టసభల్లో ప్రతి సభ్యుడికీ, ముఖ్యంగా ప్రతిపక్షానికి బలాన్నిచ్చే అధికరణాలివి. తదనుగుణంగా చట్టసభల నియమావళిలో సభ్యులకు, ప్రతిపక్షానికి ప్రభుత్వాన్ని నిలదీసే అధికారాన్నిచ్చే సాధనాలెన్నో పొందుపరచారు.

ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సమావేశాలు జరుగుతున్న ఈ తరుణంలో స్వయానా ముఖ్యమంత్రి ఈ జవాబుదారీతనం గురించి మాట్లాడటం విశేషం. 16వ శాసనసభకు నూతనంగా ఎన్నికైన సభ్యులను ఉద్దేశించి నవంబరు 12న జరిగిన ఒక అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ– ప్రతిపక్షం సభలో లేనంత మాత్రాన ప్రభుత్వం ఎవరికీ జవాబివ్వనక్కరలేదని భావించడం సరికాదని, ప్రతి సభ్యుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం పనితీరులో లోపాలుంటే ఎత్తి చూపడానికి సభను, సభ విధివిధానాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్బోధించారు. అప్పుడే ప్రజలకు మెరుగైన పాలన అందించగలమని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న సభా నాయకుడు 'నా ప్రభుత్వాన్ని నిలదీయండి' అని సభ్యులందరికీ పిలుపునివ్వడం అరుదే కాదు, అసాధారణం కూడా. దశాబ్దాలుగా శాసనసభ్యుడిగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసి సుపరిపాలనకు జవాబుదారీతనం ఎంత ముఖ్యమో అనుభవపూర్వకంగా ఆకళింపు చేసుకున్న ఒక రాజనీతిజ్ఞుడు చెప్పిన హిత వచనాలవి. ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా, పటిష్ఠంగా ఉంటేనే ప్రజాహితం సురక్షితమన్న నమ్మకం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మాటల్లో నిబిడీకృతమై ఉంది. ప్రశ్నించడం, చర్చించడం ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలని విశ్వసిస్తే తప్ప ఇలాంటి సందేశాలు వెలువడవు. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ అమాత్యులు అప్రమత్తంగా ఉండాలని, సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సర్వదా సిద్ధంగా ఉండాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సభాముఖంగా సూచించడం సభలో సత్సంప్రదాయాలు కొనసాగాలన్న అనుభవజ్ఞుల తపనకు అద్దం పడుతోంది.



ప్రభుత్వాన్ని నడుపుతున్న సభా నాయకుడు 'నా ప్రభుత్వాన్ని నిలదీయండి' అని సభ్యులందరికీ పిలుపునివ్వడం అరుదే కాదు, అసాధారణం కూడా. ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా, పటిష్ఠంగా ఉంటేనే ప్రజాహితం సురక్షితమన్న నమ్మకం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి మాటల్లో నిబిడీకృతమై ఉంది. ప్రచారకాంక్షతో సభలో నిబంధనలు ఉల్లంఘించే వారిని ఆ క్షణం గడిస్తే ఎవరూ గుర్తు చేసుకోరు. సభలో తగు సమయంలో, తగు రీతిలో, సందర్భోచితంగా స్పందిస్తూ, నియమాలను, సభాపతి ఆదేశాలను గౌరవిస్తూ పూర్తి సన్నద్ధతతో విధులు నిర్వర్తించేవారినే చరిత్ర గుర్తుంచుకుంటుంది.

'సంపద సృష్టి', 'సంపద వ్యాప్తి' గురించి తరచూ ప్రస్తావించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నవంబరు 12న అవగాహన కార్యక్రమంలో విభిన్న సందర్భంలో ఈ పద ప్రయోగం చేసి ఒక కొత్త కోణం జోడించారు. శాసనసభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ ఆయన నేటి తరం శాసనసభ్యులు రాబోయే రోజుల్లో సమాజానికి ఆస్తిగా, సంపదగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. తన అర్ధ శతాబ్ది రాజకీయ అనుభవాన్ని రంగరించి, ఆదర్శ శాసనసభ్యుడు ఎలా నడచుకోవాలో చంద్రబాబు నాయుడు కొత్త సభ్యులకు పాఠంలా చెప్పారు. ఉత్తమ సంప్రదాయాలు నెలకొల్పాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం పొందగలుగుతారని ఆనాడు ముఖ్యమంత్రి సోదాహరణంగా చేసిన ఉద్బోధ భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని కోరుకునే శాసనకర్తలందరికీ కరదీపిక. ముఖ్యమంత్రి సందేశం నైజీరియాకు చెందిన విశ్వవిఖ్యాత సాహితీవేత్త చిన్వా అచేబీ ప్రజాస్వామ్యం గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని పోలి ఉంది. 'ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే విద్యావంతుల భాగస్వామ్యం; చైతన్యం, నైతికత మూర్తీభవించిన నాయకత్వం అవసరం' అన్నారు అచేబీ.

ప్రభుత్వాన్ని నిలదీయడం, ప్రజా సమస్యలపై చర్చించి శాస్త్రీయ పరిష్కారాలు సూచించడం, చట్టాలు చేయడం – ఇవీ చట్టసభల సభ్యుల ప్రధాన కర్తవ్యాలు. దురదృష్టవశాత్తు స్థానిక సంస్థలు, కార్యనిర్వాహక వ్యవస్థలోని ఇతర ప్రభుత్వ విభాగాలు సాధారణంగా నిర్వర్తించవలసిన విధులు చట్టసభల సభ్యులకు బదిలీ అవుతున్నాయి. చట్టసభల సభ్యులు సులువుగా ప్రజలకు అందుబాటులో ఉంటారు కనుక ప్రజల రోజువారీ సమస్యలు ఆలకించి, వాటి పరిష్కారానికి ఎక్కువ సమయం వెచ్చించవలసి వస్తోంది. దీనివల్ల వారు శాసనకర్తలుగా తమ ప్రధాన కర్తవ్యాల నిర్వహణకు తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు.

తీవ్రమైన, తక్షణ సమస్యల పరిష్కారానికి సభ దృష్టిని, ప్రభుత్వం దృష్టిని ఆకర్షించడం ఒక ఎత్తు అయితే, దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే చట్టాలు చేయడం, విధానాల రూపకల్పనలో భాగస్వాములు కావడం మరొక ఎత్తు. ఇందుకు అంకితభావం, అప్రమత్తత, పరిశ్రమ, పరిశోధన ఎంతో అవసరం. ప్రచారకాంక్షతో సభలో నిబంధనలు ఉల్లంఘించే వారిని ఆ క్షణం గడిస్తే ఎవరూ గుర్తు చేసుకోరు. సభలో తగు సమయంలో, తగు రీతిలో, సందర్భోచితంగా స్పందిస్తూ, నియమాలను, సభాపతి ఆదేశాలను గౌరవిస్తూ పూర్తి సన్నద్ధతతో విధులు నిర్వర్తించేవారినే చరిత్ర గుర్తుంచుకుంటుంది. తెలుగునాట వావిలాల గోపాలకృష్ణయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, కొణిజేటి రోశయ్య, చెన్నమనేని రాజేశ్వరరావు; జాతీయ స్థాయిలో హిరేన్ ముఖర్జీ, జార్జ్ ఫెర్నాండెజ్, మధు దండవతే, ఇంద్రజిత్ గుప్తా, సోమ్‌నాథ్ చటర్జీ, జైపాల్‌రెడ్డి లాంటి ఉత్తమ పార్లమెంటరీ వేత్తలు చట్టసభల్లో తమ పని తీరుతో చరిత్ర పుటల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. నిజానికి వీరిలో ఎవరికీ అధికారికంగా ప్రతిపక్ష నాయకుడి హోదా లేదు. వారిలో కొందరి పార్టీలకు అప్పట్లో పార్లమెంటరీ గ్రూపులుగా సైతం గుర్తింపు లేదు. అయినా వారు తమ విధులు అద్భుతంగా నిర్వర్తించడానికి ఇవేవీ అడ్డు రాలేదు. రాజ్యాంగం పట్ల, ప్రజల పట్ల, సభ పట్ల వారికున్న నిబద్ధతే వారిని రాణింపజేసింది. బహుశా ఈ మహామహులను దృష్టిలో ఉంచుకునే చంద్రబాబు నాయుడు శాసనసభ్యులు భావితరాలకు ఆస్తిగా, సంపదగా అవతరించాలని ఆకాంక్షించి ఉంటారు.

ఈ దఫా తొలిసారి ఎన్నికైన 84మంది శాసనసభ్యులకు ఇదొక సువర్ణావకాశం. శాసనసభ సమావేశాలు సజావుగా సాగుతున్నాయి. రోజువారీ పని గంటలు పెరిగాయి. ఇప్పటికే సభా నియమావళిలో సభ్యులకు అందుబాటులో ఉన్న సాధనాలెన్నో సభ్యులకు పరిచయమయ్యాయి. ప్రశ్నలు, స్వల్ప వ్యవధి ప్రశ్నలు, శూన్య కాలం, స్వల్ప కాలిక చర్చ, అత్యవసర ప్రస్తావనలు, సావధాన ప్రస్తావనలు, అర్ధ గంట చర్చ, మంత్రుల ప్రకటనలపై చర్చ, తాత్కాలిక బడ్జెట్, సాధారణ బడ్జెట్ ఆమోదం, పలు బిల్లుల ఆమోదం– ఇలా సభా ప్రక్రియలెన్నో నూతన సభ్యులు స్వల్ప వ్యవధిలోనే అవగతం చేసుకోగలిగారు. సభ్యులు సమావేశాలు జరిగేటప్పుడు ప్రతి రోజూ కార్యక్రమ పట్టిక చూడడం అలవాటు చేసుకుంటే చాలు, సమాజానికి 'ఆస్తి'గా, 'సంపద'గా అవతరించే అవకాశాలు అంది పుచ్చుకోవడం కష్టమేమీ కాదు. శాసనసభ ఏడాదికి కనీసం 70 రోజులు సమావేశం కావాలన్న స్పీకర్ సూచన అమలుకు నోచుకుంటే, ముఖ్యమంత్రి సందేశాన్ని సభ్యులు ఆచరణలో పెడితే యావద్దేశానికే ఆంధ్రప్రదేశ్ శాసనవ్యవస్థ ఆదర్శంగా నిలవగలుగుతుంది.



○ ప్రసన్న కుమార్ సూర్యదేవర
సెక్రటరీ–జనరల్, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ

మణిపూర్‌పై ఇంకా మీన'మోషా'లేనా?

మణిపూర్‌కు అదనపు సిఆర్‌పిఎఫ్ బలగాలను పంపించడం, అయిదు జిల్లాల్లోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పిఎ) అమల్లో పెట్టడం, ఇంటర్నెట్‌ను నిషేధించడం, ఆందోళనకారులు ఎమ్ఎల్ఏల ఇళ్లను ధ్వంసం చేయడం జాతీయ విషాదం! ఏడాదిన్నరగా అక్కడ అంతర్యుద్ధం వంటి పరిస్థితులు కొనసాగుతూ ఉండడం దేశ పాలకుల వైఫల్యాన్నే చాటుతున్నది.

బాధిత ప్రజల మనోభావాలను గౌరవించడం, సంయమనంతో కూడిన చర్చల ద్వారా సమస్యను న్యాయమైన పద్ధతిలో పరిష్కరించడం బీజేపీకి బొత్తిగా గిట్టదు. మైదాన ప్రాంతమైన ఇంఫాల్ లోయలో నివసిస్తున్న మెజారిటీ మెయితీలను కూడా ఎస్టీలుగా గుర్తిస్తూ కేంద్రానికి సిఫార్సులు పంపాలని గత సంవత్సరం ఏప్రిల్ 20న మణిపూర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. మురళీధరన్ జారీ చేసిన ఉత్తర్వులు గిరిజన తెగ అయిన కుకీలలో తీవ్ర అభద్రతా భావం సృష్టించి వారిని ఆందోళన మార్గం పట్టించింది. హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా అఖిల మణిపూర్ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్రమంతటా నిరసనకు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. ఆ తర్వాత గత ఏడాది మే 3న మెయితీ మూకలు పోలీసుల సహకారంతో కుకీ మహిళలను వివస్త్రలను చేసి హత్యాచారానికి గురి చేశారు, వారి మగవారినీ హతమార్చారు. దానితో ఉభయ వర్గాల మధ్య ఘర్షణలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. అలా కొనసాగిన హింస వల్ల 250 మందికి పైగా మరణించారు. 60,000 మందికి మించి నిర్వాసితులై పునరావాస శిబిరాల్లో దుర్భరమైన బతుకులు ఈడుస్తున్నారు. రెండు వైపులా గల ఆందోళనకారులు పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను పెద్ద సంఖ్యలో ఎత్తుకుపోయారు. ఇది కూడా హింస నిరవధికంగా కొనసాగడానికి దారి తీస్తున్నది.

కొద్ది కాలం నివురు గప్పినట్టున్న మణిపూర్ ఇటీవల తిరిగి వేడెక్కడం మొదలు పెట్టింది. ఈ మధ్యనే పది మంది కుకీలను మిలిటెంట్లుగా భావించి జిరిబమ్ జిల్లాలోని సిఆర్‌పిఎఫ్ దళాలు కాల్చి చంపారు. దానితో కుకీ తెగవారు కోపోద్రిక్తులయ్యారు. వారు మిలిటెంట్లు కాదని, తమ వాలంటీర్లు అని కుకీలు వాదిస్తున్నారు. ఆ తర్వాత ముగ్గురు మెయితీ మహిళల, వారి ముగ్గురి బాలల అపహరణ, హత్య జరిగిపోయాయి. పర్యవసానంగా 2000 మందికి పైగా అదనపు సిఆర్‌పిఎఫ్ దళాలను మణిపూర్‌కి పంపించి, అపరిమిత అధికారాలను సాయుధ దళాలకు కట్టబెడుతున్న ఎఎఫ్ఎస్‌పిఎ (AFSPA)ను తిరిగి విధించారు.

2021 జనాభా లెక్కల ప్రకారం మణిపూర్ జనాభాలో 53 నుంచి 60శాతం మంది మెయితీలు, 20 శాతం మంది నాగాలు, 16 శాతం మంది కుకీలు ఉన్నారు. మణిపూర్ భూభాగంలో 89 శాతం కొండ ప్రాంతం ఉంది. ఇది గిరిజన తెగలైన నాగాలు, కుకీలు, తదితరులు నివసిస్తున్న ప్రదేశం. మెజారిటీ మెయితీలు నివసిస్తున్న ఇంఫాల్ లోయ ఉన్నది 11శాతమే. కాని ఆ రాష్ట్ర అభివృద్ధి నిధుల్లో 80 శాతం ఈ లోయకే చెందుతున్నాయి. మిగిలిన 20 శాతం మాత్రమే గిరి ప్రాంతాల్లో ఖర్చవుతున్నది. ఆ విధంగా మెయితీలు పాలకుల ఆదరాభిమానాలకు పాత్రులు అవుతున్నారు. కొండల్లోని తెగలు పాలకుల ఆదరానికి దూరంగా బతుకుతున్న దృశ్యం కనిపిస్తున్నది. 60 మంది సభ్యులున్న శాసనసభలో మెయితీలకు చెందిన మైదాన ప్రాంతం (ఇంఫాల్ లోయ) నుంచి 40 మంది ప్రాతినిధ్యం వహిస్తుండగా, గిరిజన వర్గాల నుంచి ప్రతినిధులు 20 మంది మాత్రమే. మెయితీలు అనుభవిస్తున్న అప్రతిహత ఆధిపత్యం గురించి ఇంతకు మించి వివరించనక్కరలేదు. పైపెచ్చు మెయితీలు హిందువులు. నాగాలు, కుకీలు క్రైస్తవులు.



మణిపూర్‌లో ఇంతగా భిన్న వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు, మారణకాండ జరుగుతూ, అమాయకులు నిర్వాసితులు అవుతుంటే దేశ ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోడం, పార్లమెంటులో దీని గురించి వివరంగా మాట్లాడకపోవడం బాధితులకు పుండు మీద కారం చల్లినట్టు ఉంది. మణిపూర్ ఏమైపోయినా ఫర్వాలేదు మెజారిటీ ఓటు తమవైపు ఉండాలి, హిందువుల వైపు నిలబడ్డామనే సంకేతాన్ని పంపాలి అని కేంద్రంలోని బీజేపీ 'ప్రభువులు' నిర్ణయించుకొన్నారని మనం భావించాలి.

2022లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 32 మంది బలంతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. వాస్తవానికి మణిపూర్‌లో పూర్వం నుంచి ఉంటున్నవారు మెయితీలు, నాగాలే. బ్రిటిష్ పాలనలో వచ్చి చేరిన కుకీ తెగవారు కొండల్లో చిన్న చిన్న గ్రామాలు ఏర్పాటు చేసుకొని బతకడం ప్రారంభించారు. ఆ దశలో నాగాలకు, కుకీలకు ఘర్షణలు జరిగాయి. కాని ఇప్పుడు కుకీల ఆందోళనకు నాగాలు మద్దతు ఇస్తున్నారు. నిధుల్లో, అధికారంలో గుత్తాధిపత్యం వహిస్తున్న మెయితీలకు ఎస్టీ గుర్తింపు లభిస్తే తమకు తీవ్ర నష్టం జరుగుతుందని, మజ్జిగ పలచబడి మరింత అన్యాయానికి గురి అవుతామనే అవగాహనతో, చైతన్యంతో కుకీల మాదిరిగానే నాగాలు కూడా భయపడుతున్నారు. సమష్టి ఆందోళనకు సహకరిస్తున్నారు.

తాత్కాలిక దృష్టితో చూసినప్పుడు కుకీలను తీవ్రంగా ద్వేషిస్తూ వారిని తక్కువ చూపు చూస్తున్న బీజేపీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఈ సంక్షోభ విస్తరణకు తక్షణ బాధ్యుడని బోధపడుతున్నది. కుకీలు బయటి నుంచి వచ్చారని, గంజాయి సాగు చేస్తారని... ఇలా పలు రకాల ద్వేష భాషను ముఖ్యమంత్రి వారిపై ప్రయోగించారు. వాస్తవానికి మణిపూర్‌లోని అన్ని వర్గాలు గంజాయి సాగు చేస్తాయని, కానీ కుకీలను మాత్రమే వేలెత్తి చూపడం అలవాటుగా మారిందని అభిప్రాయం ఉన్నది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ 19మంది బీజేపీ శాసనసభ్యులు ప్రధాని మోదీకి ఇటీవలనే లేఖ రాశారు. అయినా కేంద్రంలో చలనం లేదు. ఇప్పుడు తాజా కల్లోల పరిస్థితుల నేపథ్యంలో బీరేన్ సింగ్ ప్రభుత్వానికి రెండు భాగస్వామ్య పక్షాలు మద్దతు ఉపసంహరించుకున్నాయి.

1948–49లో మణిపూర్ భారతదేశంలో విలీనం కాక ముందు తాము ఎస్టీలమని ఆ హోదాను తమకు తిరిగి ఇవ్వాలని మెయితీలు వాదిస్తున్నారు. మణిపూర్ విలీనం తర్వాత తమకు ఆదివాసీ హోదా కొనసాగించకపోడానికి కారణం తాము మైదాన ప్రాంతీయులుగా సకల సౌకర్యాలు కలిగి ఉన్నందువల్లనే అనే వాస్తవాన్ని పూర్తిగా తెలిసి కూడా వారు ఎస్టీ హోదాను ఆశించడం తగనిది. గత మే 3వ తేదీ నాటికి అంటే కల్లోలం మొదలై ఏడాది ముగిసినప్పటికీ ఘర్షణల్లో 221 మంది మరణించగా ఈ సంఖ్య ఇప్పుడు 250కి మించినట్టు రూఢి అవుతున్నది. అన్నింటికీ మించి ఇంతగా భిన్న వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు, మారణకాండ జరుగుతూ, అమాయకులు నిర్వాసితులు అవుతుంటే దేశ ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోడం, పార్లమెంటులో దీని గురించి వివరంగా మాట్లాడకపోడం బాధితులకు పుండు మీద కారం చల్లినట్టు ఉంది. తమకు ప్రత్యేక పాలన వ్యవస్థను, శాసనసభను ఏర్పాటు చేయాలని కుకీలు కోరుతున్నారు.

మణిపూర్‌లో ఇంకా వలస పాలనే కొనసాగుతున్నదని, భారత చరిత్ర పాఠ్య గ్రంథాలలో ఈశాన్యానికి తగిన ప్రాతినిధ్యం లేదని, అందుచేతనే ఆ ప్రాంత ప్రజలు బయటివారుగా పరిగణన పొందుతున్నారని, తమ సంక్షోభంపై కేంద్రం పాటిస్తున్న మౌనానికి ఇదే కారణమని మణిపూర్ ఎంపీ బిమల్ అకోయిజం పార్లమెంటులోనే ప్రకటించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై గత జూలై మొదటివారంలో ఆ రోజు చిట్టచివరి వక్తగా ఆయనకు మాట్లాడే అవకాశం రాత్రి 11.45కి దక్కడాన్ని బట్టి మణిపూర్ సంక్షోభం పట్ల కేంద్రానికి గల నిర్లక్ష్యం రుజువు అవుతున్నది. పార్లమెంటు సంయుక్త సమావేశాలను ఉద్దేశిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంలో సుదీర్ఘ మణిపూర్ కల్లోలం ప్రసక్తి లేకపోడాన్ని కూడా బిమల్ అకోయిజం ఎత్తి చూపారు. మణిపూర్‌లో ఏడాదిన్నరకు పైగా అంతర్యుద్ధం సాగుతుండగా ప్రధాని నోరువిప్పి దానిపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని, ఆయన తన మౌనవ్రతం వీడితే తాను మాట్లాడడం ఆపేస్తానని బిమల్ అన్నారు.

మణిపూర్ ఏమైపోయినా ఫర్వాలేదు మెజారిటీ ఓటు తమవైపు ఉండాలి, హిందువుల వైపు నిలబడ్డామనే సంకేతాన్ని పంపాలి అని కేంద్రంలోని బీజేపీ 'ప్రభువులు' నిర్ణయించుకొన్నారని మనం భావించాలి. సమస్య అంతర్గతంగా భిన్న వర్గాల ప్రజల మధ్య హెచ్చు తగ్గుల ఘర్షణలకు చెందినది అయితే, దృష్టిని సరిహద్దు వైపు మళ్ళించి బయటినుంచి చొచ్చుకు వస్తున్నవారిని నిరోధించడమే పరిష్కారమనే అభిప్రాయాన్ని కలిగించడానికి హోం మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారు. మయన్మార్‌తో గల 1500కి.మీ. సరిహద్దు పొడుగునా కంచె నిర్మించే ప్రణాళికను ప్రకటించారు. సరిహద్దులకు ఆవలి ఈవలి వారు స్వేచ్ఛగా గీత దాటడానికి అవకాశమిస్తూ గతంలో ఇండియా, మయన్మార్ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసే ఉద్దేశాన్నీ వెలిబుచ్చారు. మణిపూర్‌కి భౌగోళికంగా విశేష ప్రాధాన్యముంది. మయన్మార్‌తో సరిహద్దులు ఆగ్నేయాసియాతో సంబంధాలకు ఇండియాకు ముఖద్వారం వంటివి. మయన్మార్‌తో చైనా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో దాని జోరుకు కళ్ళెం వేయవలసి ఉంది. అందుకోసం మణిపూర్‌లో శాంతికి అమిత ప్రాధాన్యముంది. మయన్మార్‌తో సరిహద్దుల మూసివేత ఇందుకు విఘాతం కలిగించవచ్చు.

ఒకటి రెండుసార్లు మణిపూర్‌కి చెందిన మెయితీ, కుకీ, నాగా ఎమ్మెల్యేలతో కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఫలించలేదు. ఆందోళన రెండు వర్గాల్లోని ప్రజానీకంలోకి, ముఖ్యంగా యువతలోకి చొచ్చుకుపోయింది. ఎమ్మెల్యేల పలుకుబడి అంతరించిపోయింది. ప్రజలు వారిని విశ్వసించడం మానేశారు. ఇప్పుడిక ఇది మీన 'మో–షా'లు లెక్కబెట్టే పరిస్థితి కాదు. బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని తక్షణం తొలగించాలి. తాత్కాలికంగానైనా రాష్ట్రపతి పాలన విధించాలి. బరువు బాధ్యతలు బలగాల మీద వదిలి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు చిత్తగించడం మేలు చేయదు. వీలయితే స్వయంగా అఖిలపక్షాన్ని తోడ్కొని మోదీ మణిపూర్‌ను సందర్శించాలి. ఒక్క మణిపూర్‌నే కాదు, దూరంగా విసిరేసినట్టున్న మొత్తం ఈశాన్య ప్రాంతాన్ని మరింత సమ్మిళిత దృష్టితో చూడడడం దేశానికి శ్రేయస్కరం.

▪ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

వివక్షా సాధనంగా 'యూదు వ్యతిరేకత'!

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం యూరోపియన్ సమాజాలలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ఈ నెల మొదటి వారంలో నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌లో ఇజ్రాయెల్–నెదర్లాండ్స్ మధ్య యూరోపా లీగ్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌కు ముందు, తరువాత అల్లర్లు, హింసాకాండ చోటుచేసుకున్నాయి. ఇజ్రాయెల్ అభిమానులు 'పాలస్తీనా వాసులు చావాలి' అని అరుచుకుంటూ రోడ్లమీద కన్పించిన వాళ్ళపైన ఖాళీ సీసాలు విసిరి, బీభత్స వాతావరణాన్ని సృష్టించారు. మరునాడు డచ్ పౌరులు ముందటి రోజు అరాచకానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు చేశారు. శరణార్థులని, వలస వచ్చిన వాళ్ళని వ్యతిరేకించే తీవ్ర జాతీయవాద డచ్ పార్టీ నాయకుడు గేర్ట్ విల్డర్స్ ఆమ్‌స్టర్‌డామ్ సంఘటనల్లో తన రాజకీయ లబ్ధికి ఇంకొక అవకాశం వెతుక్కున్నాడు. జరిగినదంతా ఏడు దశాబ్దాల క్రితం హిట్లర్ సైన్యాలు యూదులను వేధించిన పద్ధతిని గుర్తుతెస్తుందని విల్డర్స్ వ్యాఖ్యానించాడు. నెదర్లాండ్స్ రాజు కూడా పెద్ద డ్రామా చెయ్యటంతో, శాంతియుతంగా నిరసనలు చేసిన అనేకమందిని డచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఉండే 15,000 మంది యూదు పౌరులకి, అక్కడ ఉండే అరబ్బు, ముస్లిం పౌరులకు ఇప్పటి వరకూ ఏ గొడవా లేదు. విచిత్రంగా ఐరోపా, అమెరికాలలో అనేక వార్తా పత్రికలు ఈ ఇజ్రాయెల్ ఫుట్‌బాల్ గూండాలని బాధితులుగాను, తమతమ ఇళ్లపై వారు దాడి చేసినందుకు నిరసన వ్యక్తం చేసిన డచ్ పౌరులని యూదు వ్యతిరేకులుగాను వర్ణిస్తూ వార్తలు రాశాయి. హింసకి పాల్పడిన ఇజ్రాయెల్ పౌరులు క్షేమంగా వెళ్లిపోయారు గానీ, డచ్ ప్రభుత్వం శాంతియుత నిరసనలని నిషేధించి, అరబ్, ఇతర డచ్ ముస్లిం పౌరులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

వంద సంవత్సరాల క్రితం యూదులను తోటి తెల్లజాతి వారుగా ఐరోపా దేశాలు పరిగణించేవి కావు. నాజీ హిట్లర్ సైన్యాలు యూరోపియన్ యూదులలో మూడు వంతుల మందిని సంహరించాయి. ఆ తరువాత యూరోపియన్ దేశాలు మిగిలిన యూదులను ఇజ్రాయెల్‌కి పంపి, తమ అపరాధ భావాన్ని పశ్చిమాసియాకి తరలించాయి. ఎప్పుడయితే ఇజ్రాయెల్ అపార చమురు నిక్షేపాల పశ్చిమాసియాలో తమ ఆర్థిక ఆసక్తులకి కాపలాదారుగా పని చేస్తుందని అర్థమయిందో, యూదులను తెల్లజాతి వారిలో కలుపుకుని తమది ఉమ్మడి జూడో– క్రిస్టియన్ నాగరికత అని యూరోపియన్ దేశాలు చెప్పుకోసాగాయి. తమ అపరాధ భావాన్ని తగ్గించుకోవటంలో భాగంగా యూదులకి పరిహారాలు చెల్లించటమే కాకుండా ఇజ్రాయెల్ సమర్థనని తమ జాతీయతా భావనలో భాగం చేసుకున్నాయి. 2000 సంవత్సరంలో అంతర్జాతీయ హోలోకాస్ట్ జ్ఞాపక కూటమి (International Holocaust Remembrance Alliance) ప్రారంభిస్తూ చేసిన స్టాక్‌హోం ప్రకటనలో హోలోకాస్ట్‌ని 'మానవ నాగరికతకు మచ్చగా' పరిగణించాలని, దాని జ్ఞాపకాలని అందరూ గౌరవించాలని, యూదు వ్యతిరేకతని సంఘటితంగా ఎదుర్కోవాలని ప్రకటించాయి. అలా, తమ పాపాన్ని మొత్తం ప్రపంచ దేశాల పాపంగా మార్చివేశాయి. తాము మినహా ఎవరూ పెద్దగా పాటించని తీవ్ర యూదు వ్యతిరేకతని 'ప్రపంచ' ప్రజలందరికీ అంటగట్టాయి.

ఈ అంతర్జాతీయ హోలోకాస్ట్ జ్ఞాపక కూటమి, అనేక ఇతర శక్తిమంతమైన యూదు సంస్థలతో పాటు ప్రపంచవ్యాప్తంగా యూదు వ్యతిరేకత అనే భావనని ఇజ్రాయెల్ ఉనికిని సమర్థించేందుకు, పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న వారి గొంతు నొక్కటానికి వాడుకుంటూ వస్తోంది. పాలస్తీనా ఆక్రమణని ఎవరు ప్రశ్నించినా, అక్కడి జాతి వివక్ష విధానాలని ఎత్తి చూపినా సహించవు. వాళ్ళు ఏ జాతి, రాజకీయాలు, మతం వాళ్ళయినా సరే. యూదు వ్యతిరేకులుగా ముద్ర వేసి వారి జీవితాన్ని నాశనం చేస్తాయి. ఈ మధ్యనే అమెరికన్ ఇజ్రాయెలీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ అనే అతి పెద్ద ఇజ్రాయెలీ లాబీ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన ఇద్దరు నల్ల జాతి డెమొక్రాట్లని కోట్లాది డాలర్లు ఖర్చు పెట్టి ఓడించింది. ప్రస్తుతం ఇటువంటి ఇజ్రాయెల్ సమర్థక సంస్థలన్నీ కలిసి అమెరికాలో విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనా కోసం నిరసనలు వ్యక్తం చేస్తున్న అన్ని జాతుల, మతాల విద్యార్థులపై సంస్థాపరమైన దాడులు చేయిస్తున్నాయి.

ఐరోపా ఆర్థిక వ్యవస్థలు సజావుగా ఉన్నంతవరకు అరబ్, ఉత్తరాఫ్రికా, ఆసియా దేశాల నుంచి వలసవచ్చిన వారిని బహు సంస్కృతీపరత్వం పేరుతో అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. 2008 తర్వాత ఆర్థిక ప్రగతి తగ్గుముఖం పట్టడంతో యూరోపియన్ దేశాలలోని తీవ్ర జాతీయవాద పార్టీలు వలస ప్రజల పట్ల వ్యతిరేకతని పెంచాయి. ఈ సందర్భంలోనే యూరోపియన్ దేశాలకు ముస్లింలు ఒక సమస్యగా పరిణమించారు. ఒక శతాబ్దం క్రితం ఆ స్థానంలో యూదులు ఉండేవాళ్ళు.



గత రెండు దశాబ్దాలలో అమెరికా, యూరోపు దేశాలు, ఇరాక్, ఆఫ్ఘానిస్తాన్, సిరియా, లిబియా, పాలస్తీనా వంటి అనేక అరబ్బు, ముస్లిం దేశాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక యుద్ధాలు చేసి, చేయించిన తర్వాత ఆయా దేశాల నుండి ఐరోపాకు శరణార్థులు పెరిగారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తమ శ్రామిక అవసరాల కోసం కూడా జర్మనీ లాంటి దేశాలు ఇటువంటి వలసలని ప్రోత్సహించాయి. దక్షిణాసియా లాగే వలస పాలనలో కునారిల్లిన అరబ్బు, ఉత్తర ఆఫ్రికా దేశాల వారు కూడా సహజంగానే ఐరోపాకు వలస వచ్చారు. ఆయా దేశాల్లో ఆయా భాషలు నేర్చుకుని అన్ని రకాలుగా ఇమిడిపోయారు. ఐరోపా ఆర్థిక ప్రగతి బాగున్నంత వరకూ వీళ్లందరినీ బహు సంస్కృతీపరత్వం (మల్టీ కల్చరలిజం) పేరుతో అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. 2008 తర్వాత ఐరోపా ఆర్థిక ప్రగతి కొంత తగ్గుముఖం పట్టడంతో తీవ్ర జాతీయవాద పార్టీలు శరణార్థులు, వలస ప్రజల పట్ల వ్యతిరేకతని ప్రోత్సహించి పెంచాయి. ఈ సందర్భంలోనే యూరోపియన్ దేశాలకు ముస్లింలు ఒక సమస్యగా పరిణమించారు. ఒక శతాబ్దం క్రితం ఆ స్థానంలో యూదులు ఉండేవాళ్ళు.

యూదులను తమలో కలుపుకుని, ఇజ్రాయెల్‌ని పశ్చిమ ఆసియాలో నమ్మిన బంటుగా మార్చుకున్న ఐరోపా దేశాలు 2000 సంవత్సరం తర్వాత పాలస్తీనా ఆక్రమణని ప్రపంచ దేశాల దృష్టిలోకి రాకుండా చేశాయి. అమెరికాలో ట్విన్ టవర్లపై దాడుల తర్వాత ముస్లిం వ్యతిరేకతని ఒక పద్ధతి ప్రకారం పోషించి, పాలస్తీనాని కూడా ఒక టెర్రరిస్టుల సమూహంగా అందరూ భావించేటట్లు చేశాయి. దురదృష్టవశాత్తూ అక్టోబర్ 7 హమాస్ దాడి తర్వాత, ఇజ్రాయెల్ పాలస్తీనాపై జరుపుతోన్న అంతులేని అమానుష దాడులు సోషల్ మీడియా ద్వారా అందరి దృష్టిలోకి వచ్చి ఈ యథాతథ స్థితిని మార్చాయి. ఇజ్రాయెల్ ఆక్రమణలో వుండిన పాలస్తీనా ప్రజల పట్ల జాతి వివక్ష, వారి జాతి ప్రక్షాళన, దీని జియోనిస్టు మూల కథా కమామిషూ ప్రపంచవ్యాప్త నిరసనలతో బట్టబయలయ్యాయి. ఐక్యరాజ్యసమితిలోని మానవ హక్కుల కమిషన్ ఇజ్రాయెల్ చేస్తున్న హత్యలని అంతర్జాతీయ చట్టం క్రింద జెనోసైడ్ లేదా మానవ హననం అని వర్ణిస్తూ ఒక నివేదిక తీసుకొచ్చింది. పాలస్తీనా ప్రజల పక్షాన, ఐరోపాలో ప్రజల తీవ్ర నిరసనలతో ఆయా ప్రభుత్వాల ఇజ్రాయెల్ సమర్థన ప్రశ్నార్థకమయింది. ఈ సందర్భంలోనే ఐరోపా దేశాల అతివాద పార్టీలు యూదు సంరక్షక అవతారం ఎత్తి తమ దేశాల్లో వుండే అరబ్బులు, ముస్లింలని నియంత్రించటానికి వారి పాలస్తీనా సమర్థనని యూదు వ్యతిరేకతగా ప్రచారం చేస్తున్నాయి. ఒకే దెబ్బకి రెండు పిట్టలు. హోలోకాస్ట్ అపరాధ భావనని ఎక్కువ మోసే జర్మనీ దీన్ని పరాకాష్ఠకు తీసుకువెళ్లి మొన్ననే కొత్త చట్టాన్ని బుండేస్టాగ్‌లో ప్రవేశపెట్టింది. ఇజ్రాయెల్ దేశాన్ని, విధానాలను విమర్శించినా, దాని బహిష్కరణని ఏ విధంగా కోరినా అంతర్జాతీయ హోలోకాస్ట్ జ్ఞాపక కూటమి నిర్వచనం ప్రకారం ఆయా వ్యక్తులను యూదు వ్యతిరేకిగా పరిగణించి, వారి హక్కులను తగ్గించి, నిరసనకారుల పౌరసత్వాన్ని కూడా తీసివేసే అధికారాలను ఈ చట్టం ఇస్తోంది. యూదు వ్యతిరేకత భావనని చట్టపరంగా, విధానపరంగా సాధ్యమయినంత విస్తృతపరిచి నిరసన, విమర్శకి అవకాశం లేకుండా చేసే చర్య అని ప్రజాస్వామ్య వాదులు విమర్శిస్తున్నారు.

భారత్ సహా, అన్ని దేశాల్లో పాలస్తీనా మద్దతుదారులను నియంత్రించటానికి, పాలస్తీనియన్లపై తాను జరుపుతోన్న మారణహోమాన్ని ఎవరూ ప్రశ్నించకుండా ఉండటానికి యూదు వ్యతిరేకత సెంటిమెంటుని ఇజ్రాయెల్ వాడుకుంటోంది. దీనికి అమెరికా, యూరోపులలోని అన్ని దేశాల అతివాద రాజకీయ పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. తన అస్తిత్వం కోసం ప్రపంచంలో అన్ని దేశాల ప్రజాస్వామ్య విలువల పతనానికి తోడ్పడుతున్న ఇజ్రాయెల్, పశ్చిమాసియాలో తమ బంటుని కాపాడుకోవటానికి కష్టపడుతోన్న తెల్లజాతి క్రిస్టియన్ దేశాలు కలిసి ఇప్పుడు ముస్లింలకి వ్యతిరేకంగా ఆ సెంటిమెంటుని ప్రయోగిస్తున్నాయి.

• ఎ. సునీత

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

• తారలు దిగి వచ్చిన వేళ

మచిలీపట్నంలో ఏర్పాటుచేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఈ షాపింగ్ మాల్‌ను ప్రారంభించగా, ప్రముఖ కథానాయికలు పాయల్ రాజ్‌పుత్, నయన్ సారిక సందడి చేశారు.





• చక్రబంధం

కనకదుర్గమ్మ వారధిపై బుధవారం సాయంత్రం జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కారణంగా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. అటు తాడేపల్లి వరకు, ఇటు కృష్ణలంక వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో చాలాసేపటి తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది.

టార్గెట్ వీఆర్వో

అన్ని శాఖల పెత్తనంతో బండ చాకిరీ



రెవెన్యూ శాఖలో వీఆర్వోలపై పని ఒత్తిడి

- కంకిపాడు మండల పరిధిలోని ఓ వీఆర్వో తీవ్రమైన పని ఒత్తిడికి గురై గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రి పాలయ్యారు. ప్రాణాలతో బయటపడినప్పటికీ ఆరోగ్యం అంతంతమాత్రంగానే మారింది. ఆయన ఇంకా టెన్షన్‌తోనే పనిచేస్తున్నారు. తనపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను తలచుకుని ఆయన రోజూ విలపిస్తూనే ఉన్నారు.
- గన్నవరం మండల పరిధిలోని ఓ వీఆర్వోకు పక్షవాతం వచ్చింది. ఆయన్ను సకాలంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లడంతో బతికారు. కానీ, పక్షవాతం ఆయన్ను కుంగదీసింది. ప్రొటోకాల్ కోసం సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని అప్పులు పాలైన ఆయన జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్నారు.
- తాజాగా ఇబ్రహీంపట్నం సచివాలయం-4లోని పెసరవల్లి అశోక్ అనే వీఆర్వో.. పని ఒత్తిడి భరించలేక సూసైడ్ నోట్ రాసి అదృశ్యమయ్యాడు. తన చావుకు ఇబ్రహీంపట్నం తహసీల్దార్, ఆర్ఐలే కారణమని పేర్కొని సోమవారం రాత్రి కనిపించకుండా పోయిన ఆయన బుధవారం నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రత్యక్షమయ్యాడు.

- స్పీడ్.. స్పీడ్.. అంటూ ఉన్నతాధికారుల టార్గెట్లు
- పూర్తికాకపోతే షోకాజు నోటీసులు
- అనారోగ్యం పాలవుతున్న చాలామంది వీఆర్వోలు
- ఆత్మహత్యలు చేసుకుంటున్నా స్పందన శూన్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూ శాఖలోని వీఆర్వోలపై పని ఒత్తిడి పెరిగింది. ప్రతి శాఖ ఉన్నతాధికారులూ పనులు పురమాయించటం, మెడపై కత్తిపెట్టడం రివాజుగా మారింది. పైగా టార్గెట్లు విధించటంతో సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. గుండెపోట్లు, పక్షవాతాల బారిన పడుతున్నారు. కొందరైతే ఆత్మహత్యలకూ వెనకాడటం లేదు.

పని ఒత్తిడితో..

రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసేది వీఆర్వోలే. దీంతో సచివాలయ వీఆర్వోలతో పాటు సాధారణ వీఆర్వోలనూ ఎడాపెడా వాడేస్తున్నారు. సచివాలయ వీఆర్వోలకు జాబ్‌చార్టు ఉంటుంది. దానికి భిన్నంగా అన్ని శాఖలూ వీరిపై భారం మోపుతున్నాయి. రికార్డుల నిర్వహణ నుంచి అప్‌డేషన్ వరకు, పాస్‌బుక్‌లు, ఎఫ్ఎంసీ వంటి అనేక దరఖాస్తులను పరిశీలించటం వంటి విధులు వీరే నిర్వహిస్తారు. ఆఫీసులో అందుబాటులో ఉండటంతో పాటు క్షేత్రస్థాయిలోనూ పరుగులు పెడతారు. జాబ్‌చార్టుకు అదనంగా ప్రొటోకాల్, ఎన్నికల డ్యూటీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇవికాకుండా గ్రామ/వార్డు సచివాలయాల పుణ్యమా అని అదనపు భారాన్ని తలపై వేసుకున్నారు. హౌస్‌హోల్డ్ సర్వే-జియో ట్యాగింగ్, ఎమ్మెల్సీ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాలను పరిశీలించటం, నేషనల్ మిగతా 6లో..

ఆరోగ్య సమస్యలతో సతమతం

ఉమ్మడి జిల్లాలో ఎందరో వీఆర్వోలు ఇప్పటికే గుండె సంబంధ సమస్యలతో బాధపడు తున్నారు. చిన్న వయసులోనే బీపీలు, షుగర్లు తెచ్చుకుంటున్నారు. ఒత్తిడి కారణంగా జిల్లాలోని ఒకరిద్దరు వీఆర్వోలకు పక్షవాతం కూడా వచ్చింది. చివరికి ఆత్మహత్యలకు పాల్పడేందుకూ వెనుకాడటం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. కిందిస్థాయి సిబ్బందిపై పనిభారం మోపవద్దని ఒకపక్క సీఎం చంద్రబాబు సమావేశాల్లో పదేపదే చెబుతున్నా.. జిల్లాస్థాయిలో మాత్రం ఉన్నతాధికారులు, అధికారులు బండ చాకిరీ చేయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కిందిస్థాయి సిబ్బందిపై పనిభారం మోపకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు కోరుతున్నారు.

ఒక్క ఉద్యోగిపై బండెడు భారమా?

ఒక్క రెవెన్యూ ఉద్యోగిపై అన్ని శాఖలూ భారం మోపుతున్నాయి. ఇప్పటికే ఎంతోమంది వీఆర్వోలు పక్షవాతం, గుండెజబ్బుతో బాధపడుతున్నారు. ఆత్మహత్యలకూ వెనకాడటం లేదంటే వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. పనులు అప్పగిస్తున్న అధికారులు వాటికి సంబంధించిన స్టేషనరీకి అయ్యే డబ్బు ఇవ్వడం లేదు. వీటిని వీఆర్వోలే సొంతంగా పెట్టుకుంటున్నారు. ఇకపై వీఆర్వోలపై టార్గెట్లు పెడితే విధులు బహిష్కరించి ఆందోళన చేపడతాం. అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

- కె.ఆంజనేయకుమార్, ఏపీవీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

పోలీసులకు చిక్కకుండా పాచికలు

అజ్ఞాతంలో ఉంటూ ఎత్తులు వేస్తున్న గౌతంరెడ్డి

- తొలుత అందరి కళ్లుగప్పి హైదరాబాద్‌కు పరార్
- అరెస్టు కాకుండా హైకోర్టులో పిటిషన్ దాఖలు
- కోర్టు ఉత్తర్వులతో విచారణకు తాత్కాలిక బ్రేక్
- కుమారుడి ద్వారా బీబీఏకు మరో లేఖ
- సెర్చ్ వారెంట్ లేని సోదాలపై బీబీఏ ఆగ్రహం
- విధులు బహిష్కరించి నిరసన



విజయవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా, ఆ స్థల యజమానిపై హత్యాయత్నానికి సుపారీ గ్యాంగ్‌ను పురమాయించిన వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి రోజుకో ఎత్తు వేస్తున్నాడు. అజ్ఞాతంలో ఉంటూనే వ్యవహారాలు నడుపుతున్నాడు. నకిలీ వీలునామాను తయారు చేసుకుని సత్యనారాయణపురంలోని గండూరి ఉమామహేశ్వరశాస్త్రి స్థలాన్ని గౌతంరెడ్డి కాజేసిన విషయం తెలిసిందే. ఇందులో బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. ఉమామహేశ్వరశాస్త్రి అలుపెరగని పోరాటం చేస్తుండటంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఇందుకోసం సుపారీ గ్యాంగ్‌తో దాడి చేయించాడు. ఇప్పటికే ఈ కేసులో చిల్లకల్లుకు చెందిన నలుగురు నిందితులను సత్యనారాయణపురం పోలీసులు అరెస్టు చేశారు. గౌతంరెడ్డితో పాటు ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ముఖ్యంగా కుట్రకు ప్రధాన సూత్రధారి గౌతంరెడ్డి కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన ఎక్కడెక్కడ తలదాచుకునే అవకాశాలు ఉన్నాయో అన్ని ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. పోలీసులు సాంకేతికంగా సాగించిన దర్యాప్తులో అతడు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు పారిపోయినట్టు తేలింది. ఆ తర్వాత నుంచి గౌతంరెడ్డి ఆచూకీ లభించలేదు. హైదరాబాద్‌లోనే ఎక్కడో ఒకచోట తలదాచుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

అరెస్టు చేయకుండా కోర్టులో పిటిషన్

తనను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని గౌతంరెడ్డి ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించాడు. దీనిపై కోర్టు మిగతా 6లో..

ఉచిత ఇసుక కోసం దారి



తోట్లవల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధికారిక ఇసుక క్వారీలు మరో మూడు, నాలుగు రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. ఉచిత ఇసుక నిమిత్తం తోట్లవల్లూరు మండలం నార్తువల్లూరులో మూడు క్వారీలు, రొయ్యూరులో రెండు క్వారీలు మంజూరయ్యాయని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. దీంతో ఈ క్వారీలకు వెళ్లేందుకు కరకట్ట వెంబడి ఉన్న నదీపాయలో కాంట్రాక్టర్ బుధవారం రహదారుల నిర్మాణం చేపట్టాడు. ఈ ఐదు క్వారీల నుంచి ఇసుకను స్టాక్‌యార్డులకు తరలించి వినియోగదారులకు అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రేషన్ కార్డుల మదింపు

జిల్లాలో పరిస్థితి రెండు రోజుల్లో తెలిసే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నకిలీ రేషన్ కార్డుల తొలగింపుపై కేంద్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తుండగా, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కొంతకాలం కిందట కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్-వన్ రేషన్ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రేషన్ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా నిత్యావసరాలు తీసుకునే అవకాశాన్ని కల్పించింది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎఫ్ఎస్ఏ)లో భాగంగా కార్డులను మంజూరు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొన్ని కార్డులను జారీ చేస్తుంటాయి. ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలో ఉన్న రేషన్ కార్డులను పెద్ద సంఖ్యలో తొలగించటమే ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆధార్‌కార్డుల అనుసంధానం, కేవైసీల ద్వారా నకిలీ రేషన్ కార్డులను గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్ని కార్డుల తొలగింపు జరిగిందన్నది మరో రెండు రోజులకు గానూ తెలిసే పరిస్థితి లేదు.

సైబర్‌కు షాక్

ఈ-నేరగాళ్లకు ఝలక్ ఇచ్చిన తాడిగడపవాసి



డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చిన వీడియో కాల్స్ మాట్లాడి రూ.1.25 కోట్లను సైబర్ నేరగాళ్లకు పంపి ఓ ఎన్ఆర్ఐ మహిళ అడ్డంగా ఇరుక్కున్న విషయం మరువకమునుపే.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా చాకచక్యంగా ఓ ఉద్యోగి తప్పించుకున్న తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

- కొరియర్ ట్రాకింగ్ కోసం కాల్‌చేసి ఇరుక్కున్న ఉద్యోగి
- లింక్ పంపి ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ సైకోలు
- ఆన్‌లైన్‌లో రూ.5 లక్షల ఇన్‌స్టా లోన్ పెట్టిన నేరగాళ్లు
- వరుస ఓటీపీలు రావడంతో అప్రమత్తమైన ఉద్యోగి
- చాకచక్యంగా కార్డు, అకౌంట్ల బ్లాక్
- నేరగాళ్లు పెట్టిన రుణం తన సేవింగ్ ఖాతాకే మళ్లింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో ఎక్కడో ఒకచోట, ఎవరో ఒకరు ఇరుక్కుని లక్షలాది రూపాయలను కోల్పోతున్నారు. ఇలా కొరియర్ ట్రాకింగ్ కోసం ఫోన్‌చేసి సైబర్ నేరగాళ్లకు చిక్కిన ఓ వ్యక్తి వెంటనే అప్రమత్తమై వారికే ఝలక్ ఇచ్చాడు. ఆయన క్రెడిట్‌కార్డు నుంచి డబ్బు లాగేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టిన సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా అన్ని మార్గాలను బ్లాక్ చేసి కంగు తినిపించాడు. వివరాల్లోకి వెళితే..

కొరియర్ కోసం కాల్ చేస్తే..

పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన నాగేశ్వరరావు బందరు రోడ్డులో ఉన్న స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో ఉద్యోగి. ఆయనకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి పార్శిల్ రావాల్సి ఉంది. ఈ నెల 14న రాజమండ్రిలో పార్శిల్‌ను డీటీడీసీ కొరియర్ చేశారు. 15వ తేదీన ఆఫీసుకు సెలవు. 16న చేరాల్సిన పార్శిల్ రాకపోవడంతో డీటీడీసీ వెబ్‌సైట్‌లో ఆర్డర్ నెంబర్ ద్వారా నాగేశ్వరరావు ట్రాక్ చేశారు. పార్శిల్ విజయవాడలో డెలివరీకి వచ్చినట్టు చూపించింది. ఎంతసేపటికి పార్శిల్ రాకపోవడంతో వెబ్‌సైట్‌లో దిగువన కాంటాక్ట్ అజ్.. అని పేర్కొంటూ ఫోన్ నెంబర్ ఇచ్చారు. దీంతో నాగేశ్వరరావు ఆ నెంబరుకు కాల్ చేశారు. అవతలి వ్యక్తి హిందీలో మాట్లాడుతూ మరో కాల్ వస్తుంది, దాంతో మాట్లాడమని చెప్పాడు. ఇలా ఫోన్ కట్ అవ్వగానే మరో నెంబర్ నుంచి నాగేశ్వరరావుకు ఫోన్ వచ్చింది. అతడు హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడి వేరే ఫోన్ నెంబర్ నుంచి వాట్సాప్ ద్వారా లింక్ పంపి, దాన్ని క్లిక్ చేయమన్నాడు. అనుమానం వచ్చిన ఆయన ఇది డీటీడీసీ కొరియరేనా.. అని ప్రశ్నించాడు. అవతలి వ్యక్తి అవునని సమాధానమిచ్చాడు. క్లిక్ చేయగానే ఓటీపీ వస్తుందని, వెంటనే చెప్పాలని అవతలి వ్యక్తి అడగ్గానే నాగేశ్వరరావు చెప్పేశారు. తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే ఆప్షన్లలో రూ.5 పంపితే, తిరిగి జమ అవుతాయని అవతలి వ్యక్తి వివరించాడు. ఇదంతా కన్ఫర్మేషన్ కోసమేనని నమ్మించాడు.

ఫోన్ హ్యాక్ చేసి ఇన్‌స్టా లోన్

నాగేశ్వరరావుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఉంది. దీని పరిమితి రూ.7 లక్షలు. ఆయనకు ఇదే బ్యాంక్‌లో సేవింగ్ ఖాతా కూడా ఉంది. క్రెడిట్ కార్డును ఆయన గూగుల్ పేకు అనుసంధానం చేసుకున్నారు. షాపింగ్‌కు వెళ్లినప్పుడు గూగుల్ పే ద్వారా ఆ కార్డు నుంచి చెల్లింపులు చేస్తుండేవారు. కొరియర్ కోసం ఫోన్ చేసినప్పుడు అవతలి వ్యక్తి డబ్బులు పే చేయమనగానే, ఈ కార్డు ద్వారా రూ.5 పంపారు. కాసేపట్లో కొరియర్ చేతికి అందుతుందని చెప్పి అవతలి వ్యక్తి ఫోన్‌ను మిగతా 6లో..

నెల్లూరు జైలుకు వంశీ అనుచరులు | రోడ్డు ప్రమాదం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి 6లో



భూమిపూజ చేసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

దేవాలయ వ్యవస్థ ప్రక్షాళన అవసరం

» మోపిదేవిలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నిధులు రూ.2.75 కోట్లతో కోనేరు వద్ద షాపింగ్ కాంప్లెక్స్, విశ్రాంతి గదుల నిర్మాణాలకు బుద్ధప్రసాద్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన మోపిదేవి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మోపిదేవి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. ఇటీవలికాలంలో దేవస్థానాలు, నిర్వహణ తీరుపై వస్తున్న అభియోగాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమగ్రమైన విచారణ చేసి భక్తులకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. దేవదాయశాఖ వ్యవస్థలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, గ్రామసర్పంచ్ నందిగం మేరీ రాణి, నేతలు మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు జైలుకు వంశీ అనుచరులు

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత కాసన్నేని రంగబాబుపై దాడి ఘటనలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు ఎనిమిది మందిని అరెస్టు చేసి 14రోజులు రిమాండ్ విధిస్తూ గన్నవరం సబ్‌జైల్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ ఇప్పటికే ఎక్కువమంది ఉన్నారని జైల్ సూపరింటెండెంట్ రాంబాబు గన్నవరం కోర్టులో పిటీషన్ వేశారు. పిటీషన్‌ను స్వీకరించిన మెజిస్ట్రేట్ వారిని నెల్లూరు సబ్‌జైల్‌కు తరలించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో బుధవారం రాత్రి నిందితులను ఎస్కార్ట్ సహాయంతో నెల్లూరు జైలుకు పంపారు. ఇదిలా ఉండగా పోలీసులు నిందితులను కస్టడీకి ఇవ్వాలంటూ పిటీషన్ వేశారు. అలాగే నిందితుల తరఫున న్యాయవాదులు బెయిల్ పిటీషన్ వేశారు. వాటిపై గురువారం విచారణ జరగనుంది.

డిసెంబరు 15 వరకు బ్రూసెల్లోసిస్ టీకా కార్యక్రమం

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆడ పశువుల్లో గర్భస్రావానికి, మగ పశువుల్లో కీళ్ల వాపులు, వంధ్యత్వానికి కారణమయ్యే బ్రూసెల్లోసిస్ వ్యాధి నియంత్రణకు డిసెంబరు 15 వరకు బ్రూసెల్లోసిస్ టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా పశుసంవర్థక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పశువుల నుంచి మనుషులకు సోకే గుణం ఈ వ్యాధికి వుందని, పశువ్యాధుల నియంత్రణ కార్యక్రమం ద్వారా 4-8 నెలల వయసు ఆడదూడలకు టీకా వేయడం జరుగుతుందని పశుసంవర్థక శాఖ జేడీ ఎం.హనుమంతరావు వివరించారు. ఒకసారి టీకా వేస్తే జీవితంలో మరెప్పుడూ వ్యాధి రాదని పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్, సీడీఓ వెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం

» ఎంపీ కేశినేని శివనాథ్

తిరువూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్‌గా శావల దేవదత్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ కేశినేని చిన్ని హాజరై దేవదత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కూటమి అభ్యర్థుల విజయంలో దేవదత్ కృషి, త్యాగం మరువలేనిదన్నారు. కేంద్ర పథకాలు క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా కృషి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా ఉందని, వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని ఎంపీ పేర్కొన్నారు. దేవదత్ మాట్లాడుతూ, ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఉంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చెన్నై-కోల్‌కతా 16వనెంబర్ జాతీయరహదారిపై పెదఅవుటపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం చెందాడు. ఆత్కూరు ఎస్‌ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంకు చెందిన కె.మణికంఠ(35) బెంగుళూరుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇంటివద్దనుంచి(వర్క్‌ఫ్రమ్ హోం)ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నాడు. విజయవాడ ఆంధ్రహాస్పటల్‌లో చికిత్సపొందుతున్న బంధువును పరామర్శించేందుకు ఇటీవల కొత్తగా కొనుగోలుచేసిన తన స్పోర్ట్స్ బైక్‌పై ఉదయం 9గంటలకు ఇంటినుంచి బయలుదేరాడు. 11గంటల సమయంలో పెదఅవుటపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన పార్క్‌చేసిన వ్యాన్‌ను వెనుకనుండి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు, చేతులకు తీవ్రగాయాలైన మణికంఠ రక్తపుమడుగులో అక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న ఆత్కూరు ఎస్సై సురేష్ సిబ్బందితో హుటాహుటిన ప్రమాదస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారకుడైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదుమేరకు ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.



మణికంఠ (ఫైల్)

టార్గెట్ వీఆర్వో

(5వ పేజీ తరువాయి)

పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వంటి అదనపు బాధ్యతలు కూడా వీఆర్వోలే చూస్తున్నారు. ఇవికాకుండా స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేలు అదనం. ఈ పనులన్నీ చేయాలంటూ మెడపై కత్తి పెడుతున్నారు. టార్గెట్లు నిర్దేశిస్తున్నారు. పని ఒత్తిడితో టార్గెట్లు చేరుకోలేని వారికి షోకాజు నోటీసులు ఇస్తున్నారు.

టార్గెట్లు పెట్టొద్దంటున్నాం..

జి.అనుపమ, ఏపీవీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రెవెన్యూ ఉద్యోగుల రెగ్యులర్ జాబ్‌చార్టులోనే బండ చాకిరీ చేయిస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఏర్పాటు తర్వాత భారం ఎక్కువైంది. పనులు చేస్తున్నారు కదా.. అని టార్గెట్లు విధిస్తున్నారు. రెగ్యులర్ విధులు కూడా ముఖ్యమైనవే కదా. అన్ని విధులను వేగంగా ఏం చేయగలరు? అప్పగించే పనులు చేస్తున్నప్పుడు టార్గెట్లు ఎందుకు నిర్ణయిస్తున్నారు. వీఆర్వోలపై ఇతర శాఖల అధికారులు పెత్తనం చేస్తున్నారు. ఇలాగే చేస్తే న్యాయపోరాటం చేస్తాం.

ఆశలు ఆవరి!

అన్నదాత విలవిల

» పంట చేతికొచ్చే సమయానికి తుపాను దెబ్బ!
» గాలులకు నేల వాలిన వరి పంట
» కూలీల కొరత.. అందుబాటులో లేని యంత్రాలు
» చేలల్లోనే పంట వదిలేస్తున్న రైతులు



పంట నేలకొరగటంతో కోయకుండా వదిలేసిన రైతు

కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలం

ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలవాలటంతో రైతులు దిగాలు పడుతున్నారు. కోతకు వచ్చిన పంటను కోసేందుకు కూలీల కొరతతో యంత్రాలపై ఆధారపడుతున్నారు. యంత్రాలు కూడా అందుబాటులో లేకపోవటంతో తలలు పట్టుకుంటున్నారు. కోత మిషన్‌తో కోయిద్దామన్నా భూమిలో గట్టిదనం లేక యంత్రాల చక్రాల కింద పంట నలిగిపోతుండటంతో పొలాలను పంటతో సహా చేలల్లోనే రైతులు వదిలేస్తున్నారు.

(జగ్గయ్యపేట రూరల్, ఆంధ్రజ్యోతి)

ఇటీవల వచ్చిన తుపాను గాలులకు కోతకు వచ్చిన వరి నేలకొరగటంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నేలపై పడిన వరిని కూలీలు ఇబ్బంది లేకుండా కోస్తారు. కానీ.. ప్రస్తుతం కూలీల కొరత.. యంత్రాలతో కోయటం.. పొలాలు ఆరకపోవటంతో పంట నలిగి గ్రాసం (వరి గడ్డి) కూడా బురదతో పనికి రాకుండా పోతున్నది. అనుమంచిపల్లి ఆర్‌బీకే పరిధిలో 1683 ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. ఆది నుంచి వర్షాలు అదునుకు కురవక, సాగర్ జలాలు రాక అరకొరగా ప్రారంభమైన సాగు వరదలతో ఆటుపోట్లకు గురైనా రైతులు నిరాశ చెందలేదు. నాటుకు రూ. 5వేలు, సస్యరక్షణ, బలం, తదితర మందులకు రూ. 5వేలు, ట్రాక్టర్ దుక్కులకు రూ. 7వేలు, కౌలు రూ.21వేల చొప్పున ఖర్చుచేసి మరీ సాగుచేశారు. పంట చేతికి వస్తుందన్న సమయంలో అధిక వర్షాలు, గాలుల కారణంగా నేలకొరగటం భూమి గట్టిగా లేకపోవటంతో అదే సమయంలో కూలీల కొరత కారణంగా యంత్రాలతో కోయించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఎకరా పంటను గంటలో కోసే యంత్రాలు ప్రస్తుతం మూడు, నాలుగు గంటలు పడుతుండటంతో అదనంగా మరో రూ.9వేలు చెల్లించాల్సి వస్తున్నది. పంటను కోయించినా పశుగ్రాసం నేలపాలవుతుంది. మరోవైపు యంత్రాల కొరతతో పంటలు మొలకెత్తుతున్నాయి. నేల గట్టిగా ఉంటే రోజుకు 20 ఎకరాలు కోసే యంత్రాలు ప్రస్తుతం నాలుగైదు ఎకరాలకు మించి కోయటం లేదని రైతులు అంటున్నారు.

15 ఎకరాలు సాగు చేశా



- కొడాలి శంకరయ్య, రైతు

రూ.5 లక్షల పెట్టుబడి పెట్టి 15 ఎకరాలు సాగు చేశా. నేల గట్టి పడకపోవటంతో రెండెకరాల్లో పంటను వదిలేయాల్సి వచ్చింది. పంటను మార్కెట్‌కు తరలించినా రూ. 2లక్షలకు మించి వచ్చేలా లేదు. పశుగ్రాసం కూడా నేలపాలైంది.

ఖర్చులు అధికంగా ఉన్నాయి



- సాయి కిరణ్, రైతు

పంట కంటే ఖర్చులే అధికంగా ఉన్నాయి. పంట నేలకొరగటంతో యంత్రాలతో కోయిస్తే రూ. 16 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు 20 బస్తాల దిగుబడి కూడా వచ్చేలా లేదు. వరి పొలాలు కోత కోయించటం కంటే వదిలేయటమే మంచిదని సాగు చేసిన నాలుగెకరాల పంటను వదిలేశా. ప్రభుత్వం రైతులకు రాయితీపై వరి కోత యంత్రాలను అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం

» గత ప్రభుత్వ వైఫల్యాల దృష్ట్యా అన్ని ఏర్పాట్లు.. » గ్రామాల్లో సమాచార సేకరణలో సిబ్బంది » ఆర్డీవో బాలకృష్ణ వెల్లడి

నందిగామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నందిగామలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో మొత్తం 54 సేకరణ కేంద్రాలు, ఆరుమిల్లలను సిద్ధం చేసింది. బీపీటీ రకం క్వింటాకు రూ.2,320గా నిర్ణయించారు. తేమ శాతం 17 వరకూ ఉండవచ్చని స్పష్టం చేసింది. తేమ శాతం పెరిగితే ఒక్కొక శాతానికి కిలో చొప్పున గరిష్ఠంగా ఐదుకిలోలు మాత్రమే తగ్గించేలా నిబంధన విధించి పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది నూర్పిళ్ల సమాచారం సేకరిస్తున్నారు. రైతు ప్రాతిపదికగా ధాన్యం చేతికి వచ్చే సమయాన్ని తెలుసుకొని వారికి కొనుగోలు తేదీని చెబుతున్నారు. దీనివల్ల రైతులకు సమయం వృథా కాకుండా ఉంటుంది. ధాన్యం సేకరణ జరిగిన 48 గంటల్లో రైతు ఖాతాలోకి నగదు జమయ్యేలా చర్యలు చేపట్టినట్టు ఆర్డీవో తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

వైసీపీ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర కష్టాలు!

గత ప్రభుత్వ హయాంలో సేకరించిన ధాన్యానికి సకాలంలో సొమ్ము చెల్లింపులు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఆర్బీకేలు మొత్తం వైసీపీ నేతలు తమ అధీనంలోకి తీసుకొని రైతులకు ఉచితంగా అందించాల్సిన గన్నీ బ్యాగ్‌లను అమ్ముకొని సొమ్ము చేసుకున్న ఘటనలున్నాయి. కాటాల కోసం రైతులు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. తీరా కాటాలకు వచ్చే సమయంలో మరో మారు తేమ పరీక్షలు నిర్వహించి అదనపు కోతలు విధించే వారు. నాటి పాలకులు, అధికారులు, సిబ్బంది కలిసి అన్నదాతను అష్టకష్టాలకు గురిచేశారు. ఈ వెతలు పడలేక రైతులు గ్రామాలలో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. పలుచోట్ల సిబ్బందిని నిర్బంధించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గత అనుభవాలు తలెత్తకుండా చర్యలు చేపడుతోంది. తిరువూరు డివిజన్‌లో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్న ప్రభుత్వం రైతుల నుంచి సమర్థవంతంగా కొనుగోళ్లు చేస్తూ.. 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమౌతున్నట్టు సమాచారం. ఈ మేరకు బుధవారం ఆర్డీవో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలందించడం ద్వారా దళారులను ఆశ్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉన్నందున క్రమ పద్ధతిలో రైతులకు అందించాలని ఆదేశించారు. కాటాలు, తేమ శాతం విషయాలలో ఎక్కడ అవకతవకలు జరిగినా అధికారులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా క్రమ పద్ధతిని పాటించి మంచి ధర అందుకోవాలని సూచించారు.

అసెంబ్లీ వేదికగా

'కొండపల్లి' వెతలు తీర్చండి!

» ఎమ్మెల్యే వసంత



ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొండపల్లి మున్సిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం అసెంబ్లీ వేదికగా రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణను కోరారు. మైలవరం నియోజకవర్గంలో ఉన్న ఏకైక మున్సిపాలిటీ కొండపల్లి అని.. దానిని 2020లో డిసెంబర్‌లో ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు అనుగుణంగా సేవలందించేందుకు వివిధ విభాగాల్లో పని చేయడానికి ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది లేరన్నారు. నిధులు కొరత ఉందన్నారు. తక్షణమే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని కోరారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఇంటింటికి కుళాయి పథకానికి మరలా టెండర్లు పిలవాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే పీఎం జనఔషధి మందులు పెట్టండి

» శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట : ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రభుత్వాసుపత్రుల ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, మందులపై జనరిక్ అని ముద్రించటం లేదని, బ్రాండెడ్ మందులకు వాటికి వ్యత్యాసం ఉండేలా ధరల్లోను తేడా ఉంచాలని కోరారు. ప్రజలకు బ్రాండెడ్, జనరిక్‌పై అవగాహన కల్పించాలని కోరారు. జనరిక్ షాపుల్లో బ్రాండెడ్ మందుల విక్రయాలు చేయకుండా చూడాలన్నారు.

తిరువూరుకు రైలు మార్గం కల్పించండి

» కొలికపూడి శ్రీనివాసరావు



తిరువూరు : కేంద్ర ప్రభుత్వం అమరావతిని కలుపుతూ నూతన రైలుమార్గాన్ని ఆమోదించిందని, దానికి తిరువూరు మీదుగా ఉండేలా సవరణ చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ప్రాంత అభివృద్ధి రవాణమార్గంపై ఆధారపడి ఉంటుందన్నారు. తిరువూరు నియోజకవర్గం సమీపంలోని పలు పట్టణాలకు రైలు మార్గం ఉందని, తిరువూరు మీదుగా రైలుమార్గం, స్టేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందించేలా సహకరించాలని కోరారు.,

వీఆర్వో అశోక్ సేఫ్

» ఊపిరి పీల్చుకున్న తహసీల్దార్, ఆర్‌ఐలు

ఇబ్రహీంపట్నం/నందిగామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'నా చావుకు కారణం ఇబ్రహీంపట్నం తహసీల్దార్, ఆర్‌ఐలే కారణం' అని సోమవారం రాత్రి లేఖ రాసి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇబ్రహీంపట్నం సచివాలయం- 4 వీఆర్వో పెనరమిల్లి అశోక్ నందిగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ప్రత్యక్షం కావడంతో ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తన భర్త కనిపించడం లేదని వీఆర్వో భార్య ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వారు అశోక్ కోసం గాలింపు చేపట్టారు. అయితే వీఆర్వో సంక్షేమ సంఘ నేతలతో కలిసి నందిగామ ఆర్డీవో ఎదుట ప్రత్యక్షమయ్యాడు. పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి కారణంగా అశోక్ అలా సూసైడ్ లేఖ రాసి రెండ్రోజుల పాటు బంధువుల ఇళ్లకు వెళ్లాడన్నారు. కుటుంబసభ్యుల ద్వారా అతడ్ని తీసుకొని ఆర్డీవో వద్దకు వచ్చామన్నారు. ఈ సమస్యకు ఇంతటితో ముగింపు పలికామన్నారు. దీనిపై ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. అతడ్ని ఈనెల 5నే కలెక్టరేట్‌కు సరెండర్ చేశామని ఏదైనా అతడిపై చర్యలు తీసుకోవాలంటే వారు తీసుకోవాల్సిందే తప్ప మాకెలాంటి సంబంధం లేదన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద అశోక్‌బాబు

కిశోరి వికాసం

» బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది
» సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దాం
» బాలికా సంఘాల ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
» జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కార్యక్రమాల నిర్వహణ
» జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కిశోరి వికాసం-2 కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ, కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందని, 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.



కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా తదితరులు

సరైన విజ్ఞానం అందించాలి : డీఎల్ఎస్‌వో

కిశోరి బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని జిల్లా న్యాయసేవల అథారిటీ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ రామకృష్ణ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు, ప్రపంచానికి సవాళ్లుగా నిలుస్తున్నాయని, వీటిని అరికట్టేందుకు సరైన అవగాహనతో సమిష్టి కృషి అవసరమన్నారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి వున్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ఠ భాగస్వామ్యం ఉండాలన్నారు. డ్రాప్ అవుట్స్ తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితరాలపై జిల్లా మహిళా శిశు అభివృద్ధి అధికారి జి.ఉమాదేవి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ విద్య అధికారి సి.శివ సత్యనారాయణరెడ్డి, మార్పు ట్రస్ట్ ఆర్.సూయజ్, స్కిల్ డెవలప్‌మెంట్ జేడీ ఎం.సుమలత, యోగా ట్రైనర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు, తల్లి

డీజిల్ పోసి తగలెడతా!

» బయానా సొమ్ము అడిగినందుకు వైసీపీ నేత బెదిరింపులు
» ప్రాణహాని ఉందని పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కంచికచర్ల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న బయానా డబ్బులు తిరిగి ఇవ్వాలన్నందుకు కీసర గ్రామానికి చెందిన వైసీపీ నేత జడ్పీటీసీ ప్రశాంతి భర్త వేల్పుల రమేశ్ తనపై డీజిల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడని కీసర గ్రామానికి చెందిన బాధితుడు అంగిరేకుల రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొలం కొనుగోలు చేసేందుకు ఆరేళ్ల క్రితం బాధితుడు రమేశ్‌ను సంప్రదించగా ఆయన బంధువుల పొలాన్ని చూపి బయానాగా రూ.5.5 లక్షలు ఇప్పించాడు. తర్వాత పలుమార్లుగా రూ.11.75 లక్షలు తన వద్ద తీసుకున్నాడని బాధితుడు వాపోయాడు. పొలం రిజిస్ట్రేషన్ చేయించాలని రమేశ్‌ను అడగ్గా కాలయాపన చేస్తున్నాడని, దీనిపై పొలం అమ్మకందార్లను సంప్రదించగా రమేష్ ఇప్పటి వరకు ఎలాంటి సొమ్ములు తమకు ఇవ్వలేదని యజమానులు తెలపడంతో మోసపోయానని గ్రహించి ఇచ్చిన బయానా సొమ్మును తిరిగి ఇవ్వాలని రమేశ్‌ను అడగ్గా వాయిదా వేస్తున్నాడే తప్ప సొమ్ములు ఇవ్వలేదన్నాడు. పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టినా ఫలితం లేదన్నాడు. మంగళవారం రాత్రి తనను ఇంటికి పిలిచి తీవ్ర ఆగ్రహంతో 'నీకెంత ధైర్యంరా నాపైనే పంచాయతీ పెడతావా'.. అంటూ బెదిరించి డీజిల్ పోసి తగలెడితే ఎవరు నిన్ను కాపాడతారో చూస్తా.. అని బెదిరించడంతో భయంతో 100కు ఫోన్ చేశానని, కానిస్టేబుల్ వచ్చి స్టేషన్‌కు తీసుకువచ్చారని పేర్కొన్నాడు. జరిగిన ఘటనపై లిఖిత పూర్వకంగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వేల్పుల రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పోలీసులకు చిక్కకుండా..

(5వ పేజీ తరువాయి)

ఇంటెర్మ్ ఉత్తర్వులు ఇవ్వడంతో పోలీసులు ముందుకు వేయాల్సిన అడుగులను తాత్కాలికంగా ఆపారు. గౌతంరెడ్డి కాకుండా అతడి డ్రైవర్ బండ శ్రీను, న్యాయవాది పృథ్వీరాజ్, అనుచరుడు బిట్ర పురుషోత్తమరావు పరారీలో ఉన్నారు. గౌతంరెడ్డికి కోర్టు ఉత్తర్వులు ఉన్నందున ఆయన జోలికి పోలీసులు వెళ్లడం లేదు. మిగిలిన వారిని పట్టుకునే పనిలో పడ్డారు.

స్పందించిన బీబీఏ

హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గౌతంరెడ్డికి బీబీఏ మద్దతు ప్రకటించింది. వాస్తవానికి గౌతంరెడ్డి రాసిన లేఖను ఆయన జూనియర్ ఈనెల ఏడో తేదీన బీబీఏకు అందజేశాడు. అప్పటి నుంచి బీబీఏ ఎలాంటి అడుగు ముందుకు వేయలేదు. తాజాగా గౌతంరెడ్డి కుమారుడు బీబీఏకు మరో లేఖ రాసినట్టు సమాచారం. దీనికి బీబీఏ స్పందించింది. విజయవాడలో ఉన్న న్యాయస్థానాలను బుధవారం న్యాయవాదులు బహిష్కరించారు. ఎలాంటి సెర్చ్ వారెంట్ ఇవ్వకుండా పోలీసులు గౌతంరెడ్డి ఇంట్లోకి ప్రవేశించడాన్ని బీబీఏ ఖండించింది. పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా విధులను బహిష్కరించినట్టు బీబీఏ ప్రతినిధులు తెలిపారు.

సైబర్‌కు షాక్

(5వ పేజీ తరువాయి)

పెట్టేశాడు. కొద్దిసేపటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి ఓటీపీలు, సందేశాలు వరుసగా వచ్చాయి. అందులో రూ.5 లక్షలను ఉపయోగించినట్టు ఒక సందేశం ఉంది. అనుమానం వచ్చిన నాగేశ్వరరావు కార్డుపరిమితిని పరిశీలించుకోగా, అందులో రూ.లక్ష మాత్రమే చూపిస్తోంది. రూ.6 లక్షలకు గాను రూ.5 లక్షలు ఉపయోగించినట్టు చూపించింది. తాను సైబర్ నేరగాళ్ల ట్రాప్‌లో ఇరుక్కున్నానని తెలుసుకున్న నాగేశ్వరరావు బ్యాంక్‌కు వెళ్లి విషయం చెప్పారు. కార్డును బ్లాక్ చేయమన్నారు. అయితే, అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి అటువంటిదేమీ లేదని చెప్పారు. తర్వాత క్రెడిట్‌కార్డు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా ఇదే సమాధానం వచ్చింది. లింక్ ద్వారా నాగేశ్వరరావు ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డుపై ఇన్‌స్టా లోన్‌కు దరఖాస్తు చేశారు. ఇది మూడు దశల్లో ఉంటుంది. ప్రతి దశలోనూ ఓటీపీ ఎంటర్ చేయాలి. నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడుతుండగానే సైబర్ నేరగాళ్లు ఈ ప్రక్రియ పూర్తిచేశారు. ఇన్‌స్టా రుణానికి సంబంధించిన డబ్బు ఆ బ్యాంక్‌లో ఉన్న అకౌంట్‌లో జమ అవుతాయి. ఆవిధంగానే రూ.5 లక్షలు నాగేశ్వరరావు అకౌంట్‌లో జమ అయ్యాయి. ఇది వెంటనే అప్‌డేట్ కాకపోవడంతో బ్యాంక్, కాల్ సెంటర్ సిబ్బందికి వెంటనే చూపించలేదు. అప్పటికే ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డును బ్లాక్ చేయాలని ఆయన దరఖాస్తులు బ్యాంక్ సిబ్బందికి ఇచ్చారు. వెంటనే స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న సిమ్‌ను తీసేసి కీప్యాడ్ ఫోన్‌లో వేశారు. దీంతో సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను హ్యాక్ చేయలేకపోయారు. 18వ తేదీన బ్యాంక్ సిబ్బంది, కాల్ సెంటర్ సిబ్బంది ఫోన్‌చేసి క్రెడిట్ కార్డుపై ఇన్‌స్టా లోన్ రూ.5 లక్షలు తీసుకున్నారని చెప్పారు. ఇది తన ప్రమేయం లేకుండా జరిగిందని, తన అకౌంట్‌లో జమ అయిన రూ.5 లక్షలను మినహాయించుకుని క్రెడిట్ కార్డుకు జమ చేసుకోవాలని నాగేశ్వరరావు చెప్పారు. ఆయన ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డును వెంటనే బ్లాక్ చేయడంతో సైబర్ నేరగాళ్లు డబ్బు లాగడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు.

విజయవాడ తూర్పు

దుర్గగుడిలో సహస్ర లింగార్చన సేవ



వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్ర లింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. స్వామిని పుష్పాలు, బిల్వాలు, పండ్లతో నయనమనోహరంగా అలంకరించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధ్యానంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని ప్రముఖ పిరమిడ్ ధ్యానగురువు ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సర్వీస్ స్పెక్ట్రమ్ క్లబ్ ఆధ్వర్యంలో 'శ్వాస మహా విజ్ఞానం' పేరుతో బుధవారం ధ్యాన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించుకోవటం ద్వారా విద్యార్థులు విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్, కోశాధికారి కాజా రామయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్, అధ్యాపకులు డాక్టర్ షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి

ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి





విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, విద్యారినికి బహుమతి అందజేస్తున్న గద్దె అనురాధ

గుణదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత పుస్తక పఠనం అనేది ఒక దైనందిన జీవిత చర్యగా అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో బుధవారం జరిగింది. వారోత్సవాల్లో భాగంగా యువతీ, యువకులకు పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలను ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం వారోత్సవాల థీమ్‌ను రెడీ సెట్ లైబ్రరీ అని నిర్ణయించినట్లు తెలిపారు. యువత పుస్తకాలు చదవడాన్ని దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని కోరారు. ఇదే కళాశాలలో లైబ్రరీలో కూర్చుని చదువుకున్న తాను తిరిగి ఇదే కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసినట్లు పామర్రు ప్రభుత్వ డిగ్రీకళాశాల విశ్రాంత లైబ్రేరియన్ జి.లుముంద తెలిపారు. పోటీ పరీక్షలకు దోహదపడే పుస్తకాలు కూడా ఈ కళాశాల గ్రంథాలయంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

గద్దె అనురాధ

పటమట: మేథో వికాసానికి, విషయ పరిజ్ఞానం పెంపుదలకు పుస్తక పఠనానికి మించిన సాధనం లేదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం సాయంత్రం సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 48 పాఠశాలల నుంచి దాదాపుగా 450 మందికి పైగా విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షులు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, కార్యవర్గ సభ్యులు జి.రశ్మి, ఆకాశవాణి రిటైర్డు డెరెక్టర్ ఎం.కృష్ణకుమారి, తులసీ, ఏ. సుమబింధు, గ్రంథాలయ కార్యదర్శి డాక్టర్‌రావి శారదలు పాల్గొన్నారు.

లయోలా సెమినార్ హాల్‌లో..

భారతీనగర్: ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల సెమినార్ హాల్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ వై. సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను, వార్తాపత్రికలను చదవడం ద్వారా విద్యార్థులలో విజ్ఞానం, విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. పుస్తక పఠనంలో గ్రంథాలయ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ డి కూనా, గ్రంథపాలకురాలు స్వాతికిరణ్, ఉపగ్రంథపాలకులు చైతన్యదాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచిన క్రైం ఏడీసీపీ రాజారావు, సీఐ

మోటారు సైకిళ్ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

గుణదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ క్రైం ఏడీసీపీ రాజారావు తెలిపారు. గుణదల పోలీస్ స్టేషన్లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో మోటారు సైకిళ్ల చోరీలు పెరిగిపోతున్న నేపథ్యంలో సీసీఎస్, గుణదల పోలీసులు సంయుక్తంగా టీమ్‌లుగా ఏర్పడి నేరస్తులపై డేగకన్ను వేసినట్లు తెలిపారు. మధురానగర్ రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న చింతపల్లి సాయి కిరణ్(19)ని అదుపులోకి తీసుకుని విచారించగా అతను మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయిందని చెప్పారు. చింతపల్లి సాయి కిరణ్ గిరిపురంలో ఉంటున్నట్లుగా గుర్తించి అతని వద్దనుంచి గుణదల, మాచవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ చేసిన మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐ లక్ష్మినారాయణ, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ సైట్ రెగ్యులరైజేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు

ఏపీఐఐసీ కాలనీవాసులకు ఎంపీ కేశినేని చిన్ని హామీ



సమస్యను ఏపీఐఐసీ చైర్మన్ రామరాజుకు వివరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ కాలనీవాసుల కామన్ సైట్ రెగ్యులరైజేషన్ సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. తూర్పు పరిధి నాల్గవ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఆటోనగర్‌లోని చిన్నచిన్న వ్యాపారాలు చేసేవారు, పనిచేసేవారు స్థలాన్ని కొనుగోలు చేసి చిన్నపాటి ఇళ్లను నిర్మాణం చేసుకున్నారని, స్థలంలో ఉన్న ఇంటికి రిజిస్ట్రేషన్ చేశారని, కామన్ సైటుకు రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. ఈ సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించి కాలనీ వాసులకు న్యాయం చేస్తుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఈ కాలనీ 50ఏళ్ల క్రితం ఏర్పడిన లే -అవుట్ అన్నారు. ఇక్కడ ఉన్న పదెకరాల స్థలానికి 405 కుంటుబాలు డబ్బులు సమకూర్చుకుని ప్రభుత్వానికి చెల్లించారన్నారు. నిర్మాణం చేసిన స్థలాన్ని మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారని, కామన్ సైటుకు చేయలేదన్నారు. దాని వల్ల ఇంటికి మరమ్మతులు చేయాలనుకున్నా, ఇంటిని పడగొట్టి మళ్లీ నిర్మించాలనుకున్నా సాధ్యం కావడంలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏపీఐఐసీ చైర్మన్ రామరాజును స్వయంగా వచ్చి పరిశీలించమని కోరడంతో ఆయన వెంటనే వచ్చారన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఈ కాలనీలో ఉన్న కామన్ సైట్ రెగ్యులరైజేషన్ సమస్యను త్వరలోని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, టీడీపీ యువనాయకులు గద్దె క్రాంతికుమార్, టీడీపీ నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, పాతూరి సాంబశివరావు, కోడూరు ఆంజనేయవాసు, రెడ్డి రాంబాబు, అబ్దుల్ కలాం, జీ .అయ్యప్పరెడ్డి, మన్యం పోతురాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాజ్జి, ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్ కే. సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమరావతి యోగా అండ్ ఏరోబిక్ క్రీడాకారులకు సత్కారం

ధర్నాచౌక్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల, మహిళల ఛాంపియన్‌షిప్ యోగా పోటీల్లో ప్రతిభ చూపిన అమరావతి యోగా అండ్ ఏరోబిక్ క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని అసోసియేషన్ హాల్‌లో బుధవారం పి.షాలెం రాజు, పి.మౌనిక, పి. శృతిలను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తమ అసోసియేషన్‌లో శిక్షణ పొంది యోగా పోటీల్లో పతకాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎల్లారావు, యోగాగురువు అంకాల సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీ నాగేశ్వరరావు, పీవీ రమణ, కోశాధికారి లావణ్యకుమార్, పరమేశ్వరరావు, చందు తదితరులు క్రీడాకారులను అభినందించారు.

ప్రమిదలపై పెయింటింగ్స్‌లో చిన్నారి రికార్డు



తన పెయింటింగ్స్‌తో చిన్నారి వేక్షిత శివ

పెనమలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 81 ప్రమిదలపై మూడున్నర గంటల్లో పెయింటింగ్స్ వేసి ఆరేళ్ల చిన్నారి వేక్షిత శివ రికార్డు సృష్టించి అందరినీ ఆశ్చర్యపరిచింది. వివరాల్లోకి వెళితే...పెనమలూరు గ్రామానికి చెందిన కిలారు నాగ త్రినాథ్, దివ్యశ్రీల కుమార్తె వేక్షిత శివ రెండవ తరగతి చదువుతోంది. కూతురుకు చిత్ర కళ నేర్పించాలని తల్లిదండ్రులు ఒక ప్రైవేటు చిత్రకళ అకాడమీలో చేర్పించారు. సదరు అకాడమీ శిక్షకుడు శివ చిన్నారిలోని పట్టుదలను గమనించి కొత్తదనం కోసం ప్రమిదలపై బొమ్మలు వేయడంలో శిక్షణ ఇప్పించారు. ఈక్రమంలో మంగళవారం మూడు గంటలకు ప్రమిదలపై పెయింటింగ్స్ వేయడం ప్రారంభించి సాయంత్రం ఆరున్నర గంటల వరకు వేసింది. వేసిన పెయింటింగ్స్‌లో దేవుళ్ల, మనుషుల, కూరగాయల, పండ్ల చిత్రాలు ఉండడం విశేషం. తల్లిదండ్రులు కేవలం 50 ప్రమిదల పైన పెయింటింగ్స్ వేస్తే సరిపోతుందనుకుంటే చిన్నారి 81 ప్రమిదలపై వేయడం అందరినీ ఆశ్చర్యపరచడం విశేషం. చిన్నారి వేక్షిత శివను అందరూ అభినందించారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

విజయవాడ: నవంబరు 20: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. మనోరమ ప్రక్కన, రెండవ వీధి, హోటల్ తానియా నందు వైద్యం. ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో నాలుగు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. గురు, శుక్ర, శని మూడు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: ఎమ్మెల్యే గద్దె

గుణదల,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. స్థానిక 7వ డివిజన్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం జరిగింది. మొగల్రాజపురం శాంతినగర్లో ఉంటున్న జి.వి.ఎస్.శర్మ రూ.5లక్షలు చెల్లించి కుటుంబ సభ్యులు ఐదుగురు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం టీడీపీ వెబ్‌సైట్ ద్వారా గద్దె రామ్మోహన్ సదరు కుటుంబ సభ్యులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎస్ శర్మ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులంతా టీడీపీకి జీవితకాల సభ్యత్వం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న కుటుంబాల యోగక్షేమాల కోసం తాము కట్టుబడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్‌ను సత్కరిస్తున్న వేణు గురుస్వామి

అయ్యప్పకృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్ష

పటమట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి కరుణా కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. పటమట రైతుబజార్ వద్ద శ్రీధర్మ శాస్త సేవ సమితి ఏర్పాటు చేసిన మాలదారులకు నిత్య అన్నదానప్రసాద కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. వేణు గురుస్వామి ఆధ్వర్యంలో పీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేణు గురుస్వామి శివనాథ్‌ను సత్కరించారు.

పుస్తక ప్రదర్శనకు విద్యార్థినులు

గవర్నర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామ్మోహన్ గ్రంథాలయంలో నిర్వహించిన విశిష్ట పుస్తక ప్రదర్శనను దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు సందర్శించారు. పురాతన పుస్తకాలను ఆసక్తిగా వీక్షించారు. కళాశాల గ్రంథాలయాధికారిణి మల్లిక నేతృత్వంలో విద్యార్థినులు గ్రంథాలయాన్ని సందర్శించి, గ్రంథాలయ నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతలపూడి కోటేశ్వరరావు, వేములపల్లి కేశవరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, సభ్యులు కోట కృష్ణభగవాన్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కిరణ్

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్- 19 ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థుల స్విమ్మింగ్ పోటీల్లో కేబీఎన్ కళాశాల విద్యార్థి పి.కిరణ్ రాష్ట్రస్థాయి అండర్- 19 పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు కిరణ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుండటం తమ విద్యా సంస్థలకు గర్వకారణమని ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. విద్యార్థితో పాటు కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావును బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సత్కరించి అభినందించారు.

టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని రూ.కోటి వసూలు

● మధ్యవర్తిగా ఉన్న మహిళ ఆత్మహత్యాయత్నం

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లు ఇప్పిస్తానని మోసం చేసి రూ.కోటి వసూలు చేసిన ఐదుగురు వ్యక్తులపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మేడూరి భాగ్యలక్ష్మి వాంబేకాలనీ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతంలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. ఆమెకు స్థానిక మహిళలతో సత్సంబాధాలున్నాయి. 2020లో స్థానికంగా ఉండే కొల్లాటి తిరుమలరావు మరో నలుగురు వ్యక్తులు టిడ్కో ఇళ్లు ఇచ్చే అధికారులు తమకు తెలుసని చెప్పారు. దీంతో ఆమె స్థానికంగా ఉండే అనేక మంది వద్ద సుమారు రూ.కోటి వరకు వసూలు చేసింది. నాలుగేళ్లు పూర్తయినా ఇళ్లు రాకపోవడంతో డబ్బులిచ్చిన వారంతా భాగ్యలక్ష్మిపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో బుధవారం ఆమె ఇంట్లో ఉన్న థైరాయిడ్ మందులు అధిక మొత్తంలో మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన భర్త సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానికంగా ఉండే కొల్లాటి తిరుమలరావు, పత్తిపాటి చందు, పత్తిపాటి కల్యాణి, కొల్లాటి హరిబాబు, కొల్లాటి నాగరాజు టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని తనను మోసగించి డబ్బులు కాజేశారని బాధితురాలు పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఎఫ్‌సీఐ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ప్రాంతీయ కార్యాలయం అమరావతి తరపున ఎన్టీఆర్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో 4వ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీని ఈ నెల 21,22న నున్నలోని గ్రీన్‌ఫీల్డ్ క్రికెట్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో శ్రీకాకుళం, వైజాగ్, కాకినాడ, తాడేపల్లిగూడెం, విజయవాడ, నెల్లూరు, కర్నూల్ సంబంధించిన 7 టీమ్‌లతో పాటు అమరావతి టీమ్ ప్రాంతీయ కార్యాలయంతో కలిపి మొత్తం 8 టీమ్‌లు పాల్గొంటాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ యాదవ్ హాజరై ప్రారంభిస్తారు.

రేపు కృష్ణా వర్సిటీ చెస్ టోర్నీ

విజయవాడలోని సప్తగిరి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల మహిళా చెస్ టోర్నీకమ్ సెలక్షన్స్‌ను మచిలీపట్నంలో కృష్ణా వర్సిటీ క్యాంపస్ రుద్రవరంలో నిర్వహించనున్నట్టు కేఆర్‌యూ చెస్ టోర్నీ చైర్‌పర్సన్ పీవీడీ శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు అర్హతా పత్రాలతో వేదిక వద్ద అదేరోజు ఉదయం 10 గంటలలోగా రిపోర్టు చేయాలన్నారు.

రేపు పార్శిళ్ల బహిరంగ వేలం

బస్టేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ పార్శిల్ ఆఫీసులో చిరునామాదారులు తీసుకువెళ్లని లేదా గుర్తించని పార్శిళ్లను ఈనెల 22న బహిరంగ వేలం వేయనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆవరణలోని పార్శిల్ ఆఫీసు వద్ద వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగల పాటదారులు వేలంలో పాల్గొనాలని కోరారు.

బీసీల సంక్షేమం బాబుకే సాధ్యం

● రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం

సత్యనారాయణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. అయోధ్యనగర్ నుజివీడు రహదారిలోని నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి పాటుపడింది చంద్రబాబేనని, దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు రూ.15వేల జీతాన్ని రూ.20 వేలకు పెంచారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నాయీబ్రాహ్మణ సంఘం డైరెక్టర్లు సురవరపు నాగరాజు, పి.విజయకుమార్, నేతలు ఇంటూరి మురళీకృష్ణ, నిడమానూరు యలమందరావు, సందీప్ పాల్గొన్నారు.

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి

● వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధానకార్యదర్శి కోటేశ్వరశర్మ

సత్యనారాయణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాల సంపదను వారి శ్రేయస్సు కోసమే ఉపయోగించాలని విశ్వ హిందూపరిషత్ కేంద్రీయ సంయుక్త ప్రధానకార్యదర్శి కె.కోటేశ్వర శర్మ అన్నారు. సత్యనారాయణపురం కొమ్మువారి వీధిలోని విశ్వ హిందూపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాల సంపదను ప్రభుత్వ సంక్షేమ, పాలనా కార్యకలాపాలకు వినియోగించవద్దని, హిందూ ధర్మప్రచారానికి, హిందూ ఉద్ధరణకు మాత్రమే ఉపయోగించాలన్నారు. దేవాలయాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కలిగించి హిందూ దేవాలయాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. రాష్ట్రప్రభుత్వాలు ఈ మేరకు చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి కొరతూ వీహెచ్‌పీ దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించామన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో హైందవ శంకారావం పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి, రక్షణ, సమాజ సంరక్షణకు జరుగుతున్న హైందవ శంఖారావానికి లక్షలాదిగా హిందూ బంధువులు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. వీహెచ్‌పీ రాష్ట్రకార్యదర్శి, హైందవ శంఖారావం కన్వీనర్ తనికెళ్ల సత్యరవికుమార్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా

అనుమతులు లేకుండా మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడి నిర్మాణాలు

● గతంలో పట్టించుకోని అధికారులు ● ప్రభుత్వాదాయానికి గండి



అక్రమ కట్టడాలను జేసీబీతో కూల్చివేస్తున్న అధికారులు

గన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా, సీఆర్‌డీఏ అనుమతులు తీసుకోకుండా నిర్మించిన మిత్రా దాబా, వండర్ వరల్డ్ కిడ్స్ ప్లే జోన్, క్రికెట్ ప్రాక్టీస్ సెంటర్‌ను తొలగించారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడు మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్యకు జాతీయ రహదారి వెంట బుద్ధవరం పంచాయతీ పరిధిలో సపోట తోట ఉంది. దాని పక్కనే కొంత వాగు పోరంబోకు ఉండటంతో దాన్ని ఆక్రమించి వ్యాపారాలకు అద్దెకిచ్చారు. భూమిని ల్యాండ్ కన్వర్షన్‌కు పెట్టకుండా, సీఆర్‌డీఏ అనుమతులు లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. పలుమార్లు సీఆర్‌డీఏ, పంచాయతీ అధికారులు నోటీసులు పంపినా స్పందించలేదు. దీంతో బుధవారం తెల్లవారుఝామున తహసీల్దారు కేవీ శివయ్యతో పాటు సీఆర్‌డీఏ, పంచాయతీ అధికారులు, పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. జేసీబీతో కట్టడాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ అధికారి సాయిలీల మాట్లాడుతూ సీఆర్‌డీఏ అనుమతి లేదని 4 నెలల క్రితం నోటీసు జారీ చేశామన్నారు. దానికి స్పందన లేకపోవటంతో మళ్లీ ఇచ్చామన్నారు. అయినా స్పందించకపోవటంతో ఉన్నతాధికారులకు చెప్పగా, వారి ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను తొలగించామన్నారు. పంచాయతీ కార్యదర్శి సరోజిని మాట్లాడుతూ 10సెంట్ల వాగు పోరంబోకు ఆక్రమణ, ఆర్ఎస్ నెంబర్ 3-1 పట్టా భూమి 94సెంట్లులో అనధికార నిర్మాణం వాణిజ్య సముదాయాలున్నాయని వాటికి ఎలాంటి అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. ల్యాండ్ కన్వర్షన్ కట్టకుండా ప్రభుత్వాదాయానికి గండి కొట్టారని దీనిపై చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

● కనకదుర్గానగర్‌లో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు: ఈవో



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి దర్శనం కోసం దుర్గగుడికి వచ్చే భక్తులకు కనకదుర్గానగర్‌లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించిన దుకాణదారులపై చర్యలు తీసుకుని ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఈవో కేఎస్ రామారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఈవో కనకదుర్గానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కనకదుర్గానగర్ ప్రధాన గేటు పక్కనే ఉన్న క్యాంటీన్, మరో దుకాణాన్ని పరిశీలించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తూ స్థలాన్ని ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన పూజా సామగ్రి, ఇతర వస్తువులను తొలగించాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం ఈఈవో రత్నరాజు, సూపరింటెండెంట్ నగేష్ తమ సిబ్బందితో క్యాంటీన్, మరో షాపు నిర్వాహకులు ఆక్రమించి ఏర్పాటు చేసిన సామగ్రి, బల్లలను తొలగించారు. దేవస్థానం నిర్ణయించిన స్థలాన్ని మాత్రమే వినియోగించుకోవాలని షాపుల నిర్వాహకులకు సూచించారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి

రైతు సంఘం రాష్ట్ర నేత బెనర్జీ

చల్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు అమరుస్తున్న ఆదానీ స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నేతలు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా బుధవారం చల్లపల్లిలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ వారం నుంచి వినియోగదారుల అనుమతి లేకుండా వ్యాపార సంస్థలకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, తర్వాత గృహాలకు, వ్యవసాయానికి సైతం మీటర్లు బిగించే యోచనలో ప్రభుత్వం ఉందని, ఈ విధానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు సీపీఐ, రైతు సంఘంగా వ్యతిరేకించామని, అప్పుడు మద్దతిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు వంత పాడటం దారుణమన్నారు. ఈప్రక్రియను వెనక్కి తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం నేతలు చంద్ర సుబ్బారావు, కొర్రపాటి ముఖర్జీ, గోగినేని రత్తయ్య, మల్లుపెద్ది బోసు, సీపీఐ నేతలు అల్లూరి బాబురావు, డొక్కు శ్రీనివాసరావు, కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీను, నాగమల్లి, సిద్దాబత్తుల వాసు, పెన్మత్స రాజారత్నం స్మార్ట్ మీటర్ల బాధితులు పట్నాల రాజా, కె.రవి పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధికి శ్రీశైలం 1008వ జగద్గురు



మహాస్వామీజీకి స్వాగతం పలుకుతున్న ఈవో, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే గంటా, నటుడు అశోక్‌కు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ఈవో

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం 1008వ జగద్గురు డాక్టర్ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈవో రామారావు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి, తదితరులు సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అందించారు. అమ్మవారిని, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయనకు వేద పండితులు వేద స్వస్తి పలికారు. ఈవో రామారావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి ఆయనకు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. పండ్లు, పూలు సమర్పించారు. అనంతరం అనుగ్రహబాషణం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యే

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను బుధవారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ఆశీర్వచనం, చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్ కుమార్ బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు, ఆశీర్వచనం ఇచ్చారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారులు బృందం బుధవారం దుర్గగుడి కళావేదికపై గురువు రాధికా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. 19 మంది కళాకారుల బృందం వివిధ కీర్తనలకు చక్కని అభినయం చేశారు. భావ, రాగ, తాళ యుక్తంగా చక్కని భంగిమలతో నాట్యం చేసి అలరించారు. ఆహుతుల హర్షధ్వానాలు అందుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారుల బృందాన్ని అభినందించి సర్టిఫికెట్లు, ప్రసాదాలు అందజేశారు.



లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి తాళం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



విద్యాధరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు తాళం వేశారు. వీఎంసీ పరిధి భవానీపురంలోని లారీస్టాండ్ ప్రాంగణంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కొన్నేళ్లుగా కొందరు భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించి వ్యాపార లావాదేవీలు చేస్తున్నారు. కార్పొరేషన్‌కు ఎలాంటి రుసుము చెల్లించటం లేదు. దీంతో వీఎంసీ ఆదాయానికి గండిపడుతోంది. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో లారీ స్టాండ్‌లో అక్రమ వసూళ్ల కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్టేట్ విభాగం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది లారీ స్టాండ్ వద్దకు వెళ్లి అసోసియేషన్ కార్యాలయానికి తాళం వేశారు. అయితే రాత్రి సమయంలో తాళాన్ని కొందరు పగులకొట్టేందుకు ప్రయత్నించగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మొదలైన రాజకీయ ఒత్తిళ్లు

అసోసియేషన్ కార్యాలయానికి అధికారులు తాళం వేయటంతో వారిపై రాజకీయ ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. కార్యాలయానికి వేసిన తాళాన్ని తీసివేయాలని అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధి, లారీ ఓనర్స్ అసోసియేషన్‌లోని పలువురు నేతలు ఒత్తిడి చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకే తాళం వేశామని, ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటామని అధికారులు చెప్పినట్టు తెలిసింది. గతంలోనూ 2 సార్లు తాళం వేయగా ప్రజా ప్రతినిధి, పలువురు నేతల ఒత్తిడి మేరకు తాళం తీసినట్టు అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారి పక్కన రూ.కోట్ల విలువైన ఖాళీస్థలంలో ఏదైనా కాంప్లెక్స్ నిర్మించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రాంగణానికి వెళ్లి సర్వే చేసినట్టు సమాచారం.

మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయండి

వీవోఏ జిల్లా గౌరవాధ్యక్షురాలు కమల



ధర్నా చేస్తున్న వీవోఏలు

కృష్ణలంక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు యానిమేటర్స్ (వీవోఏ) ఉద్యోగుల సంఘం, (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షురాలు ఎస్.కె.చాంద్ బేగం అధ్యక్షత వహించగా గౌరవాధ్యక్షురాలు ఎ.కమల, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల రమాదేవి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ వెలుగు (డీఆర్‌డీఏ) డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న డ్వాక్రా వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ని గత వైసీపీ ప్రభుత్వం 2019లో తెచ్చిందన్నారు. దీంతో 15ఏళ్లకు పైగా ఇదే ఉపాధిపై ఆధారపడిన వీవోఏల కుటుంబాలు, రోడ్డున పడతాయని ఈ వయసులో వేరే ఉపాధి దొరకడం కష్టమని, గత ప్రభుత్వానికి అనేక సార్లు విన్నపాలు, నిరసనలు, ఆందోళన ద్వారా తెలిపామన్నారు. దీంతో అమలును నిలిపేసిందన్నారు. దీనిపై ఎన్నికలకు ముందు ధర్నా చౌక్‌లో పెద్దయెత్తున ఉద్యమం చేస్తుండగా టీడీపీ తరఫున వర్ల రామయ్య స్వయంగా హాజరై తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, సర్క్యులర్‌ని రద్దు చేస్తామని, చంద్రబాబు తన మాటగా చెప్పమన్నారని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి రాగానే సర్క్యులర్ రద్దు చేయకపోగా, ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సర్క్యులర్ ఆధారంగా, మూడేళ్లు పూర్తయిన వీవోఏని మార్చుకోవచ్చని, పత్రికా ప్రకటనలు చేయడం సరైంది కాదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అనేక మందిని, ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 200 మందిని తొలగించారన్నారు. టీడీపీ ఇచ్చిన హామీ ప్రకారం సర్క్యులర్‌ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, నేతలు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, వీవోఏ యూనియన్ నేతలు పి.రోజా, వి.దేవి, కె.సుమలత పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల సవరణకు సహకరించండి: కలెక్టర్



నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23, 24న ఓటర్ల జాబితాల సవరణకోసం పోలింగ్‌బూత్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీల నేతలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో ఓటర్ల జాబితాల సవరణపై రాజకీయ పార్టీల నేతలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా గతనెల 29న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించడం జరిగిందన్నారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18ఏళ్లు నిండి, లేదా 2025 జనవరి 1 నాటికి 18వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన వారిని నూతన ఓటర్లుగా చేర్చేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. నూతన ఓటర్లను చేర్చేందుకు, లేదా ఓటర్ల పేర్లలో తప్పులు సరిచేసేందుకు, చిరునామా మార్పు, ఓటర్ల చేర్పులు, మార్పులకు ఈనెల 23,24న పోలింగ్ కేంద్రాలవద్ద ఫారం-6,7,8 దాఖలు చేయవచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించి 1 జనవరి 2025 నాటికి ఓటర్ల జాబితాలను ప్రచురించేందుకు ఎన్నికల సంఘం అనుమతి కోసం పంపి, జనవరి 6న తుది ఓటర్ల జాబితాలను ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో 15,38,938 మంది ఓటర్లున్నారని, పురుష ఓటర్లు 7,45,775 మంది, మహిళా ఓటర్లు 7,93,108 మంది, ఇతర ఓటర్లు 55 మంది ఉన్నట్టు ఆయన తెలిపారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లుగా 61,187 మంది నుంచి దరఖాస్తులు అందాయని, వీటిలో 429 దరఖాస్తులను ఇంకా పరిశీలించాల్సి ఉందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల కోసం జిల్లాలో గతంలో 50 పోలింగ్ కేంద్రాలుండగా, 71కి పెంచామన్నారు. ఈ ఓటర్ల జాబితాలను ఈనెల 23న ప్రకటిస్తారని, డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు. డిసెంబరు 30న తుదిజాబితా ప్రకటిస్తామన్నారు. బీఎస్పీ ప్రతినిధి మచిలీపట్నం హైనీ హైస్కూలులో 2వేల మందికి మించి ఓటర్లున్నారని, ఇతర పోలింగ్ కేంద్రాల్లో కొంతమంది ఓటర్లను సర్దుబాటు చేయాలన్నారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రహ్మణ్యం, షారోన్ వివిధ రాజకీయపార్టీల నేతలు పాల్గొన్నారు.



ఆర్చరీ రికర్వ్‌లో రజతం సాధించిన ఆర్చర్లతో చెరుకూరి సత్యనారాయణ

ఆర్చరీలో డాలీశివాని టీమ్‌కు రజతం

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం నాందేడ్‌లో ఈ నెల 10 నుంచి జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఆర్చరీలో సీబీఎస్ఈ గేమ్స్‌లో నగరంలోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న చెరుకూరి డాలీ శివానీ, అర్నవి రోహన్, వైదేహీ విజయ్ దతీర్, నవ్య రాజులదేవితో కూడిన టీమ్ రజతంతో సత్తా చాటింది. రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో రజతం సాధించినట్టు అకాడమీ చీఫ్ కోచ్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను కేకేఆర్ గౌతమ్ స్కూల్ యాజమాన్యం అభినందించింది.

వాస్తవ సంఘటనల సమాహారం 'కేసీఆర్'

● జబర్దస్త్ రాకేశ్



లబ్బీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేశవ చంద్ర రమావత్ చిత్రం ఒక ట్రైబల్ స్టోరీ అని, లంబాడీల జీవితశైలి, బావామరదలు కథ, తండ్రీ కొడుకుల మధ్య బంధమని హీరో జబర్దస్త్ రాకేశ్ తెలిపారు. కేసీఆర్ చిత్ర బృందం బుధవారం నగరంలో సందడి చేసింది. ఈ నెల 22న చిత్రం విడుదల సందర్భంగా పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని మయూరి తెలుగు రుచులు హోటల్ నందు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ చిత్రానికి తెలంగాణలో కన్నా ఆంధ్రలో ప్రజాదరణ ఎక్కువగా ఉందని ఈ చిత్రంలో 4 పాటల్లో ఒక పాటని కేసీఆర్ ఆవిష్కరించారన్నారు. ఇది కేసీఆర్‌పై నిర్మించిన చిత్రం కాదని పూర్తిగా కుటుంబ కథా చిత్రమని తెలిపారు. ఈ చిత్ర కథ ఓ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల సమాహారమని, ఈ సినిమాకి ఎంతో గొప్పగా సాయం చేసిన దీపా ఆర్ట్స్ అధినేత శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. నటి సుజాత పాల్గొన్నారు.



ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ జీవీ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర ఎంఎస్‌వో, ఎల్ఎంవో, ఆపరేటర్స్

జీవీ రెడ్డికి ఆపరేటర్ల శుభాకాంక్షలు

వన్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్‌నెట్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జీవీ రెడ్డికి రాష్ట్ర ఎంఎస్‌వో, ఎల్ఎంవో ఆపరేటర్లు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం జీవీ రెడ్డిని ఆపరేటర్లు కలిసి తమ సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. జీవీ రెడ్డి చైర్మన్‌గా ఉండటం వల్ల ఏపీఎస్ఎఫ్ఎల్‌పై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా జీవీ రెడ్డి స్పందిస్తూ ప్రధాన అంశాలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. చంద్రబాబు మానస పుత్రిక అయిన ఏపీఎస్ఎఫ్ఎల్‌ను రాష్ట్రంలోనే అత్యున్నతమైన నెట్‌వర్క్‌గా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తామన్నారు.



మాట్లాడుతున్న రచయిత సశ్రీ, చిత్రంలో గోళ్ల నారాయణరావు తదితరులు

జనాభాకు అనుగుణంగా లైబ్రరీలు రావాలి

● గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త లైబ్రరీలు ఏర్పాటు కావడం లేదని, ఉన్న కొద్దిపాటి గ్రంథాలయాలకు నేటికాలంలో విద్యార్థులు ఆశించిన సంఖ్యలో రావడం లేదని జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. బుధవారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నిర్వహణలో జాతీయ పుస్తక వారోత్సవాల్లో భాగంగా జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సశ్రీ మాట్లాడుతూ నేటి సమాజంలో యువతరం పాఠ్యపుస్తకాలకే పరిమితమవుతూ గ్రంథాలయాల్లో లభించే విశేష జ్ఞానానికి, సృజనకి దూరమవుతోందన్నారు. గ్రంథాలయాలు-సమాజం అన్న అంశంపై ఆయన మాట్లాడుతూ అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు ఇటీవలి గ్రంథాలయాలను నిర్లక్ష్యం చేయడం నాగరిక సమాజానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రంథాలయాలకు పూర్వవైభవం రావాలని శ్రీమతి లక్ష్మీ ఆకాంక్షించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ లక్ష్మయ్య స్వాగతం పలికారు. ప్రచురణకర్తలు పల్లవి వెంకట నారాయణ, జె.పి.పబ్లికేషన్స్ ప్రసాద్, దివి కుమార్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, పేరిశెట్టి శ్రీనివాసరావు, సుంకర నాగభూషణం పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన సిద్దార్థ మహిళా కళాశాల జట్టు

వర్సిటీ బ్యాడ్మింటన్ చాంప్‌గా సిద్ధార్థ మహిళా కళాశాల

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల మహిళా బ్యాడ్మింటన్ విజేతగా శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల నిలిచింది. రన్నరప్‌గా పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్సు డిగ్రీ కళాశాల, 3,4 స్థానాల్లో సిద్ధార్థ లా కళాశాల, ఆంధ్ర లయోలా కళాశాల జట్లు నిలిచాయి. ఈ పోటీలు సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం జరిగాయి. రాత్రి జరిగిన ట్రోఫీల ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ కల్పన, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్ హేమ, కోచ్ పీ భాస్కరరావు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన కళాశాల విద్యార్థినులు రాజిని, ఉమామహేశ్వరి, ఎం సుచిత్ర ఈ నెల 26 నుంచి 28 వరకు బెల్గావిలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఉమెన్ బ్యాడ్మింటన్ చాంప్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ కల్పన తెలిపారు.

దేదీప్యమానంగా సహస్ర దీపాలంకరణ

కోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోడూరులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద బుధవారం సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కొమ్మూరు శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లింగాకారం, శంకు చక్రాలతో దీపాలు వెలిగించటంతో ప్రాంగణమంతా దేదీప్యమానంగా వెలుగొందింది. ధర్మకర్త బడే భావన్నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించగా, భక్తులు, స్వాములు పాల్గొన్నారు.



చెన్నైలో బిజీ బిజీ

బుట్టబొమ్మ పూజాహెగ్డే ప్రస్తుతం చెన్నైలో సందడి చేస్తున్నారు. షూటింగ్ నిమిత్తం ఆమె కొన్ని రోజులుగా నగరంలో మకాం వేశారు. విజయ్ నటిస్తున్న (విజయ్ 69- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్‌లో పూజా పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపారు. 'చెన్నై మార్నింగ్స్ డే 16' అంటూ సూర్యోదయం ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి అభిమానులతో పంచుకున్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నేపథ్యంలో కథానాయకుడిగా తనకు ఇదే చివరి చిత్రం అని విజయ్ ప్రకటించారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో వెంకట్ కే నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2022లో వచ్చిన 'బీస్ట్' చిత్రంలోనూ విజయ్ సరసన పూజాహెగ్డే నటించారు. ఆమె ప్రస్తుతం ఓ తమిళ చిత్రంలో సూర్యతో నటిస్తున్నారు. హిందీలో షాహిద్‌కపూర్‌తో 'దేవా' చిత్రం చేస్తున్నారు.



సంక్రాంతికే వస్తున్నాం

వెంకటేశ్

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్‌రావిపూడి కలయికలో తెరకెక్కుతున్న మూడో సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 14న విడుదల కానున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ "ఈ సంక్రాంతికి ఒక మంచి వినోదాత్మక చిత్రాన్ని ప్రేక్షకులకు అందివ్వాలనే లక్ష్యంతో సినిమాను అద్భుతంగా తెరకెక్కించాం. నా కెరీర్‌లో నేను నటించిన ఉత్తమ కుటుంబ కథా చిత్రమిదే. అందరికీ నచ్చుతుంది. సంక్రాంతికి విడుదలవుతున్న అన్ని సినిమాలు ఘనవిజయం సాధించాలి. అనిల్‌తో పనిచేయడం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది" అని చెప్పారు. "తను అనుకున్న కథని తెరపైకి అద్భుతంగా తీసుకొచ్చే దర్శకుడు అనిల్ రావిపూడి. గతంలో నేను నిర్మించిన ఎన్నో చిత్రాలు సంక్రాంతికి విడుదలై ఘనవిజయం సాధించాయి. ఈ సినిమా వాటికంటే పెద్ద విజయం సాధించాలి" అని నిర్మాత దిల్‌రాజు తెలిపారు. "ఒక మాజీ పోలీసు.. మాజీ ప్రేయసి.. అద్భుతమైన భార్య మధ్య జరిగే అందమైన ప్రమాణం ఈ సినిమా. క్రైమ్ నేపథ్యంలో సాగే ఈ సినిమా సరికొత్త థ్రిల్‌ను పంచుతుంది. ఈ సినిమాలోని పాత్రలు అందరికీ చిరకాలం గుర్తుండిపోతాయి" అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు.

కస్తూరికి బెయిల్



తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టయిన నటి కస్తూరికి ఎగ్మూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల మూడున చెన్నైలో జరిగిన ఓ సభలో నటి కస్తూరి మాట్లాడుతూ తెలుగు ప్రజలను కించపరిచేలా విమర్శలు చేశారు. నటి కస్తూరి బెయిల్ కోసం హైకోర్టులో పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించడంతో తమిళనాడు పోలీసులు హైదరాబాద్‌లో కస్తూరిని అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారు. ఎగ్మూరు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, కస్తూరికి 29వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ మేజిస్ట్రేట్ ఆదేశాలివ్వటంతో పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఎగ్మూరు కోర్టులో కస్తూరి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై మేజిస్ట్రేట్ దయాళన్ బుధవారం విచారణ జరిపి ఆమెకు బెయిల్ మంజూరు చేశారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

సూపర్‌స్టార్స్ మళ్లీ కలిశారు!



పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్స్ మమ్ముట్టి, మోహన్ లాల్ మళ్లీ కలసి ఓ చిత్రంలో నటిస్తున్నారు. మహేశ్ నారాయణ్ దర్శకత్వం వహించే ఈ భారీ మల్టీస్టారర్ షూటింగ్ బుధవారం శ్రీలంకలో మొదలైంది. మోహన్‌లాల్ జ్యోతి ప్రజ్వలన చేసి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సినిమాలో ఫహద్ ఫాజిల్, కుంచాకో బోబన్, నయనతార తదితరులు నటిస్తున్నారు. శ్రీలంక, లండన్, అబుదాబి, అజర్ బైజాన్, థాయ్‌లాండ్, విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ, కొచ్చి తదితర లొకేషన్స్‌లో 150 రోజుల పాటు జరిగే షూటింగ్‌తో ఈ చిత్రం పూర్తవుతుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనుష్ నందన్, సహ నిర్మాతలు: సలీమ్, సుభాష్ జార్జి, నిర్మాత: ఆంటో జోసెఫ్.

గోవాలో ఇఫీ ప్రారంభం



భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ) బుధవారం గోవాలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో ప్రారంభమైంది. ఆస్ట్రేలియా చిత్రం 'బెటర్ మాన్' ప్రదర్శనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి టాలీవుడ్ నుంచి అక్కినేని నాగార్జున, అమల దంపతులు హాజరయ్యారు. రకుల్ ప్రీత్‌సింగ్, సాన్యా మల్హోత్రా, మానుషీ చిల్లర్ రెడ్‌కార్పెట్‌పై సందడి చేశారు. 81 దేశాల నుంచి ఎంపిక చేసిన 180 సినిమాలను ఈ చిత్రోత్సవంలో ప్రదర్శించనున్నారు. తెలుగు నుంచి 'కల్కి 2898 ఏడీ', '35 చిన్న కథకాదు' చిత్రాలు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. అలాగే మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆయన నటించిన కొన్ని చిత్రాలను ఈ ఉత్సవాల్లో ప్రదర్శించనున్నారు. ఈ నెల 28 వరకూ ఈ చిత్రోత్సవం కొనసాగుతుంది.

పగిలిన ముక్కలు మళ్లీ అతుక్కోవు

విడాకులపై ఏఆర్ రెహమాన్ స్పందన



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్. రెహమాన్ దంపతులు మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి స్వస్తి పలికిన నేపథ్యంలో వారి తరఫు న్యాయవాది వందనా షా ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా సంచలనం రేగడంతో పాటు పలువురు సెలబ్రిటీలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ విడాకుల వ్యవహారంపై ఏఆర్.రెహమాన్ బుధవారం స్పందించారు. 'మా దాంపత్య జీవితానికి త్వరలోనే 30 ఏళ్ళు నిండుతాయని సంతోషించాం. అయితే, అనుకోని విధంగా ముగింపు పలకాల్సి వస్తుందని ఊహించలేదు. విరిగిన హృదయాలు, పగిలిన ముక్కలు యధాతథంగా అతుక్కోలేవు. ఇక నుంచి మాకు నచ్చిన మార్గంలో సంతోషాన్ని వెతుక్కుంటాము' అని రెహమాన్ ఎక్స్ వేదికగా తెలిపారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆమె కూడా భర్తకు విడాకులు ఇచ్చింది



ఏ.ఆర్. రెహమాన్ టీమ్ మెంబర్ మోహిని డే తన భర్త, మ్యూజిక్ కంపోజర్ మార్క్‌కు విడాకులు ఇచ్చినట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రెహమాన్ బ్యాండ్‌లో కీలక పాత్ర పోషించే మోహని ఆయనతో కలసి ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగా సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. రెహమాన్ భార్య సైరా బాను నుంచి విడాకుల ప్రకటన వచ్చిన కొద్ది గంటలకే మోహినీ తన విడాకుల విషయాన్ని వెల్లడించడంతో దీని గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

కొత్త సత్యదేవ్‌ను చూస్తారు



సత్యదేవ్, డాలీ ధనంజయ, ప్రియా భవానీశంకర్ నటించిన చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్‌కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్‌రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరమ్, దినేశ్ సుందరమ్ నిర్మించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యదేవ్ మాట్లాడుతూ "జీబ్రా' సరికొత్త వినోదాన్ని పంచే సినిమా. ఇందులో ఓ సాధారణ బ్యాంకర్ గ్యాంగ్‌స్టర్ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కొంటాడనేది చాలా ఆసక్తికరంగా చూపించాం. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫిల్మ్ ఇదే. ఇందులో కొత్త సత్యదేవ్‌ను చూస్తారు" అని చెప్పారు. "ఆర్థిక నేరాల చుట్టూ జరిగే కథ ఇది. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ అన్నారు. "సినిమా కంటెంట్ చాలా కొత్తగా ఉంటుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది. సత్యదేవ్, డాలీ పోటీపడి నటించారు" అని నిర్మాత ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు.



అశోక్‌ను నిలబెట్టే సినిమా ఇది

బోయపాటి శ్రీను

'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, 'విఎస్ ఇండియా' టైటిల్ విజేత మానస వారణాసి జంటగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ప్రశాంత్ వర్మ కథ అందించగా.. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ "ఈ సినిమా హీరో అశోక్‌ను ఇండస్ట్రీలో నిలబెడుతుంది. డైరెక్టర్‌కి అర్జున్ జంధ్యాలకి, అశోక్‌కు సింక్ చాలా బాగుంది. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు. "అశోక్ మంచి నటుడు. ఆయన ప్రోత్సాహం వల్లే సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాకు సపోర్ట్ చేసినవారందరికీ కృతజ్ఞతలు" అని అన్నారు. "సినిమా అంచనాలను మించి ఉంటుంది" అని నిర్మాత సోమినేని బాలకృష్ణ తెలిపారు.



ఐదు భాషల్లో సస్పెన్స్ థ్రిల్లర్



నిర్మాత మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'ఎం ఫోర్ ఎం'. తెలుగు సహా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఒడిశా సూపర్ స్టార్ సంబీట్ ఆచార్య, అమెరికన్ తెలుగు నటి జో శర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ నెల 23న గోవాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో దేశీ విదేశీ సినీ ప్రముఖుల సమక్షంలో హిందీ వెర్షన్ ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు మోహన్ వడ్లపట్ల చెప్పారు. 'ఇది యూనివర్సల్ సబ్జెక్ట్. సినిమా చూసి ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. మోటివ్ ఫర్ మర్డర్ తెలిసినప్పుడు, మునుపెన్నడూ ఎరుగని సైకోని చూసి సరికొత్త అనుభూతి పొందుతారు. ఐదు భాషల్లో త్వరలో విడుదల చేయబోతున్నాం' అని ఆయన తెలిపారు. శుభలేఖ సుధాకర్, సత్య కృష్ణ, ఎం.ఆర్.సి. వడ్లపట్ల, పసునూరి శ్రీనివాస్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

అన్ని రకాల భావోద్వేగాలతో...



దర్శకుడు అమ్మ రాజశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'తల'. ఈ చిత్రంతో ఆయన తన కుమారుడు అమ్మ రాగిన్‌రాజ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఎన్వీ ప్రసాద్, వాకాడ అంజన్‌కుమార్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ "ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల భావోద్వేగాలతో నిండిన చిత్రమిది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

ఇప్పటివరకూ పోషించని పాత్ర ఇది



'జెర్సీ' ఫేమ్ శ్రద్ధా శ్రీనాథ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'మెకానిక్ రాకీ'. విష్వక్ సేన్ హీరోగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రద్ధా చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "ఈ సినిమాలో ఇప్పటివరకూ పోషించని ఓ డిఫరెంట్ పాత్రను పోషించాను. ఇందులో 'మాయ' పాత్రను ఒక సవాలుగా తీసుకుని నటించా. మెకానిక్ రాకీ జీవితంలో నా పాత్ర ఎలాంటి మార్పులు తెచ్చిందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమాలో చాలా ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. డైరెక్టర్ రవితేజ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఆయన దర్శకత్వ ప్రతిభ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. విశ్వక్‌తో నటించడం చాలా ఎంజాయ్ చేశా. ఆయన ఎనర్జీ లెవెల్స్‌ను మ్యాచ్ చేయటం కష్టం. జేక్స్ బిజోయ్ అందించిన మ్యూజిక్ సినిమాకు ప్రధానాకర్షణ. ఈ సినిమా అన్ని వర్గాల వారిని తప్పక అలరిస్తుంది" అని చెప్పారు.





బిజినెస్

విజయవాడ ● గురువారం 21 నవంబరు 2024

ముంబైలో భారీ కన్వెన్షన్ సెంటర్..

రూ.16,880 కోట్లతో నిర్మించనున్న అదానీ

ముంబై: దేశంలో రెండో అత్యంత ధనికుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ముంబైలో అతిపెద్ద అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌ను (ఐసీసీ) 200 కోట్ల డాలర్లతో (సుమారు రూ.16,880 కోట్లు) నిర్మించబోతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో, విల్లే పార్లే పశ్చిమ శివారు ప్రాంతంలో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఈ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించి, నిర్వహణను చేపట్టనుంది. భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు పోటీగా, దీటుగా అదానీ గ్రూప్ దీన్ని నిర్మించబోతున్నట్లు సమాచారం.

కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్

10 లక్షల టన్నుల సామర్థ్యం.. 2026లో పూర్తి

కాకినాడ, (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఏఎం గ్రీన్ కంపెనీ వెల్లడించింది. గ్రీన్‌కో సంస్థకు చెందిన ఈ అనుబంధ కంపెనీ ద్వారా ఏడాదికి 10 లక్షల టన్నుల సామర్థ్యంతో కూడిన గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేస్తామని వివరించింది. 2026 జూన్‌లోగా దీని నిర్మాణం పూర్తి చేస్తామని కంపెనీ పేర్కొంది. ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పన, కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంతో ఏర్పాటైన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 'ట్రాన్సిషనింగ్ ఇండస్ట్రియల్ క్లస్టర్‌'లో చేరిన సందర్భంగా ఢిల్లీలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ఏఎం గ్రీన్ సంస్థ వెల్లడించింది. ఈ ప్లాంట్‌లో గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని కంపెనీ చైర్మన్ అనిల్ చలమలశెట్టి తెలిపారు. ఏటా 10 లక్షల టన్నుల సామర్థ్యంతో 2026 ప్రథమార్ధం నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు. తొలుత అమ్మోనియా ప్లాంట్.. ఆ తర్వాత ఈ క్లస్టర్‌లోనే 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ రాబర్టో బోకా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న పునరుత్పాదక వనరుల లభ్యత ద్వారా కాకినాడ క్లస్టర్ అడ్వాన్స్ గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఉత్పత్తి అధికంగా చేపట్టే అవకాశం ఉందని వివరించారు. మొత్తం రూ.1,26,500 కోట్ల విలువైన పర్యావరణహిత పెట్టుబడులు ఈ క్లస్టర్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్ కర్మాగారాన్ని గత ఏడాది ఏఎం గ్రీన్ సంస్థ రూ.1,700 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు దీన్నే సాంకేతికంగా అభివృద్ధి చేసి గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయనుంది.

గృహం మరింత ప్రియం

- ప్రధాన నగరాల్లో సగటు ధర రూ.1.23 కోట్లు
- హైదరాబాద్‌లో రూ.1.15 కోట్లు

అనరాక్ నివేదిక



న్యూఢిల్లీ: ప్రజల ఆదాయ, వినియోగాలతో పాటు ఇళ్ల ధరలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబరు) దేశంలోని 7 ప్రధాన నగరాల్లో అమ్ముడుపోయిన గృహాల సగటు ధర రూ.1.23 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ధరల్లో 23 శాతం వృద్ధి నమోదయింది. కొవిడ్ సంక్షోభం తర్వాత ఖరీదైన ఇళ్లకు గిరాకీ భారీగా పెరగడంతో పాటు రికార్డు స్థాయిలో కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఇందుకు కారణమని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో సగటు విక్రయ ధర రూ.కోటి ఉంది. అనరాక్ డేటా ప్రకారం.. ఈ ఏప్రిల్-సెప్టెంబరు కాలంలో దేశంలోని ఏడు బడా నగరాల్లో దాదాపు రూ.2,79,309 కోట్ల విలువైన 2,27,400 యూనిట్ల గృహాలు అమ్ముడుపోయాయి. 2023లో ఇదే కాలానికి రూ.2,35,800 కోట్ల విలువైన 2,35,200 గృహాల విక్రయాలు జరిగాయి. విక్రయాల సంఖ్య 3 శాతం తగ్గినప్పటికీ విలువ రెండంకెల్లో పెరగడం లగ్జరీ గృహాలకు నెలకొన్న భారీ డిమాండ్‌కు నిదర్శనమని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనుజ్ పురి అన్నారు.

హైదరాబాద్‌లో 27,820 యూనిట్ల విక్రయాలు

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి హైదరాబాద్ మార్కెట్లో గృహ విక్రయ సగటు ధర 37 శాతం పెరిగి రూ.1.15 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలానికి సగటు ధర రూ.84 లక్షలుగా నమోదైంది. ఇక అమ్మకాల విషయానికి వస్తే 2023-24 ప్రథమార్ధంతో పోల్చితే నగరంలో ఇళ్ల విక్రయాలు స్వల్పంగా తగ్గి 29,940 నుంచి 27,820 యూనిట్లకు పరిమితమయ్యాయి. అయినప్పటికీ, సగటు విక్రయ ధర భారీగా పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లోనూ లగ్జరీ ఇళ్లకు గిరాకీ భారీగా పెరిగిందనడానికిదే సంకేతం.

నగరం	సగటు ధర (రూ.కోట్లు) 2023-24	2024-25	వృద్ధి (శాతం)
ఢిల్లీ	0.93	1.45	56
బెంగళూరు	0.84	1.21	44
ముంబై	1.47	1.47	--
హైదరాబాద్	0.84	1.15	37
చెన్నై	0.72	0.95	31
పుణె	0.66	0.85	29
కోల్‌కతా	0.53	0.61	16

రియల్టీలోకి ఈక్విటీ పెట్టుబడుల వెల్లువ

49 శాతం వృద్ధితో రూ.92,400 కోట్లు వస్తాయని అంచనా



న్యూఢిల్లీ: ఈ ఏడాది స్థిరాస్తి రంగంలోకి ఈక్విటీ పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 49 శాతం వృద్ధితో 1,100 కోట్ల డాలర్లకు (రూ.92,400 కోట్లు) చేరుకోవచ్చని, తొలిసారిగా 1,000 కోట్ల డాలర్ల మైలురాయిని దాటనున్నాయని సీఐఐ-సీబీఆర్ఈ సంయుక్త నివేదిక అంచనా వేసింది. గృహ, వాణిజ్య సముదాయాలకు బలమైన డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడనుందని పేర్కొంది. 2023లో దేశీయ రియల్టీలోకి 740 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు వచ్చాయి. కాగా, ఈ ఏడాదిలో గడిచిన మూడు త్రైమాసికాల్లో (జనవరి-సెప్టెంబరు) వచ్చిన పెట్టుబడులు 46 శాతం పెరిగి 890 కోట్ల డాలర్లుగా (రూ.74,760 కోట్లు) నమోదయ్యాయి. అందులో దాదాపు 40 శాతం పెట్టుబడులు సంస్థాగత, కలెక్టివ్ వెహికిల్ ఇన్వెస్టర్లకు చెందినవే. కాగా, డెవలపర్ కంపెనీల ఈక్విటీ పెట్టుబడుల వాటా 41 శాతంగా ఉంది. మొదటి మూడు త్రైమాసికాల్లో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 600 కోట్ల డాలర్లు లేదా 65 శాతం దేశీయ ఇన్వెస్టర్లకు (ముఖ్యంగా డెవలపర్లు) చెందినవేనని నివేదిక వెల్లడించింది. కాగా, విదేశీ ఇన్వెస్టర్లు 310 డాలర్ల మేర పెట్టుబడులు పెట్టారు. అందులోనూ ఉత్తర అమెరికా, సింగపూర్ ఇన్వెస్టర్ల వాటాయే 85 శాతంగా ఉంది. వేగంగా వృద్ధి చెందుతున్న భారత స్థిరాస్తి రంగంపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతున్నదనడానికిదే నిదర్శనమని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈఓ అన్షుమన్ మాగజైన్ అన్నారు.

జోరు తగ్గిన కార్పొరేట్ రంగం

నీరసించిన డిమాండ్.. నిరాశ పరిచిన క్యూ2 ఆర్థిక ఫలితాలు

- 'బేర్'మంటున్న స్టాక్ మార్కెట్
- మోతీలాల్ ఓస్వాల్



న్యూఢిల్లీ: భారత కార్పొరేట్ రంగం పరుగుకు బ్రేక్ పడింది. నిన్న మొన్నటి వరకు రేసుగుర్రంలా పరిగెత్తిన కార్పొరేట్ రంగం ఇపుడు నీరసిస్తోంది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటి వరకూ క్యూ2 ఆర్థిక ఫలితాలు ప్రకటించిన కంపెనీల్లో 44 శాతం కంపెనీల ఆదాయం, లాభాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరిచాయి. 41 శాతం కంపెనీల ఫలితాలు మార్కెట్ అంచనాలను మించగా, 15 శాతం కంపెనీల ఆర్థిక ఫలితాలు మాత్రమే అంచనాలకు అనుగుణంగా వచ్చాయి. గత రెండేళ్లలో కార్పొరేట్ రంగం ఆదాయం, లాభాల వృద్ధిరేటుకు ఇలా బ్రేక్ పడడం ఇదే మొదటిసారని ప్రముఖ బ్రోకరేజి సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఒక నివేదికలో తెలిపింది. 2026 మార్చి వరకు ఈ రంగం పనితీరు ఇలానే ఉంటుందని పేర్కొంది. ఇందుకు దోహదపడుతున్న కారణాలు...

డిమాండ్ క్షీణత: ప్రస్తుతం గ్రామీణ డిమాండ్ బాగానే ఉంది. అయితే పట్టణ డిమాండ్ మాత్రం నీరసించింది. ఐటీసీ, హెచ్‌యూఎల్, నెస్లే, డాబర్ వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాలే ఇందుకు చక్కటి ఉదాహరణ. ఎన్ని ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించినా వినియోగదారులను పెద్దగా ఆకర్షించలేకపోతున్నట్టు కంపెనీలు చెబుతున్నాయి. దీంతో 2024-26 వరకు కార్పొరేట్ ఆదాయాల వృద్ధిరేటు 12 నుంచి 14 శాతం మించకపోవచ్చని అంచనా.

ధరల సెగ: ధరల సెగ సైతం కంపెనీల ఆదాయాలు, లాభాలకు చిల్లు పెడుతోంది. ఖర్చులు ఎంత తగ్గించుకోవాలనుకున్నా, ఒక పరిమితికి మించి సాధ్యపడడం లేదు. చక్కెర, వంటనూనెల ధరలు కొద్దిగా తగ్గినా ఇతర ముడి పదార్థాల ధరల్లో వృద్ధి ఇంకా అలానే ఉంది. ఈ భారం తగ్గించుకునేందుకు ధరలు కొద్దిగా పెంచినా ఆ ప్రభావం డిమాండ్‌పై కనిపిస్తోంది.

అంతర్జాతీయ ఉద్రిక్తతలు: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హిజ్‌బొల్లా పోరాటం ఇంకా రావణ కాష్టంలా రగులుతూనే ఉన్నాయి. దీంతో కార్పొరేట్ రంగం ఎగుమతులకు గండి పడి, వాటి ఎగుమతి ఆదాయాలు క్షీణించాయి. ముఖ్యంగా బియ్యం, గోధుమలు, చక్కెర వంటి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి కంపెనీల విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది.

స్టాక్ మార్కెట్‌పై ప్రభావం: కార్పొరేట్ రంగం ఆదాయ, లాభాల వృద్ధిరేటు తగ్గడంతో ఎఫ్‌పీఐలు మూకుమ్మడిగా అమ్మకాలకు దిగాయి. దీంతో గత రెండు నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్, 10 శాతం కుంగిపోయింది. గత నెలన్నర రోజుల్లోనే భారత మార్కెట్ నుంచి ఈ సంస్థలు దాదాపు రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఈ సంస్థల అమ్మకాలు ఇప్పట్లో తగ్గే సూచనలేవీ కనిపించడం లేదు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ మరో 10 శాతం నష్టపోయే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

2047 నాటికి నౌకల నిర్మాణ కేంద్రంగా విశాఖ



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ షిప్‌యార్డులో మళ్లీ వాణిజ్య నౌకల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని సీఎండీ హేమంత్ ఖత్రి తెలిపారు. వైజాగ్‌పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (వీసీసీఐ) విశాఖలో బుధవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ 2016 వరకు షిప్‌యార్డు నష్టాల్లో ఉందని చెప్పారు. ఆ తరువాత రక్షణ నౌకల నిర్మాణం, మరమ్మతులు చేపట్టడంతో తిరిగి లాభాల్లోకి వచ్చిందన్నారు. 2047 సంవత్సరం నాటికి నౌకల నిర్మాణం, మరమ్మతుల కేంద్రంగా విశాఖపట్నం మారనుందని ఆయన చెప్పారు. దీనికి అనుబంధంగా వాటర్ స్పోర్ట్స్, పర్యాటక రంగాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. వాతావరణ కాలుష్యం తగ్గించే గ్రీన్‌షిప్ బిల్డింగ్‌పైనా దృష్టిసారిస్తున్నామన్నారు. షిప్‌యార్డు వద్ద రూ.20 వేల కోట్ల విలువైన ఆర్డర్లున్నందున సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈఓ జితేంద్ర మాట్లాడుతూ, వైద్య పరికరాల తయారీని కొత్త పుంతలు తొక్కిస్తున్నామని, స్థానిక పెట్టుబడిదారులు కూడా ముందుకు రావాలన్నారు. జీఎంఆర్ భోగాపురం విమానాశ్రయం సీఈఓ మనోమయ్ రాయ్ మాట్లాడుతూ, 2026 జూన్ నాటికి కొత్త విమానాశ్రయం నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

రేపటి నుంచి సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: రక్షణ రంగానికి చెందిన సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఐపీఓ శుక్రవారం ప్రారంభం కానుంది. షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.214-226గా నిర్ణయించింది.

- సీఐఈఎల్ హెచ్ఆర్ సర్వీసెస్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా రూ.335 కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది.
- జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓను వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు. అయితే, క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ సెప్టెంబరులో కంపెనీ ఐపీఓ దరఖాస్తును తాత్కాలికంగా పక్కన పెట్టింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,620 ▲	71,150 ▲	1,01,000 ▲
ముంబై	75,873 ▲	69,500 ▲	90,960 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ

హైదరాబాద్	560	విజయవాడ	575
వరంగల్	562	గోదావరి	570
చిత్తూరు	593	విశాఖపట్నం	555

డజను గుడ్లు రూ. 78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	113
వరంగల్	103	గుంటూరు	111
కరీంనగర్	103	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	104
కర్నూలు	103	నెల్లూరు	104
విశాఖపట్నం	110	అనంతపురం	104
గోదావరి	113		

మనోళ్లే చాంపియన్లు

- ఫైనల్లో చైనాపై గెలుపు
- దీపిక మెరుపు గోల్
- మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ



రాజ్‌గిర్ (బిహార్): టోర్నమెంట్ ఆది నుంచి దూకుడైన ఆట..ఫలితంగా అప్రతిహత విజయాల బాట..దీంతో ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ టైటిల్ భారత మహిళల ఖాతాలో వచ్చిచేరింది. బుధవారం జరిగిన ఫైనల్లో సలీమా టేటె సారథ్యంలోని భారత్ ఏకైక గోల్‌తో ఒలింపిక్ రజత పతక విజేత చైనాను 1-0తో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. యువ స్ట్రయికర్ దీపిక కళ్లు చెదిరే రివర్స్ హిట్ గోల్‌తో భారత్ విజయంలో కీలక భూమిక పోషించింది. 31వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను అద్భుత గోల్‌గా మలిచిన దీపిక..టోర్నమెంట్‌లో అత్యధిక గోల్స్ (11) చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌లోనూ మన మహిళలు 3-0తో చైనాను చిత్తు చేసిన విషయం తెలిసిందే. భారత్‌కిది మూడో చాంపియన్స్ ట్రోఫీ. గతంలో 2016, 2023లో మనమ్మాయిలు విజేతలుగా నిలిచారు. ఈ క్రమంలో ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ చరిత్రలో అత్యధిక టైటిళ్లు నెగ్గిన జట్టుగా దక్షిణకొరియాతో భారత్ సమంగా నిలిచింది. మరో మ్యాచ్‌లో 4-1తో మలేసియాపై గెలుపొందిన జపాన్ మూడో స్థానం కైవసం చేసుకుంది. కాగా, విజేత భారత జట్టులోని ఒక్కో సభ్యురాలికి రూ. 10 లక్షల చొప్పున నజరానా ఇవ్వనున్నట్టు ఆతిథ్య రాష్ట్రం బిహార్ ప్రకటించింది.



దీపిక

హోరాహోరీ..

భారత్-చైనా తుదిపోరు ఆసాంతం నువ్వా..నేనా..అనేలా సాగింది. ఇరు జట్లు పలుమార్లు సర్కిల్ లోపలికి దూసుకెళ్లి గోల్స్ చేసేందుకు యత్నించాయి. కానీ ఆయా జట్ల రక్షణ శ్రేణులు ఆ అవకాశాలను వమ్ము చేశాయి. రెండో క్వార్టర్ మూడో నిమిషంలో చైనాకు పెనాల్టీ కార్నర్ లభించింది. కానీ భారత గోల్ కీపర్ బిచు దేవి ఖరిబమ్ అమోఘంగా డైవ్ చేసి జిన్‌జువాంగ్ షాట్‌ను అడ్డుకుంది. తదుపరి రెండు నిమిషాల్లో భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్లు దక్కినా..ఒక్కదానినీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. 23వ నిమిషంలో చైనాకు ఇంకో పెనాల్టీ కార్నర్ లభించినా..భారత్ అడ్డుకుంది. మరోవైపు కెప్టెన్ సలీమా అందించిన పాస్‌ను షర్మిలా దేవి గోల్ పోస్ట్ ఆవలిగా కొట్టడంతో ఖాతా తెరిచే అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది. అనంతరం చైనాపై పదేపదే ఒత్తిడి పెంచిన భారత క్రీడాకారిణులు..ఏడో పెనాల్టీ కార్నర్ దక్కించుకొన్నారు. ఈసారి దీపిక సూపర్ షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి జట్టును ఆధిక్యంలో నిలిపింది. 42వ నిమిషంలో భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. కానీ దీపిక షాట్‌ను చైనా కీపర్ లి టింగ్ అడ్డుకుంది. ఆ వెంటనే సుశీల చాను షాట్‌నూ గోల్‌లోకి వెళ్లకుండా టింగ్ ఆపింది. తర్వాత గోల్ చేసేందుకు చైనా ప్రయత్నించినా భారత రక్షణశ్రేణి ముందు వారి ఆటలు సాగలేదు.

స్పోర్ట్స్

కెప్టెన్ సూర్యను దాటేసి..

తిలక్ @ 3

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో శతకాల మోత మోగించిన తెలుగు కుర్రాడు తిలక్ వర్మ.. టీ20ల్లో టాప్-5లోకి దూసుకొచ్చాడు. బుధవారం తాజాగా విడుదల చేసిన ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో తిలక్ ఏకంగా 69 స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా 3వ ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఒక మెట్టు దిగి 4వ స్థానంలో నిలిచాడు. ట్రావిస్ హెడ్, ఫిల్ సాల్ట్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. కాగా, ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకొన్నాడు. రెండుస్థానాలు మెరుగుపర్చుకొన్న పాండ్యా నెం:1 ర్యాంక్‌ను దక్కించుకొన్నాడు. బౌలర్ల జాబితాలో అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు ఎగబాకి తొమ్మిదో ర్యాంక్‌లో నిలవగా.. రవి బిష్ణోయ్ 8వ స్థానానికి పడిపోయాడు.


బాప్‌రే..కోహ్లీ బ్యాట్ ఖరీదు!

న్యూఢిల్లీ: క్రికెట్ అభిమానుల్లో విరాట్ కోహ్లీకి ఉన్న క్రేజే వేరు. అందుకు అతడి బ్యాట్‌కు ఉంచిన ధరే నిదర్శనం. బ్రిస్బేన్‌లోని గ్రెగ్ చాపెల్ క్రికెట్ సెంటర్‌లో విరాట్ ఆటోగ్రాఫ్‌తో ఉన్న బ్యాట్‌ను అమ్మకానికి ఉంచారు. అయితే, దీని ధర అక్షరాలా రూ. 1.65 లక్షలు. ఈ విషయాన్ని ఓ యూట్యూబర్ వెల్లడించాడు.

ఒలింపిక్స్ ఆతిథ్య రేసులో ఆగ్రా!

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ (2036) ఆతిథ్యానికి ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ దాఖలు చేసిన భారత్ అందుకోసం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మరోవైపు ఒలింపిక్ ఆతిథ్య నగరంగా ఇప్పటికే అహ్మదాబాద్ రేసులో ముందు నిలిచింది. అలాగే ముంబై పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే తాజాగా ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)-ఆగ్రా ఆతిథ్య నగరంగా ఉండనుందనే వార్తలు బలంగా వినవస్తున్నాయి. ఇందుకు 4 కారణాలను ప్రధానంగా చూపుతున్నారు. 1. దేశంలోని పలు ప్రధాన పర్యాటక కేంద్రాలకు సమీపంలో ఉండడం. 2. ఢిల్లీ-ఆగ్రాల సమీపంలో నాలుగు విమానాశ్రయాలుండడం. 3. నిర్మాణానికి అవసరమైన భూమి అందుబాటులో ఉండడం. 4. ఆగ్రా నగరం బిడ్డింగ్ రేసుకు మరింత విలువ తెస్తుందని భావించడం.

నడాల్.. భావోద్వేగ వీడ్కోలు



దేవిస్‌కప్‌లో స్పెయిన్ ఓటమితో ముగిసిన కెరీర్

మలగ (స్పెయిన్): టెన్నిస్ దిగ్గజం రఫెల్ నడాల్ (38) సొంత ప్రేక్షకుల మధ్య సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. డేవిస్ కప్ క్వార్టర్స్‌లో స్పెయిన్ 1-2తో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. దీంతో నడాల్‌కు మరో మ్యాచ్ ఆడే అవకాశం దక్కలేదు. తొలి మ్యాచ్‌లో నడాల్ 4-6, 4-6తో బోటిక్ వాన్ డి జాండ్‌షల్ప్ చేతిలో పోరాడి ఓడాడు. డేవిస్ కప్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలుకుతానని రఫా ముందుగానే ప్రకటించాడు. జట్టు కూడా పరాజయంపాలు కావడంతో.. నడాల్ ప్రయాణం ముగిసింది. మ్యాచ్ తర్వాత జరిగిన సన్మాన కార్యక్రమంలో రఫా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకొంటూ.. అభిమానులను ఉత్తేజపరిచే ప్రయత్నం చేశాడు. అతడు సాధించిన ఘనతలతోపాటు ప్రముఖుల శుభాకాంక్షలతో కూడిన వీడియోను ప్లే చేస్తున్నంత సేపు.. స్టేడియం మొత్తం 'రా..రా.. ఫా.. ఫా' అంటూ మార్మోగిపోయింది. కెరీర్‌లో నడాల్ 22 గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గగా.. అందులో 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లే కావడం విశేషం. మట్టికోర్టులో తనకు ఎదురులేదని నిరూపించాడు. కానీ, గాయాలు దెబ్బతీయడంతో పుంజుకోలేకపోయాడు.

సింధు, లక్ష్య ముందుకు..

ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్, గాయత్రి జోడీలు

షెన్‌జెన్ (చైనా): స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన ఆరంభ రౌండ్లో ప్రపంచ 19వ ర్యాంకర్ సింధు 21-17, 21-19తో థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్ ఓంగ్బామ్రుంగ్‌ఫాన్‌పై గెలుపొందింది. బుసానన్‌తో 21 మ్యాచుల్లో సింధుకిది 20వ గెలుపు కావడం విశేషం. ఇక మాళవిక బన్సోద్ 20-22, 23-21, 21-16తో హోజ్‌మార్క్ (డెన్మార్క్)కు షాకిచ్చి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. లక్ష్య 21-14, 13-21, 21-13తో పారిస్ ఏజ్ సీడ్ లీ జీ జియా (మలేసియా)ను కంగుతినిపించాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి జంట 12-21, 21-19, 21-19తో చైనీస్ తైపీ జోడీ లీ జీ/యాంగ్ సువాన్‌పై మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-15, 21-14తో తైవాన్ జోడీ హూ లింగ్ ఫాంగ్/జెంగ్ యూపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించాయి.

టైటాన్స్ మరో గెలుపు

నొయిడా: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ మరో అద్భుత విజయం. గత మ్యాచ్‌లో టేబుల్ టాపర్ హరియాణా స్టీలర్స్‌కు షాకిచ్చిన ఈ తెలుగు జట్టు ఈసారి రెండో స్థానంలో ఉన్న యు ముంబాను కంగు తినిపించింది. బుధవారం ఇరు జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో టైటాన్స్ 31-29తో ముంబాపై గెలిచింది. కెప్టెన్ పవన్ షెహ్రావత్ లేకుండానే బరిలోకి దిగిన టైటాన్స్‌కు ఆశీష్ నర్వాల్ 8 పాయింట్లు అందించి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. సాగర్, అజిత్, మంజిత్ తలో 4 పాయింట్లతో సత్తా చాటారు. ఈ విజయంతో టైటాన్స్ 37 పాయింట్లతో ఏడు నుంచి ఐదో స్థానానికి ఎగబాకింది. ఇక.. దబాంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఆట నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 39-39 స్కోరుతో సమంగా నిలిచాయి.



నితీశ్ టెస్ట్ అరంగేట్రం ఖాయం?



తుది జట్టులో ఉండాలంటున్న రవిశాస్త్రి, గంగూలీ

పెర్త్: టీ20లలో అందివచ్చిన అవకాశాలను అద్భుతంగా వినియోగించుకొని భారత జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్న తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి..టెస్ట్‌ల్లోనూ అరంగేట్రం చేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఆసీస్‌తో పెర్త్ టెస్ట్‌కు భారత జట్టు కూర్పులో బౌలింగ్ ఆల్‌రౌండర్ ఉండడం ఖాయమే. పైగా..పెర్త్ వికెట్ పేస్‌కు అనుకూలిస్తుంది. ఈనేపథ్యంలో పేస్ బౌలర్ నితీశ్‌కు తుది 11 మందిలో చోటు లభించే అవకాశాలు మెరుగయ్యాయి. ఇంకా..బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాటలను బట్టిచూస్తే నితీశ్‌కు స్థానం ఖాయమేనని తెలుస్తుంది. ఇక..భారత జట్టు మాజీ కోచ్ రవిశాస్త్రి, మాజీ కెప్టెన్ గంగూలీ కూడా తుది జట్టులో నితీశ్ ఉండాల్సిందేననడం విశేషం. నాలుగో బౌలర్‌గా, బ్యాటర్‌గా అతడు జట్టుకు ఎంతో సమతూకం తెస్తాడని వారు అభిప్రాయపడ్డారు. కాగా..గిల్ విషయమై మ్యాచ్‌రోజు ఉదయం నిర్ణయం తీసుకుంటామని మోర్కెల్ చెప్పాడు. ఎడమచేతి బొటన వేలి గాయం నుంచి గిల్ కోలుకుంటున్నాడని అన్నాడు.

ఖలీల్ స్థానంలో యశ్ దయాళ్: భారత రిజర్వ్ పేసర్ల జాబితాలో ఎడమ చేతి వాటం బౌలర్ యశ్ దయాళ్‌ను చేర్చారు. రిజర్వ్ పేసర్‌గా ఉన్న ఖలీల్ అహ్మద్ గాయపడడంతో అతడిని స్వదేశం పంపనున్నారు.



యశ్ దయాళ్



ఈ చిట్టి.. జగజ్జెట్టి

» చైనాలో 12 పెద్ద రోబోల్ని కిడ్నాప్ చేసిన చిన్న రోబో

న్యూఢిల్లీ, నవంబరు 20: అర అడుగు ఎత్తున్న అతి తెలివైన చిన్న రోబో ఒకటి.. పక్క దుకాణంలోకి వెళ్లి, తన కృత్రిమ మేధను ఉపయోగించి 12 పెద్ద రోబోల్ని నైస్‌గా కిడ్నాప్ చేసింది! చైనాలో జరిగిన ఈ ఘటన తాలూకా సీసీ టీవీ ఫుటేజీ ఇంటర్‌నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఏముందంటే.. హాంగ్‌ఝౌ అనే రోబోల తయారీ సంస్థకు చెందిన ఎర్‌బై అనే చిన్న రోబో ఒకటి.. షాంఘై రోబోటిక్స్ షోరూమ్‌కి వెళ్లింది. అక్కడ దానికన్నా పెద్దవి డజను రోబోలున్నాయి. వాటిని ఇది ఏమి అడిగిందో ఏమోగానీ.. ఆ పెద్ద రోబోల్లో ఒకటి.. 'నేను అనుమతి లేకుండా బయటకు వెళ్లను' అని చెప్పింది. దానికి ఈ చిన్న రోబో.. 'అయితే, నువ్వు ఇంటికెళ్లవా?' అని అడిగింది. అప్పుడా పెద్ద రోబో.. 'నాకు ఇల్లంటూ ఏదీ లేదు' అని సమాధానమిచ్చింది. "అయితే నాతో వచ్చేయండి' అంటూ ఆ చిన్న రోబో ముందుకు కదలగానే.. వశీకరణానికి గురైనట్టుగా ఆ షోరూమ్‌లోని పెద్ద రోబోలన్నీ దాన్ని అనుసరించాయి. తొలుత చైనాలో ఈ వీడియో వైరల్ అయినప్పుడు ఇదేదో కల్పితమని అందరూ అనుకున్నారు. కానీ.. రెండు రోబో కంపెనీలూ ఈ వీడియో కల్పితం కాదని, నిజంగా జరిగిందని ధ్రువీకరించాయని సమాచారం. పెద్ద రోబోల సిస్టమ్స్‌లో భద్రతపరంగా ఉన్న కొన్ని లోపాలను ఉపయోగించుకుని ఎర్‌బై వాటిని కిడ్నాప్ చేసిందని, వాటిపై నియంత్రణ సాధించగలిగిందని విచారణలో వెల్లడైంది. అయితే.. చిన్నరోబో తనంత తాను ఇలా చేయడం అసాధ్యమని షాంఘై రోబోటిక్స్ కంపెనీ చెబుతోంది. దీంతో.. ఎవరో దానికి అలా ప్రోగ్రామింగ్ చేసి ఉండొచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ రాధాకృష్ణను కలిసిన

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ నాయుడు బుధవారం హైదరాబాద్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తిరుమల ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

అన్యమతస్థులను వేరే శాఖలకు పంపాలన్న

టీటీడీ నిర్ణయం అభినందనీయం: కిషన్‌రెడ్డి

తిరుమల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'హిందూ దేవాలయాల్లో అన్యమతస్థులుండడంతో అభిప్రాయభేదాలు వస్తున్నాయి. వారిని వేరే శాఖలకు పంపాలని టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల ఏర్పాటైన టీటీడీ బోర్డు తొలి సమావేశంలోనే కొన్ని సానుకూల, అద్భుతమైన నిర్ణయాలను తీసుకుంది. ముఖ్యంగా కొన్ని ప్రముఖ దేవస్థానాలలో అన్యమతస్థులుండడంపై అనేక సంవత్సరాలుగా చర్చ జరుగుతోంది. ఏ మతం వారైనా వారివారి మత విశ్వాసాలున్న ప్రాంగణంలోనే పనిచేస్తే బాగుంటుంది. పవిత్రమైన తిరుమలలో రాజకీయపరమైన ప్రసంగాలు, కార్యక్రమాలు, అభిప్రాయాలను వ్యక్తం చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెట్టాలని తీసుకున్న నిర్ణయం కూడా మంచిది. టూరిజం టికెట్లలో దుర్వినియోగం జరిగినట్టు తెలిసింది. తిరుమల పర్యాటక ప్రాంతం కాదు. హిందు దేవాలయాలపై, దేవతలపై విశ్వాసాలు ఉన్నవారే తిరుమలకు రావాలి' అని కిషన్‌రెడ్డి అన్నారు.

ఆరోగ్యశ్రీలో వైసీపీ ఉద్యోగుల సిండికేట్

» ఆస్పత్రుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు

» కరోనా బిల్లులు ఇవ్వలేదు: టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితులు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గతంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో వైసీపీ నేతల అండతో నియమితులైన కొందరు ఉద్యోగులు సిండికేట్‌గా ఏర్పడి, ఆసుపత్రుల్లో లాబీయింగ్ చేసి, పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారని టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు వచ్చింది. ప్రస్తుత ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద కొనసాగుతున్న ఆ ఉద్యోగులు కూటమి ప్రభుత్వ మద్దతుదారులను అవమానిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని కట్టెపోగు వెంకయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్య నారాయణ, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాల రావు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఉద్యోగులపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని టీడీపీ నేతలు చెప్పారు. కాగా తన భూమిని ఏసీబీ డీఎస్పీ మహబూబ్ బాషా ఆక్రమించుకోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్య తీసుకోలేదని, న్యాయం చేయాలని కర్నూలు జిల్లా కాల్వ గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులు కోరారు. కరోనా సమయంలో క్వారంటైన్ సెంటర్లలోని పేషంట్లకు సరఫరా చేసిన వస్తువులకు బిల్లులు ఇవ్వకుండా నాలుగేళ్లుగా తిప్పుతున్నారని భీమవరానికి చెందిన ఆచంట భగవన్నారాయణ ఫిర్యాదు చేశారు. సూక్ష్మసేద్య పరికరాల రాయితీని పునరుద్ధరించాలని అనంతపురం జిల్లా కల్యాణదుర్గానికి చెందిన శివశంకర్ కోరారు.

అమెరికా వస్తున్న విద్యార్థుల్లో 56% తెలుగువారే!

» అమెరికన్ కాన్సుల్ జనరల్ రెబకా డ్రామె

విశాఖపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమెరికాలో చదువుకోడానికి భారతదేశం నుంచి వస్తున్నవారిలో 56 శాతం మంది తెలుగు రాష్ట్రాలవారే ఉన్నారని అమెరికన్ కాన్సుల్ జనరల్(హైదరాబాద్) రెబకా డ్రామె తెలిపారు. విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో చైనా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు అమెరికా వచ్చేవారని, ఇప్పుడు భారత్ మొదటి స్థానం ఆక్రమించిందని చెప్పారు. 2023-24లో భారత్ నుంచి 3.3 లక్షల మంది అమెరికాకు రాగా వారిలో 56 శాతం మంది తెలుగువారే ఉన్నారని, అందులో తెలంగాణ నుంచి 34 శాతం, ఆంధ్రప్రదేశ్ నుంచి 22 శాతం ఉన్నారని తెలిపారురు. వీలైనంత ఎక్కువ మందికి వీసాలు ఇవ్వడానికి యత్నిస్తున్నామని, గతంలో రోజుకు 450 వీసాలు ఇవ్వగా.. ఇప్పుడు ఆ సంఖ్య 1,600కు చేరిందని చెప్పారు. వచ్చే ఫిబ్రవరి నాటికి రోజుకు 2,500 వీసాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. విజయవాడ, విశాఖపట్నంలలో ఇంటర్వ్యూ సెంటర్ ఏర్పాటు చేయాలని అడుగుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

23న బంగాళాఖాతంలో అల్పపీడనం

» దక్షిణ కోస్తా, రాయలసీమలకు వర్షసూచన

విశాఖపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అండమాన్ సముద్రంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో ఈనెల 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, ఆ తర్వాత రెండు రోజుల్లో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో 24 నుంచి తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, కోస్తాలో బుధవారం చలి తీవ్రత పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి.

మహాయుతిదే మహారాష్ట్ర?

(మొదటి పేజీ తరువాయి)



నాగ్‌పూర్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు

ఒకేసారి పోలింగ్ జరగ్గా.. 81 స్థానాలున్న ఝార్ఖండ్‌లో నవంబరు 13న 43 స్థానాలకు, రెండో దశలో భాగంగా 38 స్థానాలకు బుధవారం పోలింగ్ జరిగింది. కడపటి వార్తలందే సమయానికి మహారాష్ట్రలో 58.22%.. ఝార్ఖండ్‌లో 67.59% పోలింగ్ నమోదైంది. మహారాష్ట్రలో 2019 ఎన్నికల కంటే (61.6%) ఎక్కువ శాతం పోలింగ్ ఈసారి నమోదవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ రాష్ట్రంలో.. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ, నగర ప్రాంతాల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదైంది. ముంబై (49%), పుణె (54.1%), థాణే (49.9%) వంటి నియోజకవర్గాలతో పోలిస్తే.. వామపక్ష తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉన్న గడ్చిరోలి జిల్లాలో 69.6% పోలింగ్ నమోదు కావడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల తోపాటు.. నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కడపటి వార్తలందే సమయానికి 53.8% పోలింగ్ నమోదైంది. మహారాష్ట్రలో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత.. ప్రాంతీయ పార్టీలైన శివసేన, ఎన్సీపీ చీలిపోయి చెరో వర్గం బీజేపీ, కాంగ్రెస్‌తో జట్టు కట్టడంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారిన సంగతి తెలిసిందే. బీజేపీ, శివసేన(ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీలతో కూడిన మహాయుతి.. కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్‌ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్) పార్టీలతో కూడిన మహా వికాస్ అఘాడీ కూటములు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైని కలిగి ఉన్న మహార్రాష్ట్రలో గెలుపును జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పోరాడాయి. ఈ క్రమంలో.. మహారాష్ట్రలో మహిళా ఓటర్లను ఆకర్షించడానికి మహాయుతి ప్రభుత్వం తెచ్చిన 'లాడ్లీ బెహనా యోజన' గేమ్ చేంజర్‌గా మారిందని... హిందూ ఓటర్లను ఏకం చేయడమే లక్ష్యంగా 'బటేంగేతో కటేంగే.. ఏక్ రహేంగేతో సేఫ్ రహేంగే (విడిపోతే పడిపోతాం.. కలిసుంటే క్షేమంగా ఉంటాం)' అంటూ విస్తృతంగా ప్రచారం చేసిన నినాదం పనిచేసిందని సర్వే సంస్థలు తెలిపాయి. మొత్తమ్మీద.. ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో మహారాష్ట్ర ఓటర్లు భిన్నమైన తీర్పు ఇవ్వబోతున్నారని 3-4 సంస్థలు మినహా అన్ని ప్రముఖ సర్వే సంస్థలూ తేల్చి చెప్పాయి. చాలా సంస్థలు.. ఎక్కువ సీట్లు బీజేపీకి దక్కనున్నట్టు వెల్లడించాయి. లోక్‌షాహి మరాఠీ రుద్ర, దైనిక్ భాస్కర్ ఎగ్జిట్ పోల్స్ హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశం ఉందని తెలపగా.. ఎలక్టోరల్ ఎడ్జ్ సంస్థ 150 సీట్లతో మహా వికాస్ అఘాడీ కూటమి విజయం సాధిస్తుందని పేర్కొనడం విశేషం.

ఝార్ఖండ్‌లోనూ..

ఝార్ఖండ్‌లో ఎన్డీయే ఈసారి హేమంత్ సొరెన్ ప్రభుత్వాన్ని ఓడించడం ఖాయమని యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థ తప్ప మినహా అన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్)తో కూడిన 'ఇండియా' కూటమి.. బీజేపీ, ఏజేఎస్‌యూ, జేడీయూ, ఎల్జేపీతో కూడిన ఎన్డీయే కూటమి ఈ ఎన్నికల్లో పోటాపోటీగా తలపడ్డాయి. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపినట్టు పీపుల్స్ పల్స్ సంస్థ తెలిపింది. అదే సమయంలో.. 14 శాతానికి పైగా ఉన్న ముస్లింలు, 4 శాతానికి పైగా ఉన్న క్రైస్తవులు ఇండియా కూటమికి మద్దతు తెలిపినట్టు వెల్లడించింది.

గత ఎగ్జిట్ పోల్స్ ఇలా..

ఒకటి రెండు సర్వే సంస్థలు మినహా దాదాపు అన్ని సంస్థలూ ఈ ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ కూటమిదే గెలుపని ప్రకటించాయి సరే.. మరి 2019లో ఆయా సంస్థల సర్వేలు ఎంతవరకూ నిజమయ్యాయి? అంటే.. ఇండియా టుడే-యాక్సిస్ సంస్థ ఎగ్జిట్ పోల్స్ అసలు ఫలితాలకు దగ్గరగా వచ్చాయి. బీజేపీ శివసేన కూటమికి 166 నుంచి 194 సీట్లు వస్తాయని ఆ సంస్థ అంచనా వేయగా.. ఆ రెండు పార్టీలకూ కలిపి 161 సీట్లు వచ్చాయి! అలాగే.. కాంగ్రెస్, ఎన్సీపీ కూటమికి 72 నుంచి 90 సీట్లు వస్తాయని పేర్కొనగా 98 సీట్లు వచ్చాయి! మిగతా అన్ని సంస్థలూ ఎన్డీయే కూటమికి 200కు పైగా, యూపీఏ కూటమికి 70లోపు సీట్లు వస్తాయని వేసిన అంచనాలు వాస్తవ ఫలితాలతో సరిపోలలేదు. ఝార్ఖండ్ విషయానికి వస్తే 2019లో ఆ రాష్ట్రంలో యూపీఏ (కాంగ్రెస్, జేఎంఎం) కూటమికి 43 సీట్లు, బీజేపీకి 27 సీట్లు వస్తాయని ఇండియాటుడే-యాక్సిస్ సర్వే అంచనా వేయగా.. యూపీఏ కూటమికి 46 సీట్లు, బీజేపీకి 25 వచ్చాయి. టైమ్స్‌నౌ కూడా వాస్తవ ఫలితాలకు దగ్గరగానే తెలిపింది. యూపీఏ కూటమికి 44 సీట్లు, బీజేపీకి 28 వస్తాయని ఆ సంస్థ ఎగ్జిట్‌పోల్‌లో వెల్లడైంది.



ఝార్ఖండ్ రాజధాని రాంచీలో

ఝార్ఖండ్ — మొత్తం స్థానాలు- 81, మ్యాజిక్ ఫిగర్: 41


సంస్థ	ఎన్డీయే	ఇండియా	ఇతరులు
పీపుల్స్ పల్స్	42-48	16-23	8-14
పీ-మార్క్	31-40	37-47	1-6
చాణక్య స్ట్రాటజీస్	45-50	35-38	3-5
టైమ్స్ నౌ-జేవీసీ	40-44	30-40	0-1
మ్యాట్రిజ్	42-47	25-30	1-4
యాక్సిస్ మై ఇండియా	25	53	3

వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఇలా..

మహారాష్ట్ర — మొత్తం స్థానాలు- 288, మ్యాజిక్ ఫిగర్: 145

సంస్థ	మహాయుతి	ఎంవీఏ	ఇతరులు
టైమ్స్ నౌ-జేవీసీ	150-167	107-125	13-14
పీపుల్స్‌పల్స్	175-195	85-112	7-12
చాణక్య స్ట్రాటజీస్	152-160	130-138	6-8
మ్యాట్రిజ్	150-170	110-130	8-10
న్యూస్ 24-చాణక్య	152-160	130-138	6-8
పోల్ డైరీ	122-186	69-121	10-27
పీ-మార్క్	137-157	126-156	2-8
లోక్‌షాహి మరాఠీ రుద్ర	128-142	125-140	18-23
దైనిక్ భాస్కర్	125-140	135-150	20-25
ఎలక్టోరల్ ఎడ్జ్	118	150	20

లోకం తీరు



మోదీకి సాధ్యం కాని పని.. మేం చేసి చూపిస్తున్నాం!

» మరో 3 వారాల్లో తెలంగాణలో కులగణన పూర్తి: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, నవంబరు 20: ప్రధాని మోదీ గత మూడేళ్లలో చేయలేని కులగణనను తెలంగాణలోని తమ ప్రభుత్వం మరో మూడు వారాల్లో పూర్తి చేయనుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. 'తెలంగాణలో మా ప్రభుత్వం ఇప్పటికే 70 శాతానికి పైగా కులగణనను పూర్తి చేసింది. విధానాల రూపకల్పనలో, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయటంలో ఆ సమాచారాన్ని వినియోగిస్తాం' అని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో రాహుల్ హిందీలో ఓ పోస్ట్ పెట్టారు. వచ్చే కొన్ని దశాబ్దాల కాలంలో సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రచించటానికి అవసరమైన అత్యంత ముఖ్యమైన చర్యల్లో కులగణన మొట్టమొదటిదని రాహుల్ స్పష్టం చేశారు. అందువల్లే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన జరగాలని తాను పదేపదే డిమాండ్ చేస్తున్నానన్నారు. 'తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి దారి చూపింది. జాతీయస్థాయిలోనూ కులగణన జరిగేలా చర్యలు తీసుకుంటాం' అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రసారభారతి ఓటీటీ యాప్ వేవ్స్

న్యూఢిల్లీ, నవంబరు20: ప్రసారభారతి వేవ్స్ పేరిట ఓటీటీ యాప్ ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా ప్రస్తుతం బీ4యూ, ఏబీజడ్‌వై, ఎస్ఏబీ, 9ఎక్స్ మీడియాతో పాటు ఇండియా టుడే, న్యూస్ నేషన్, రిపబ్లిక్, ఏబీపీ న్యూస్, న్యూస్24, ఎన్డీటీవీ ఇండియా న్యూస్ వంటి 40 లైవ్ చానెళ్ల అందుబాటులో ఉన్నాయి. దూరదర్శన్, ఆకాశవాణికి సంబంధించిన ప్రసారభారతి ఆర్కైవ్స్ చూసేందుకు కూడా వినియోగదారులకు అవకాశమిచ్చింది.

1945 దాటి ముందుకు కదలని భద్రతామండలి!

» ఐరాసలో భారత ప్రతినిధి హరీశ్ విమర్శ

న్యూయార్క్, నవంబరు 20: ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు చాలా మందకొడిగా సాగుతుండటంపై భారతదేశం అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలం చెల్లిన నిర్మాణంతో అది ఆధునిక ప్రపంచ వాస్తవాలను ఏ మాత్రం ప్రతిబింబించట్లేదని విమర్శించింది. 'అంతర్జాతీయ కీలక సవాళ్లు: భారత దేశ మార్గం' అనే అంశంపై కొలంబియా వర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ ప్రసంగించారు. 'ఇప్పటికే శాశ్వత సభ్యదేశాలు, ఆ సభ్యత్వాన్ని, వీటో అధికారాన్ని కూడా వదులుకునేందుకు అవి సిద్ధంగా లేవు' అన్నారు.

అండర్ ట్రయల్ ఖైదీలకు శుభవార్త!

» శిక్షపడే కాలంలో మూడోవంతు జైల్లోనే మగ్గినవారికి స్వేచ్ఛ: అమిత్‌షా

గాంధీనగర్, నవంబరు 20: దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతున్న అండర్ ట్రయల్ ఖైదీలకు శుభవార్త. వారి విడుదలకు ముహూర్తం ఖరారైంది. వారిపై మోపిన అభియోగాల ప్రకారం గరిష్ఠంగా ఎంత శిక్ష పడుతుందో.. అందులో మూడోవంతు జైల్లోనే గడిపిన వారిని ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం జరుపుకొనే లోపు విడుదల చేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఈ ప్రక్రియను నిర్దిష్ట కాలావధిలోగా పూర్తిచేసేందుకు 60 నిబంధనలను న్యాయస్థానాలు, ప్రాసిక్యూషన్, పోలీసుల ముందు ఉంచామన్నారు. నిర్దిష్ట కాలం తర్వాత కోర్టు విచారణ ముందుకు సాగని కేసుల్లో జైలు అధికారే కోర్టులో బెయిల్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లో అఖిల భారత పోలీసు సైన్స్ కాన్ఫరెన్స్(ఏఐపీఎస్‌సీ)లో ఆయన ప్రసంగించారు.

ఆహారోత్పత్తి పెరిగినా.. ఆకలి కేకలు!

ఆకలి కోరల్లోకి మరో 15 కోట్ల మంది

» ఆందోళన రేపుతున్న ఎఫ్ఏవో నివేదిక



న్యూఢిల్లీ, నవంబరు 20: గత రెండు దశాబ్దాలతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఆహార ఉత్పత్తి 55 శాతానికిపైగా పెరిగింది. వరి, గోధుమ, మొక్కజొన్న.. విరివిగానే పండిస్తున్నారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఆకలి కేకలు పెరుగుతూనే ఉన్నాయి. కరోనా మహమ్మారికి ముందు 2019తో పోలిస్తే 2023లో మరో 15.2 కోట్ల మంది ఆకలి బాధితులుగా మారారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) తాజాగా విడుదల చేసిన వార్షిక సంచికలో వెల్లడైంది. 2030 నాటికల్లా ఆకలిని తరిమికొట్టి సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఐక్యరాజ్యసమితి లక్ష్యానికి ఈ పరిస్థితి తూట్లు పొడిచేలా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎఫ్ఏవోకు చెందిన స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ద వరల్డ్ (ఎస్ఓఎఫ్ఐ) ఈ ఏడాది జూలైలో విడుదల చేసిన నివేదిక కూడా ఇదే అంశంపై ఆందోళన వ్యక్తం చేసింది. 2023లో మొత్తం 71 కోట్ల నుంచి 75 కోట్ల మంది ఆకలిని ఎదుర్కొన్నారని ఈ నివేదిక వివరించింది.

ఆఫ్రికా, ఆసియాలో సమస్య తీవ్రం

2020తో పోలిస్తే 2021లో పోషకాహార లోపం కాస్త తగ్గినప్పటికీ... 2023 వరకూ అదే స్థాయిలో కొనసాగిందని ఈ నివేదిక పేర్కొంది. పోషకాహార లోపం ఆఫ్రికాలో ఎక్కువగా ఉండగా.. ఆసియా ఆ తర్వాతి స్థానంలో ఉందని వెల్లడించింది. 2019-23 మధ్య చూస్తే ఆసియాలో ఆకలిని ఎదుర్కొన్న వారి సంఖ్య బాగా పెరిగిందని తెలిపింది. ప్రపంచ గణాంకాలను పరిశీలిస్తే 2022లో ప్రాథమిక పంటల ఉత్పత్తి 960 కోట్ల టన్నులకు చేరుకుంది. 2000వ సంవత్సరంతో పోలిస్తే ఇది 56 శాతం అధికం. ఈ పెరుగుదలలో మొక్కజొన్న, గోధుమ, వరి, చెరకు వాటానే ఎక్కువ. అలాగే 2000తో పోలిస్తే 2022 నాటికి మాంసం ఉత్పత్తి కూడా 55% పెరిగింది. ఈ పెరుగుదలలో చికెన్ వాటా ఎక్కువగా ఉంది. అంటే ప్రపంచవ్యాప్తంగా ఆహారోత్పత్తి పెరుగుతున్నప్పటికీ.. ఆహార అభద్రతాభావం కూడా అధికం కావడం ఆందోళన కలిగించే అంశం. ఇది ఆహార ఉత్పత్తి, కొరత వల్ల ఏర్పడ్డ సమస్య కాదని, ఉత్పత్తి అయిన ఆహారం అందరికీ అందకపోవడం, ఆర్థిక అసమానతలు దీనికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

బాల భారతానికి పర్యావరణ సవాళ్లు

2050 నాటికి దేశంలో 35 కోట్ల మంది పిల్లలు

వారి భవిష్యత్‌కు తక్షణ కార్యాచరణ అవసరం

యునిసెఫ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 20: తీవ్రమైన పర్యావరణ, ప్రమాదకరమైన వాతావరణ దుష్ప్రభావాలు భారతదేశంలో బాలల భవిష్యత్తుపై పడనున్నాయని యునిసెఫ్ హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 35 కోట్ల మంది పిల్లలు ఆ ప్రభావాన్ని చవి చూడనున్నారని తెలిపింది. వారి శ్రేయస్సుతో పాటు హక్కులను కాపాడటానికి ఆ సవాళ్లకు వెంటనే పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ప్రపంచ బాలల స్థితి రిపోర్టు 2024ను మారుతున్న ప్రపంచంలో బాలల భవిష్యత్తు పేరుతో యునిసెఫ్ బుధవారం ఇక్కడ విడుదల చేసింది. దీనిలో మూడు మెగా ట్రెండ్స్‌ను యునిసెఫ్ ప్రముఖంగా ప్రస్తావించింది. అందులో జనాభాలో మార్పు, పర్యావరణ సంక్షోభం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయి. ఇవే 2050 కల్లా పిల్లల తలరాతను మారుస్తాయని స్పష్టం చేసింది. 2050వ దశకంలో అనూహ్య రీతిలో బాలలపై పర్యావరణ, వాతావరణ దుష్ప్రభావాలు పడతాయని, 2000 నాటితో పోలిస్తే 8 రెట్లు ఎక్కువ మంది పిల్లలు హీట్‌వేవ్ ప్రభావానికి లోనవుతారని అంచనావేసింది. ఇప్పటితో పోలిస్తే భారత్‌లో పిల్లల జనాభా 2050 నాటికి 10 కోట్లకు పైగా తగ్గుతుందని నివేదికలో యునిసెఫ్ తెలిపింది. 2050 నాటికి భారత జనాభాలో దాదాపు సగం మంది పట్టణాల్లో నివసించే అవకాశం ఉంది కాబట్టి చైల్డ్ ఫ్రెండ్లీ అర్బన్ ప్లానింగ్ అవసరమని యునిసెఫ్ సూచించింది.

రష్యాలో ఏం జరుగుతోంది?

అణు కేంద్రాలను సందర్శిస్తున్న సెర్గీ షోయిగు

కీవ్‌లో అమెరికా, ఇటలీ ఎంబసీలు ఖాళీ



మాస్కో, నవంబరు 20: యుద్ధం ప్రారంభమైన 1000వ రోజున ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడులు జరిపిన నేపథ్యంలో.. రష్యా అప్రమత్తమైంది. రష్యా భద్రత మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఆ దేశంలోని అణు కేంద్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సరోవ్ అణు కేంద్రానికి చేరుకున్నారు. అక్కడి లేజర్, సూపర్ కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అయితే, ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అర్థవంతమైన ఎంపికలను మాస్కో స్వాగతిస్తుందని ఐక్యరాజ్య సమితి(ఐరాస)లో రష్యా మొదటి డిప్యూటీ శాశ్వత ప్రతినిధి పాలియాన్‌స్కీ వెల్లడించారు. మరోవైపు.. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌లో ఉన్న తమ రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా ప్రకటన తర్వాత ఇటలీ, స్పెయిన్, గ్రీస్ కూడా ఇదే తరహా ప్రకటనలు చేశాయి. రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడులకు ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో.. తమ రాయబార కార్యాలయం లక్ష్యంగా దాడులు జరిగే ముప్పు ఉందన్న నిఘావర్గాల సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా వివరించింది. తమ ఉద్యోగులను సురక్షిత షెల్టర్లలో తలదాచుకోవాలని సూచించినట్లు తెలిపింది. కాగా.. అమెరికా-రష్యా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇరుదేశాల మధ్య హాట్‌లైన్‌కు స్వస్తి పలికినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ వెల్లడించారు.

ఉక్రెయిన్‌కు.. అమెరికా యాంటీ-పర్సనల్ మైన్స్


కీవ్, నవంబరు 20: రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అనుమతినిచ్చిన తర్వాతి రోజే.. బైడెన్ సర్కారు మరో దూకుడు నిర్ణయాన్ని ప్రకటించింది. ఉక్రెయిన్ భూభాగంలోకి రష్యా సేనలు చొచ్చుకురాకుండా ఉండేలా.. యాంటీ-పర్సనల్ మైన్స్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. ఉక్రెయిన్ ఈ మందుపాతరలను తూర్పు ప్రాంతాల్లో(డాన్‌బాస్, ఖెర్సన్, మారియూపోల్) వినియోగించనుంది. ఈ ప్రాంతాల్లో రష్యా సేనలు స్థిరంగా చొచ్చుకువస్తుండడంతో.. యాంటీ-పర్సనల్ మైన్స్‌తో చెక్ పెట్టవచ్చని అమెరికా భావిస్తోంది. ఇవి ప్రమాదకరమైనవి. వాటిపై కాలు పెడితే.. శాల్తీలే లేచిపోతాయి. లేదంటే.. శాశ్వత అంగవైకల్యం మిగులుతుంది. అయితే.. అమెరికా సరఫరా చేయనున్న యాంటీ-పర్సనల్ మైన్స్‌లకు టైమర్లు ఉంటాయని, నిర్దీత కాలం(బ్యాటరీ సామర్థ్యం మేరకు 4 గంటల నుంచి 2 వారాలు) తర్వాత వాటంతట అవే నిర్వీర్యం అయ్యేలా ప్రోగ్రామ్ చేసి ఉంటాయని అమెరికా పేర్కొంటోంది.

జీ20 డిక్లరేషన్‌లో మాస్కోపై మెతక వైఖరి!

న్యూఢిల్లీ, నవంబరు 20: ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండించడంలో జీ-20 సదస్సు డిక్లరేషన్ వరుసగా రెండో ఏడాది కూడా విఫలమైంది. అయితే యుద్ధాన్ని ముగించాలని రాబోయే ట్రంప్ ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో కీవ్‌కు మద్దతు అందించే విషయంలో ఉదాసీనతను ప్రదర్శించింది. అంతకుముందు ఢిల్లీ డిక్లరేషన్ కూడా రష్యా పట్ల మెతక వైఖరి అవలంబించింది. ఢిల్లీ డిక్లరేషన్‌లో రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై ఏడు పేరాలు ఉండగా, ఇప్పుడు ఒక్క పేరాతో సరిపెట్టారు.

పాక్‌లో 12మంది సైనికులు మృతి

పెషావర్, నవంబరు20: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది సైనికులు, ఆరుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. బన్ను జిల్లాలోని మలిఖెల్ ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్ట్ వద్ద ఆత్మాహుతి దాడి సందర్భంగా జరిగిన పేలుడులో భారీ విధ్వంసం జరిగింది. సైనికులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్థాన్ ఆర్మీ ప్రకటించింది.



ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో 2024-25 వార్షిక ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపారు. బిల్లును ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టగా, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, విష్ణుకుమార్ రాజు బలపరిచారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో భారీగా నిధులు దారి మళ్లించారన్నారు. జగన్ జల్సాలు, టోకరాలంటూ రూ.10 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. భవిష్యత్‌లో వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు చేశారని విమర్శించారు. ఇంకా రాబోయే ఐదు టర్మ్‌ల కాలానికి మొత్తం తాకట్టు పెట్టాలని ప్రయత్నించారని, అప్పట్లో తాము గవర్నర్ ద్వారా కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో ఆగిపోయిందన్నారు. అసెంబ్లీ ఆమోదం లేకుండానే రూ.600 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

విశాఖ డెయిరీలో భారీగా అక్రమాలు

- విచారణకు హౌస్‌కమిటీ వేయాలని ఎమ్మెల్యేల డిమాండ్
- ఆమోదించిన సభ.. త్వరలోనే ఏర్పాటు చేస్తామన్న స్పీకర్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతి, అవకతవకలపై సమగ్ర విచారణకు శాసనసభా సంఘం ఏర్పాటు చేయాలని టీడీపీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బుధవారం శాసనసభలో డిమాండ్ చేశారు. దీనిపై సభ అభిప్రాయం తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. దాంతో స్పీకరు అయ్యన్నపాత్రుడు సభ అభిప్రాయాన్ని కోరగా.. కూటమి ఎమ్మెల్యేలంతా బల్లలు చరుస్తూ సభాసంఘం ఏర్పాటుకు మద్దతు తెలిపారు. దాంతో త్వరలోనే ప్రత్యేక సభాసంఘాన్ని నియమిస్తానని స్పీకర్ ప్రకటించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖడెయిరీపై చర్చ జరిగింది. ఈ చర్చలో సభ్యులు వేసిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిచ్చారు.

వైసీపీ ఇళ్ల నిర్మాణంలో ఎన్నో అక్రమాలు: కొలుసు

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల కోసం భూముల సేకరణ, నిర్మాణంలో ప్రతి దశలోనూ భారీస్థాయిలో జరిగిన అవినీతి, అవకతవకలపై ముఖ్యమంత్రితో చర్చించి అవసరమైతే హౌస్ కమిటీకి సిఫార్సు చేస్తామని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఇళ్ల స్థలాల పంపిణీలో అవకతవకలపై జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఇద్దరు వైసీపీ నేతలు...చిన్న సన్నకారు రైతుల నుంచి ఎకరా 6 నుంచి 7 లక్షలకు తీసుకుని.. ప్రభుత్వానికి జగనన్న కాలనీ కోసం 60-70 లక్షలకు విక్రయించి రూ.కోట్లు స్వాహా చేశారని తెలిపారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం రూ.7 వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై సీబీడీ విచారణ లేదా న్యాయ విచారణ లేదంటే హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నందున.. హౌస్ కమిటీపై ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ప్రజా ప్రతినిధులపై వైసీపీ అక్రమ కేసులు

- చంద్రబాబును జైల్లో పెట్టి.. ఫోన్లలో చూసి ఆనందించారు
- దీనిపై విచారణ జరిపించండి: ఎమ్మెల్యే బొలిశెట్టి

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులను ఇబ్బందులు పెట్టి, అక్రమంగా కేసులు పెట్టి, జైలులో పెట్టిన వ్యవహారంపై కమిటీ వేసి విచారణ చేయాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చంద్రబాబును జైలులో పెట్టినప్పుడు అప్పటి వైసీపీ కీలక వ్యక్తి జైలులోని సీసీ కెమెరాలను తన ఫోన్‌లో చూసుకునేవిధంగా అధికారులు ఏర్పాటు చేశారని చెప్పారు. దీనిపై విచారణ చేయాలన్నారు. రాప్తాడులో మాజీ ఎమ్మెల్యే రూ.15 కోట్లు డిమాండ్ చేయడంతో జాకీ సంస్థ కంపెనీని ప్రారంభించలేదని పరిటాల సునీత చెప్పారు. మున్సిపాలిటీల్లో ఖాళీ స్థలాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి కోరారు. గిరిజనుల కోసం జీవో 3ను పునరుద్ధరించాలని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు కోరారు. కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికలు వెంటనే జరపాలని మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ కోరారు.

రామ్మూర్తినాయుడుకు అసెంబ్లీ సంతాపం

సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మరణం పట్ల సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆయన గురించి సభలో చదివి వినిపించారు. 1952లో చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో ఖర్జూరనాయుడు, అమ్మన్నమ్మ దంపతులకు జన్మించిన ఆయన ఎస్వీ యూనివర్సిటీలో బీఏ డిగ్రీ పొందరన్నారు. 1994లో చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అనంతరం రెండు నిముషాలపాటు సభ మౌనం పాటించింది.

డిస్టిలరీలను భయపెట్టి తరిమేశారు : కొల్లు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం డిస్టిలరీలను, మద్యం కంపెనీలను భయపెట్టి రాష్ట్రం నుంచి తరిమేసిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. నూతన మద్యం విధానంపై బుధవారం అసెంబ్లీలో ఆయన ప్రకటన చేశారు. 2019లో మద్యపాన నిషేధం చేస్తామని నమ్మించి జగన్.. ప్రభుత్వ మద్యం షాపులు పెట్టి దోపిడీ చేశారన్నారు. కాగా, మూడు ఎక్సైజ్ బిల్లులకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఎక్సైజ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు, మద్యం అమ్మకాల బాధ్యత ప్రైవేటుకు అప్పగించేందుకు సంబంధించిన బిల్లులను మంత్రి సభలో ప్రవేశపెట్టారు. వాటికి సభ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది.

పీఏసీ కమిటీలకు నామినేషన్లు

ప్రజా పద్దుల కమిటీల ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఒక్కో కమిటీకి తొమ్మిది మంది చొప్పున మూడు కమిటీలకు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. ఎమ్మెల్యేలు గురువారం మధ్యాహ్నం ఒంటిగంటలోపు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. అవసరమైతే 22న ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

కడప మాజీ ఆర్జేడీ రాఘవరెడ్డి దురాగతాలపై చర్యలు

- ప్రాథమిక విచారణలో అక్రమాలు నిర్ధారణ
- దర్యాప్తు పూర్తిచేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం: లోకేశ్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కడప విద్యాశాఖ మాజీ ఆర్జేడీ రాఘవరెడ్డి దురాగతాలపై 45 రోజుల్లో దర్యాప్తు పూర్తిచేసి తగిన చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, బి.తిరుమలనాయుడు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. రాఘవరెడ్డి అక్రమాలపై ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందాయని, వాటిపై ప్రాథమిక విచారణ పూర్తి చేశామని చెప్పారు. దర్యాప్తు పూర్తిచేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత టీడీపీ ఎమ్మెల్సీ రాం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాఘవరెడ్డి సంస్కారహీనంగా వ్యవహరించారని, విద్యార్థుల ముందే టీచర్లను అవమానకరంగా మాట్లాడేవారని చెప్పారు. వైసీపీ హయాంలో ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయనపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వారిపై దాడి చేయించారన్నారు.

జగన్ జల్సాలకు 5 వేలకోట్లు: సోమిరెడ్డి

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ జల్సాలకు రూ.5 వేలకోట్లు ఖర్చు చేశారని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. సర్వే రాళ్లపై బొమ్మలు, పాస్ పుస్తకాలపై బొమ్మలు, కార్యాలయాలకు పార్టీ రంగులు, రుషికొండ ప్యాలెస్‌ల పేరుతో వేలకోట్లు వృథా చేశారన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్లలో జగన్ కారణంగా బడ్జెట్‌పైనే నమ్మకం పోయిందన్నారు.

ప్రైవేట్ సంస్థ యజమానులను జగన్ షూట్ చేస్తామన్నారు: విష్ణుకుమార్ రాజు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాజీ సీఎం జగన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓ ప్రైవేటు సంస్థ యజమానులను షూట్ చేస్తామని బెదిరించారని ఆరోపించారు. "తిరుపతిలోని అలిపిరి వద్ద ఆధ్యాత్మిక పార్కు నిర్మాణానికి ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు టెండర్లు పిలిచారన్నారు. టెండరులో రూ.18 కోట్లు చెల్లించిన వైష్ణవి వెర్సటైల్ వెంచర్స్‌కు 38 ఎకరాలు కేటాయించారని, అయితే అక్కడ సమీపంలో జూపార్కు ఉన్నందున పర్యావరణ అనుమతులు రాలేదన్నారు. 2021లో ఆ ప్రాంతాన్ని కేంద్రం ఎకోజోన్ నుంచి తొలగించిందని చెప్పారు. ఆ తర్వాత వైష్ణవి యజమానులను తాడేపల్లి కార్యాలయానికి, సచివాలయానికి పలుమార్లు పిలిపించి జగన్ తీవ్రంగా బెదిరించారు"ని ఆరోపించారు.



మరో పదేళ్లు బాబే సీఎం

- ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్లకు ఏపీ ఎకానమీ
- చంద్రబాబు విజన్‌తో తిరిగి నమ్మకం ఏర్పడింది
- ఆయన ఆదేశాల మేరకు మేం పనిచేస్తాం : పవన్
- కూటమి 150 రోజుల పాలనపై అసెంబ్లీలో చర్చ

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మరో పదేళ్లపాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబే ఉంటారని, రాబోయే ఐదేళ్లలో ఏపీ ఎకానమీ 1 ట్రిలియన్ డాలర్ల(రూ.8.43 లక్షల కోట్లు)కు చేరుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఇటీవల తాను మహారాష్ట్రకు వెళ్లినప్పుడు ఆ రాష్ట్రం ఈ మైలురాయి చేరుతుందని చెప్పానని, అయితే, విధ్వంసానికి గురైన ఏపీలో అది సాధ్యంకాదేమోనని అనుకున్నానని చెప్పారు. కానీ.. సీఎం చంద్రబాబు విజన్, ఆయన పాలనానుభవం చూశాక ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్న నమ్మకం ఏర్పడిందన్నారు. 150 రోజుల పాలనపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. "గంజాయి రవాణా, ఇసుక దోపిడీ, పంచాయతీల నిర్వీర్యం, దేవుడి విగ్రహాల కూల్చివేతలు లాంటివి మాత్రమే గత ప్రభుత్వం నుంచి కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చాయి. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసింది. దేశంలో తెలుగువారు ముందుండడానికి కారణమైన చంద్రబాబు లాంటి వ్యక్తిని కూడా ఇబ్బంది పెట్టారు. సొంత ప్రచారానికి భూముల పాస్‌పుస్తకాలను కూడా వదలకుండా మాజీ సీఎం బొమ్మలు వేసుకున్నారు. కానీ, అందుకు విరుద్ధంగా నేను డాక్టర్ 'యల్లాప్రగడ సుబ్బారావు' పేరును ప్రస్తావించగానే సీఎం చంద్రబాబు ఓ కాలేజీకి ఆయన పేరు పెట్టారు. డొక్కా సీతమ్మ పేరును ప్రస్తావించగానే.. చిన్నారుల మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టారు. పథకాలకు స్వాతంత్ర సమరయోధులు, త్యాగాలు చేసిన వారి పేర్లు పెట్టాలి. కానీ, గత ప్రభుత్వంలో జగన్ ప్రచార యావతో తన పేర్లు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు బలిదానం చేసిన రోజును రాష్ట్ర ఉత్సవంగా జరుపుకోబోతున్నాం. కన్యకాపరమేశ్వరి బలిదానం చేసిన రోజును కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది" అని పవన్ కళ్యాణ్ చెప్పారు.

జగన్ ఇంటి కంచె.. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా!

వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇంటి చుట్టూ ఏర్పాటు చేసుకున్న ఇనుప కంచె 'గ్రేట్ వాల్ ఆఫ్ చైనా' మాదిరిగా ఉందని బీజేపీ శాసన సభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ఇండియా, పాకిస్థాన్ సరిహద్దుల్లో కూడా జగన్ ఇంటికి ఏర్పాటు చేసుకున్నంత స్థాయిలో భారీఎత్తున కంచెలు ఉండవని తెలిపారు. అదే సీఎం చంద్రబాబు ఇంటివద్ద సెక్యూరిటీగా కేవలం రెండు పుల్లలు లాంటివి ఉంటాయన్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వంలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరించిన వారికి ఈ ప్రభుత్వంలో ఇంకా 'తగిన న్యాయం' జరగలేదని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అరాచకాన్ని అణచివేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

మనం కల్పించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ఏకంగా ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసిన ఘనత బాబుకే దక్కుతుంది. సోషల్ మీడియాలో మహిళలను నోటికొచ్చినట్లు మాట్లాడే సంస్కృతి ఏర్పడింది. సీఎంను సోషల్ మీడియాలో తిట్టినట్లుగానే గ్రామాల్లో మహిళలను బూతులు తిడుతున్నారు. అలాంటి వారిపై సీఎం, హోంమంత్రి ఉక్కుపాదం మోపారు" అని పవన్ అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా తాము పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రం బాగుండాలంటే మరో దశాబ్దం పాటు చంద్రబాబే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

నాకంటే పవనే గట్టిగా ఉన్నారు: చంద్రబాబు

ఉపముఖ్యమంత్రి స్పందనకు సీఎం చంద్రబాబు ప్రతిస్పందిస్తూ.. "సోషల్ మీడియా, గంజాయి అంశాల్లో నా కంటే పవన్ కళ్యాణే గట్టిగా ఉన్నారు. నేరాల విషయంలో రాజీలేదు. సోషల్ మీడియా పేరుతో మహిళల్ని కించపరిస్తే వారికి అదే చివరి రోజు. ప్రతిరోజూ సోషల్ మీడియాలో మాపై ఎలాంటి కామెంట్లు పెట్టారోనని చూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం. రౌడీలను రాష్ట్రంలో లేకుండా చేస్తాం. బ్లేడ్ బ్యాచ్ జాగ్రత్తగా ఉండాలి. ఎమ్మెల్యేలు ఎవరూ శాంతిభద్రతలను చేతిలోకి తీసుకోవద్దు. అది ప్రభుత్వ బాధ్యత" అని అన్నారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి డెడ్లీ కాంబినేషన్ అని, రాష్ట్రాన్ని నంబర్ వన్ చేస్తుందన్నారు.

కూటమి వచ్చాకే సకాలంలో జీతాలు

గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎప్పుడూ 1న జీతాలు రాలేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అయితే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో జీతాలు అందుతున్నాయని చెప్పారు. 13,326 గ్రామ పంచాయతీలకు పల్లె పండగ కింద రూ.4500 కోట్లు విడుదల చేశామన్నారు. 'జల్‌జీవన్ మిషన్'లో ఏపీని నంబర్‌వన్ చేస్తామని సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. సంక్షోభాలు, విపత్తులు సంభవించినపుడు ఎలా ఉండాలో చంద్రబాబును చూసి నేర్చుకోవాలని పవన్ సూచించారు. విజయవాడ వరదల సమయంలో బురదలో దిగి పనిచేశారని గుర్తు చేశారు. "కావాలంటే చంద్రబాబు కమాండ్ సెంటర్‌లో కూర్చుని పనులు చేయించవచ్చు. కానీ, ఆయనే స్వయంగా వెళ్లి వరదలో పర్యటించి బాధితులకు ఉపశ

అందరికీ రక్షిత మంచినీరు

- శాసనసభలో ఉపముఖ్యమంత్రి పవన్

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేందుకు గట్టిగా కృషి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రక్షిత మంచినీరు ప్రజల ప్రాథమిక హక్కు అని, వారికి సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. రాష్ట్రంలో రక్షిత నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు పూర్తిగా పాడైపోయాయని బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వారు అడిగిన ప్రశ్నలకు మంత్రి పవన్ కల్యాణ్ సమాధానమిచ్చారు. ఆ ప్లాంట్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ నిధులు కూడా ఉన్నాయని తెలిపారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి 24 గంటలూ ప్రజలకు తాగునీరు ఇవ్వాలని ప్రధాని కోరుకుంటున్నారని, తాను కూడా అదే గట్టి సంకల్పంతో ఉన్నానన్నారు. జల్ జీవన్ మిషన్ పనులను సకాలంలో పూర్తి చేసి ఏపీని దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని పవన్ పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రతి మండల హెడ్‌క్వార్టర్‌లో జన ఔషధి కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ చెప్పారు. గత అనుభవాల దృష్ట్యా.. గోదావరి పుష్కరాల కోసం ఈసారి ముందుగానే పనులు చేపడతామని మంత్రి నిమ్మల తెలిపారు. సంవర్ధకశాఖలో ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ల కొనుగోలులో అక్రమాలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. వాటి కొనుగోలు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగిందని చెప్పారు.

వలంటీర్ల వ్యవస్థ వైసీపీ హయాంలోనే రద్దు!

(మొదటి పేజీ తరువాయి)

వేతనాలు పెంచేవాళ్లం. ఆ వ్యవస్థపై మాకు విశ్వాసం ఉంది. కాబట్టే వలంటీర్ల కొనసాగింపు అంశాని సమగ్రంగా పరిశీలించాలని సీఎం చంద్రబాబు సూచించారు. వైసీపీ సభ్యుల తీరు దొంగే దొంగ అన్నట్లు ఉంది. వారిని మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమే' అని మంత్రి ధ్వజమెత్తారు.

ఎన్నికల సమయం కాబట్టి..: బొత్స

ఈ సందర్భంగా మండలిలో వైసీపీ సభ్యులు నిరసన తెలిపారు. విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... 'ఎన్నికల ముందు వలంటీర్లకు రూ.ఐదు వేలు కాదు రూ.10 వేలు గౌరవ భృతి ఇస్తామన్నారు. ఇస్తారా? లేదా? ఎన్నికల సమయం వచ్చింది కాబట్టి ఆ రెండు మూడు నెలలు కొనసాగిస్తూ జీవో ఇవ్వలేకపోయి ఉండవచ్చు. మీరు కొనసాగించొచ్చుకదా?' అని ప్రశ్నించారు.

వలంటీర్లకు న్యాయం చేయాలి: ఎమ్మెల్సీ కల్యాణి

వలంటీర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని వైసీపీ ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియాతో పాయింట్‌లో వరుదు కల్యాణి మాట్లాడుతూ.. 'ఎన్నికలప్పుడు చంద్రబాబు వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. విజయవాడలో వరదలప్పుడు నష్టం అంచనాలకు వలంటీర్ల సేవలు ఉపయోగించుకున్న ఈ ప్రభుత్వం ఇప్పుడేమో చాలా మంది వలంటీర్లు రాజీనామా చేశారని, గత ప్రభుత్వం వలంటీర్ల సేవలను పొడిగించలేదని అంటోంది. ప్రభుత్వ తీరుతో 2.60 లక్షల వలంటీర్లు రోడ్డున పడ్డారు' అని అన్నారు. సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఎన్నికల్లో కూటమి నేతల హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు. వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, బాలికల వసతి గృహాల వద్ద మహిళా సిబ్బందితో భద్రత కల్పించాలని కోరారు. కల్పలతా రెడ్డి మాట్లాడుతూ, కర్నూలులోని లోకాయుక్త, హెచ్‌ఆర్సీ, వక్ఫ్‌బోర్డు కార్యాలయాలను ప్రభుత్వం తరలించడం సరికాదన్నారు. ఎంపీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్‌చేయాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ 2024 రూట్ మ్యాప్ ప్రకటించాలి: పీడీఎఫ్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 రూట్ మ్యాప్ ప్రకటించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. 'నాలుగు లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ సిలబస్ ప్రకటించాలి. అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచాలి. ఎస్సీ వర్గీకరణ తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఈ అంశాలను విద్యా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ప్రకటన చేస్తామని మంత్రి చెప్పారు. ఆప్కోస్ ద్వారా భర్తీ అయిన వైద్య సిబ్బందికి 15 నెలల జీతం బకాయిలను విడుదల చేయాలి' అని ఎమ్మెల్సీలు కోరారు.

జగన్ నిర్లక్ష్యంతోనే బుడమేరుకు వరద : అనిత,నిమ్మల




అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని హోంమంత్రి వంగలపూడి అనిత, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. బుధవారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా అడిగిన ప్రశ్నకు మంత్రులు సమాధానం చెప్పారు. గత ఐదేళ్లలో బుడమేరు డైవర్షన్ కెనాల్ పనులు పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఒకేసారి 15వేల క్యూసెక్కులు రావడంతో గండ్లుపడి వరదలు వచ్చాయని నిమ్మల పేర్కొన్నారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ...'విపత్తును ఎదిరించి, అధిగమించగల దార్శనికత, అనుభవం కలిగిన నాయకుడు సీఎం చంద్రబాబు ఈ సమయంలో ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టం' అంటూ హోంమంత్రి చెబుతున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్సీ రుహుల్లా 'మాట్లాడండి... మాట్లాడండి' అంటూ ఎగతాళిగా అన్నారు. లోకేశ్ జోక్యం చేసుకొని... 'అధ్యక్షా... సభ కంట్రోల్ తప్పుతోంది. మంత్రులు మాట్లాడుతుంటే ఎగతాళి చేస్తూ సభ్యుడు మాట్లాడటమేంటి?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గంజాయి, డ్రగ్స్‌పై 'ఈగిల్' కన్ను

- జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్ రద్దు
- అసెంబ్లీ ముందుకు 20 బిల్లులు!
- రాష్ట్ర కేబినెట్ ఆమోదం

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, సరఫరా, అమ్మకాలను అదుపు చేయడానికి కొత్త పోలీసు విభాగం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. 'ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్‌గా వ్యవహరించే ఈ విభాగానికి 'ఈగిల్' అని నామకరణం చేశారు. గత ప్రభుత్వం రూ.100 కోట్లకు పైబడిన టెండర్లకు సంబంధించి సమీక్షకు ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్‌ను రద్దుచేయాలని నిర్ణయించింది. అలాగే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఇరవై బిల్లులను మంత్రివర్గం ఆమోదించింది. మొత్తం 22 బిల్లులు దాని ముందుకు రాగా.. 20 బిల్లులపై ఆమోదముద్ర వేసింది. ఆమోదించని రెండు బిల్లులూ స్థానిక సంస్థల్లో అవిశ్వాస తీర్మానాలకు సంబంధించినవి. స్థానిక సంస్థల అధిపతులపై అవిశ్వాసం పెట్టడానికి నాలుగేళ్ల గడువు ఉండాలని గతంలో నిర్ణయించారు. దానిని రెండున్నరేళ్లకు తగ్గిస్తూ పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు మంత్రివర్గ సమావేశం ముందుకు బిల్లులను తెచ్చాయి. ఈ వ్యవహారంలో మరికొంత చర్చ అవసరమని, తర్వాత చూద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు వాయిదావేశారు. ఆయన అధ్యక్షతన బుధవారం సాయంత్రం వెలగపూడి సచివాలయంలో కేబినెట్ సమావేశమైంది. లోకాయుక్త నియామకానికి సంబంధించి చట్ట సవరణ బిల్లును కూడా ఆమోదించింది. గతంలో చేసిన చట్టం ప్రకారం.. లోకాయుక్త నియామకాన్ని ఆమోదించే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా ఉండాలి. ప్రస్తుతం అసెంబ్లీలో గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేత ఎవరూ లేరు. దీంతో ప్రతిపక్ష నేత బదులు.. చట్ట సభల సభ్యులు ఎవరైనా ఉండవచ్చన్న సవరణను ప్రతిపాదించారు. రేషన్ బియ్యం అక్రమాలను ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం పరిధిలోకి తెస్తూ చేసిన సవరణను మంత్రివర్గం ఆమోదించింది. ఈ చట్టం కింద గతంలో కేవలం ఐదు రకాల నేరాలే ఉండేవి. ఇప్పుడు కొత్తగా మరో 8 రకాల నేరాలను చేర్చారు. అందులో రేషన్ బియ్యం అక్రమాలూ ఒకటి. భూ కబ్జాల నిరోధ చట్టానికి కూడా మరిన్ని కోరలు తొడిగి కఠిన శిక్షలు పడేలా సవరణ బిల్లులో ప్రతిపాదించారు. తగిన భద్రత ఉంటే రాష్ట్రంలో పర్యాటకం పెరుగుతుందని, పర్యాటకులు పెరిగితే ఉద్యోగాలు కూడా పెరుగుతాయని కేబినెట్ అభిప్రాయపడింది. దీని కోసం బీచ్‌ల వద్ద ఈతగాళ్లను నియమించాలని, పోలీసు భద్రత కల్పించాలని, లోపలి ప్రాంతాల్లో కూడా పర్యాటకులకు తగినంత భద్రత కల్పించి ఎక్కడికైనా వెళ్లి క్షేమంగా తిరిగి రాగలిగే పరిస్థితులు కల్పించాలని నిర్ణయించింది. కేరళలో కత్తి యుద్ధం మాదిరిగా మన రాష్ట్రంలో స్థానికంగా పేరు పొందిన థింసా నృత్యం వంటి వాటిని కూడా పర్యాటకంలో భాగం చేయాలని, దీనివల్ల మన ప్రత్యేకత నిలబడుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. క్రీడా విధానంగా భాగంగా దివ్యాంగులకు చిన్న నాటి నుంచే క్రీడల్లో ప్రవేశం కల్పించే వ్యవస్థ తీసుకురావాలని.. వారు పతకాలు సాధించిన తర్వాత సన్మానాలు చేయడం కాకుండా కింది స్థాయి నుంచి ప్రోత్సహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని విద్యా మంత్రి లోకేశ్ తెలిపారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో క్రీడకు ప్రాధాన్యమిచ్చి శిక్షణ ఇస్తే బాగుంటుందని పవన్ సూచించారు. ఇప్పటికే ఆ దిశగా పని జరుగుతోందని, కొన్నిచోట్ల కొన్ని క్రీడలకు శిక్షణ సౌకర్యాలు ఏర్పడ్డాయని లోకేశ్ చెప్పారు.

కేబినెట్ నిర్ణయాలివీ..

- దేవాలయాల ధర్మకర్తల మండళ్లలో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ వర్గాలకు విధిగా చోటు కల్పించడానికి ట్రస్టు బోర్డుల్లో సభ్యుల సంఖ్య పెంపు.
- జలవనరుల శాఖ పనులకు మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చే విధానం పునరుద్ధరణ. మెటీరియల్ సమకూర్చుకునేందుకు కంపెనీలకు అడ్వాన్సు చెల్లిస్తారు. బ్యాంకు గ్యారెంటీ తీసుకుంటారు.
- సహజ వాయువును వినియోగించే కంపెనీలపై గతంలో విధించిన 24 శాతం పన్ను ఐదు శాతానికి తగ్గింపునకు ఆమోదం. పారిశ్రామిక గ్యాస్, పైప్డ్ గ్యాస్‌కు కూడా ఇదే పన్ను వర్తిస్తుంది.
- టవర్ కార్పొరేషన్‌ను ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో విలీనానికి ఓకే.
- అమరావతిలో గతంలో పనులు పొందిన కంపెనీలకు ఇచ్చిన టెండర్లు రద్దు చేయాలన్న టెక్నికల్ కమిటీ సిఫారసులకు ఆమోదం.
- ప్రధానమంత్రి గృహ యోజన-2 పథకానికి సంబంధించి కేంద్ర గృహ నిర్మాణ శాఖతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆమోదం.
- విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు డీపీఆర్‌ను కేంద్రానికి పంపడానికి ఆమోదం. ఈ ప్రాజెక్టులకు వంద శాతం నిధులను కేంద్రమే భరించాలని తీర్మానం. తొలి దశలో రూ.11 వేల కోట్లతో పనులకు ప్రతిపాదన.
- రాష్ట్ర పర్యాటక విధానానికి ఆమోదం. పర్యాటక ప్రాజెక్టులకు పరిశ్రమల హోదా కల్పన.
- రాష్ట్ర క్రీడా విధానానికి ఆమోదం
- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో ఆమోదించిన పది పరిశ్రమల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం. నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ రూ.60 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించతలపెట్టిన స్టీల్ ప్లాంట్ కూడా ఇందులో ఉంది. ఈ మొత్తం పరిశ్రమల విలువ రూ.85 వేల కోట్లు.
- భవన నిర్మాణ అనుమతులను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి తప్పించి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు అప్పగించే చట్ట సవరణకు ఆమోదం.

హనీమూన్ సమయం ముగిసింది..!

హనీమూన్ సమయం ముగిసిందని, మంత్రులందరూ తమ శాఖలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. 'మనం చేస్తున్న పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ఎవరి శాఖ విజయాలను వారు ప్రచారం చేయాలి. మన పని మరెవరో చేస్తారని అనుకోవద్దు. అసెంబ్లీ సమావేశాలు ఇన్ని రోజులూ బాగా జరిగాయి. మిగిలిన రెండు రోజులు కూడా ఇలాగే జరిగేలా బాధ్యత తీసుకోండి' అని మంత్రులకు సూచించారు.

ఆర్సెలార్ మిట్టల్‌కు కేంద్ర అనుమతి సాధించిన బాబు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత అభ్యంతరం వ్యక్తం కాగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకొని కేంద్రంతో మాట్లాడి అనుమతి సాధించారని మంత్రివర్గ సమావేశంలో అధికారులు తెలిపారు. ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్న పరిశ్రమల విషయంలో అవి త్వరగా రావడానికి ఏం చేయాలో అన్నీ చేస్తున్నామని సీఎం చెప్పారు. 'మడకశిర వద్ద ఆయుధ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకొచ్చిన కంపెనీ.. ఎకరానికి రూ.5 లక్షల రేటు పెడతామని చెప్పింది. వాళ్లతో మాట్లాడి రూ.7 లక్షలకు ఫైనల్ చేశాం. విశాఖలో టీసీఎస్ కంపెనీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి భవనం కావాలని కోరింది. వారికి నచ్చిన భవనం చూశాం. అద్దె వద్ద కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. భవన యజమానితో మాట్లాడి కొంత బేరమాడి అది కూడా ఖరారుచేశాం. విశాఖకు త్వరలోనే టీసీఎస్ కంపెనీ వస్తోంది' అని ఆయన తెలిపారు. విజయవాడ సమీపంలో నిర్మించిన తూర్పు బైపాస్ నుంచి రాజధాని అమరావతిలోకి రావడానికి కిలోమీటరు దూరం ఫ్లై-ఓవర్ నిర్మించాలని, దీనికి రూ.150 కోట్ల వ్యయమవుతుందని అధికారులు చెప్పారు. మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

25ఏళ్ల ఆదాయాన్ని గత ప్రభుత్వం వాడేసింది

- శాఖల్లో తవ్వినకొద్దీ అప్పులు: పయ్యావుల ఫైర్



అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చట్టసభల పరిధిలోకి రాకుండా, వాటి అనుమతి లేకుండా గత ప్రభుత్వం రూ.వందల కోట్ల అప్పులు సేకరించి, ఖర్చు చేసిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. 25ఏళ్లలో రాబోయే ఆదాయాన్ని గత ప్రభుత్వం వాడేసిందని మండిపడ్డారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ రుణాలపై టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ప్రశ్న వేశారు. దీనికి పయ్యావుల సమాధానం చెబుతూ.. ఈ ఏడాది జూన్ నాటికే గత ప్రభుత్వం చేసిన అప్పులు రూ.9 లక్షల 74 వేల కోట్లుగా తేలాయని తెలిపారు. ఇప్పటికీ ఈ అప్పుల సంఖ్య రోజురోజుకీ ఒక్కో శాఖలో తవ్వినకొద్దీ పెరుగుతునే ఉన్నాయని చెప్పారు. ఈ వ్యాఖ్యలతో వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు.

మేం చెవిలో పువ్వులు పెట్టుకుని వినాలా?: బొత్స


ఆర్థికమంత్రి చెబుతున్న సమాధానంపై శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. 'మీరు చెప్పేదంతా మేం చెవిలో పువ్వులు పెట్టుకుని వినాలా?' అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఉన్న అప్పులపై హౌజ్ కమిటీ వేయాలన్నారు. బొత్స వ్యాఖ్యలకు ఆర్థిక మంత్రి కౌంటర్ ఇచ్చారు. 'బడ్జెట్‌పై సమాధానం చెప్పేటప్పుడు సభలో లేరుకదా.. అందుకే మళ్లీ చెబుతున్నా. వైసీపీ సభ్యులకు వాస్తవాలు వినే ఓపిక ఉండాలి.' అని పయ్యావుల ఘాటుగా వ్యాఖ్యానించారు.

టిడ్కో ఇళ్లపై రూ.5,546 కోట్ల రుణం

- రంగులు మార్చడానికి 300 కోట్లు : నారాయణ



అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం వివిధ రూపాల్లో టిడ్కో ఇళ్లపై రూ.5546.48 కోట్ల రుణం తీసుకుందని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. టిడ్కో ఇళ్లకు రంగులు మార్చడానికి రూ.300 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. బుధవారం శాసనమండలిలో టీడీపీ సభ్యులు తిరుమల నాయుడు, రామారావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. టీడీపీపై కక్షతో గత ప్రభుత్వం ఇళ్ల లబ్దిదారులను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు.



జనంలోకి మనం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి పాలనపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. "రాష్ట్రానికి ప్రజలే ఆస్తి. వారిని బలోపేతం చేస్తే ఏదైనా సాధ్యమే. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తా. ఎన్నికల్లో ప్రజాతీర్పులు కొత్త కాదు. కానీ, 2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటు చేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ టీడీపీ ఏర్పాటు, ఎన్నికల్లో పోటీ వంటివి అప్పట్లో సంచలనం సృష్టించాయి. మొన్న జరిగిన ఎన్నికలు అంతకంటే సంచలనంగా మారాయి. 93 శాతం స్ట్రైక్‌రేట్, 57 శాతం ఓట్ షేర్ వచ్చింది. 46 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రజాతీర్పు ఇంతకుముందు చూడలేదు. ప్రజలు బాధ్యతతో రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న సంకల్పంతో ఓటేసి తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును గౌరవిస్తూ, ప్రజల నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలి. ప్రజా ఆకాంక్షలు నెరవేరాలి. ప్రజల అంచనాలను అందుకునే బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఏ నేతకూ దక్కని గౌరవం

"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా విభజిత ఏపీలో ఏ నేతకూ దక్కని గౌరవం నాకు దక్కింది. ఉమ్మడి ఏపీకి 9 ఏళ్లు సీఎంగా, పదేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నా. నవ్యాంధ్రకు రెండోసారి ముఖ్యమంత్రిగా పని చేసే అవకాశం ప్రజలు ఇచ్చారు. ప్రజలు, వారి బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ వచ్చా. అందుకే ప్రజలు 4 దశబ్దాలుగా ఆదరిస్తున్నారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటా. నా రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు చూశా. కష్టాలు పడ్డా. అవమానాలను భరించా. చివరికి క్లైమోర్ మైన్స్ పేల్చినా వేంకటేశ్వర స్వామి దయతో బయటపడ్డా. అధికారం నాకు కొత్తేమీ కాదు. 2024లో సీఎం అయిన తర్వాత రాష్ట్ర పరిస్థితి చూసి బాధ కలుగుతోంది. ఎంత తవ్వితే అన్ని అవకతవకలు, భయంకరమైన విషయాలు బయటకు వస్తున్నాయి"

పెండింగ్ బిల్లులు పెద్ద సవాల్

"వైసీపీది విధ్వంసక పాలన. గాడితప్పిన యంత్రాంగం, అప్పులు, తప్పులు, పాపాలు, నేరాలు మా ప్రభుత్వానికి సవాల్‌గా మరాయి. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నేను, పవన్, ప్రధాని మోదీ కలిసి చర్చించాం. కేంద్ర నుంచి పూర్తి సహకారం ఉంటుంది. విభజన తర్వాత ఒక్కో ఇటుక పేర్చుకుంటూ వెళ్తున్నాం. రాత్రికి రాత్రి ఏదీ సాధ్యం కాదు. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పులున్నాయని సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టాం. పెండింగ్ బిల్లులు పెద్ద సవాల్‌గా మారాయి. మాకున్న అనుభవంతో వీటిని సెట్ చేశాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ద్వారా ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు భరోసా ఇచ్చే విధంగా పాలన కొనసాగిస్తాం"

ఆ రాష్ట్రాల్లోనూ ఇవ్వని విధంగా

"టీడీపీతోనే సంక్షేమం ప్రారంభమైంది. 'కూడు-గూడు-గుడ్డ' నినాదంతో నాడు రూ.2కే కిలో బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. ఈ పథకం దేశం మొత్తానికి ఆదర్శంగా నిలిచింది. తద్వారా ఆహార భద్రత పెంచాం. పేదవారికి అండగా ఉండాలనే సంకల్పంతో రూ.30 పింఛన్‌ను ఎన్టీఆర్ ప్రారంభించారు. ఇప్పుడు దాన్ని రూ.4 వేలు చేశాం. 2014లో రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రంలో పాలన ప్రారంభించాం. లోటు బడ్జెట్‌లో కూడా 120 సంక్షేమ పథకాలను అమలు చేశాం. ప్రస్తుతం పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచాం. ఏపీ కంటే సంపద ఎక్కువ ఉన్న రాష్ట్రాలు కూడా ఇవ్వనంత ఎక్కువ మొత్తంలో ఇస్తున్నాం. దేశంలో ఏపీ తర్వాత హరియాణా మాత్రమే రూ.2,500 పెన్షన్ ఇస్తోంది. పేదల కోసం 189 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. అన్న క్యాంటీన్లను ఇప్పటి వరకు 1.18 లక్షల మంది ఉపయోగించుకున్నారు. పది మందికి అన్నదానం చేయాలని భావించే వారు అన్న క్యాంటీన్ల ద్వారా ఆ సేవ చేయాలి"



అమ్మపడ్డ కష్టాలు చూసి!

"ఉమ్మడి ఏపీలో దీపం పథకం ప్రవేశపెట్టాం. మా అమ్మ పడ్డ కష్టాలను చూసిన తర్వాత ఏ ఆడబిడ్డా అలాంటి కష్టం పడకూడదనే ఉద్దేశంతో 'దీపం పథకం' ప్రారంభించాం. ఇప్పుడు దీపం-2 పేరుతో ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. కేవలం రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది. గ్యాస్ సిలిండర్‌కు డబ్బులు చెల్లించిన 48 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు పడతాయి. 42 లక్షల మందికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం సంపద సృష్టించే పనిలో ఉన్నాం. అమరావతి నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం. డిసెంబరు నుంచి పనులు ప్రారంభిస్తాం. పోలవరం గేమ్ చేంజర్. కేంద్రం రూ.12 వేల కోట్లు కేటాయించింది. ప్రాజెక్టును 45.72 మీటర్ల మేరకు నిర్మాణం చేపడతాం. పంచాయతీరాజ్ శాఖకు రూ.990 కోట్లు ఇచ్చాం. మరో రూ.1200 కోట్లు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. దేశంలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 16 వేల గ్రామసభలు ఒకేరోజు నిర్వహించాం.

> **ఇదీ ఇప్పటి అభివృద్ధి**
>
> "వైసీపీ హయాంలో తెచ్చిన చెత్తపన్ను రద్దు చేశాం. మత్స్యకారులకు ఇబ్బందిగా మారిన జీవో 217ను రద్దు చేశాం. స్వర్ణకారుల కార్పొరేషన్ పెట్టాం. గీత కార్మికుల కోసం మద్యం దుకాణాల్లో 10 శాతం షాపులు కేటాయించాం. అర్చకుల జీతాలు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచాం. నాయిబ్రాహ్మణుల వేతనాలు రూ.15 వేల నుంచి రూ.25 వేలు చేశాం. ఆలయాల్లో ధూపదీప నైవేద్యం కోసం రూ.10 వేలు ఇస్తున్నాం. చేనేతపై జీఎస్టీ ఎత్తేశాం. రైతులకు రూ.1,674 కోట్ల బకాయిలు చెల్లించాం. పంట సేకరించిన 48 గంటల్లో చెల్లింపులు చేస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకువస్తున్నాం. ప్రైవేటు, ప్రభుత్వ భూముల జోలికి వచ్చే కబ్జాదారులను వదిలి పెట్టం"
>
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు

> "గత నాలుగేళ్లలో ఇక్కడే(అసెంబ్లీ) నా కుటుంబ సభ్యుల్ని అవమానించారు. బాధ, ఆవేదనతో కుమిలిపోయా. చివరికి జైలుకు కూడా పంపించారు. కానీ, నేను ఏ తప్పూ చేయలేదు. అనుక్షణం ప్రజల కోసం పని చేశా. ఎన్ని ఇబ్బందులు పెట్టినా మనో ధైర్యాన్ని పెంచుకుని ప్రజల రుణం తీర్చుకునే ఆలోచన చేస్తున్నా. మళ్లీ నాలుగోసారి సీఎం అయ్యా"
>
> "అవినీతి, డబ్బులు, కులం, మతం, ప్రాంతం, వర్గం వంటి అంశాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఈ రోజుల్లో.. ప్రజలు నాపై ఇంత నమ్మకం పెట్టుకున్నారంటే నా జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేను"
>
> \- అసెంబ్లీలో చంద్రబాబు

రూ.4500 కోట్ల పనులకు అంచనాలు తీసుకుని, 30 వేల పనులకు శ్రీకారం చుట్టాం. జనవరి 15 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్ అండ్‌బీ రోడ్లను కూడా బాగు చేయిస్తున్నాం. రూ.860 కోట్లతో సంక్రాంతి నాటికి గుంతలు మొత్తం పూడ్చే విధంగా పనులు ప్రారంభించాం"

లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యం

"మేం అధికారంలో ఉన్నప్పుడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 10 లక్షల ఎకరాలకు నీరు అందించాం. తర్వాత వచ్చిన ప్రభుత్వం 4 లక్షల ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేకపోయింది. ప్రతిసారీ నేను సీఎం అవగానే లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చి లక్షల ఎకరాలకు నీరిస్తుంటే, తర్వాత వచ్చే ప్రభుత్వాలు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో మోటార్లు పోవడం, దొంగతనాలు జరగడంతో లిఫ్ట్ ఇరిగేషన్ ఇబ్బందుల్లో పడుతోంది. ఎన్డీయే ప్రభుత్వం 'జాబ్ ఫస్ట్' అనే హామీకి కట్టుబడి ఉంది. అందుకే అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశా. రాష్ట్రంలో రూ.378 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 3.75 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం"

అలాంటివారి తాట తీస్తాం

"గత ప్రభుత్వం పోలీస్ శాఖను నిర్వీర్యం చేసింది. రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చి, నాయకుల్ని అణగదొక్కే విధంగా టార్గెట్ చేశారు. ఆడబిడ్డపై హత్యాచారం నీచం. ఇవి చూస్తే చాలా బాధేస్తోంది. గంజాయి నివారణకు డ్రోన్స్ పెట్టాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల్లో అవగాహన తీసుకురావాలి. తల్లిదండ్రులు కూడా ఎడ్యుకేట్ చేయాలి. రాష్ట్రంలో కరడుగట్టిన నేరస్తులను హెచ్చరిస్తున్నా. మీరు ఉండాల్సిన ప్రదేశం ఏపీ కాదు. సమాజానికి సవాల్‌గా మారితే తాట తీస్తాం. గత ప్రభుత్వం మద్యంలో దోపిడీ చేసింది. హోల్‌సేల్, రిటైల్, తయారీ వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పారదర్శకత తీసుకువచ్చాం. బెల్ట్ షాపులు పెడితే ఖబడ్దార్. బెల్ట్ తీస్తాం. ఎమ్మెల్యేలు బెల్ట్ షాపులు లేకుండా చూసుకోవాలి. టెక్నాలజీ సాయంతో వాట్సాప్ గవర్నమెంట్ తీసుకువచ్చాం. ఈ సభలోనే విజన్-2047ను ప్రవేశపెడతాం. కొత్తగా పీ-4 ద్వారా సంపద సృష్టిస్తాం. పీ-4 ద్వారా పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్ ద్వారా పేదలను సమానంగా పైకి తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

కొట్టి.. ఒంటికి రంగుపూసి..

బాలలతో భిక్షాటన

- కర్నూలులో ఓ ముఠా దారుణకాండ
- పిల్లల భిక్షాటన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- స్పందించిన మంత్రి నారా లోకేశ్.. రక్షిస్తామని భరోసా

కర్నూలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వారంతా బడి ఈడు చిన్నారులు. కానీ, కర్నూలు నగరంలో భిక్షాటన చేస్తున్నారు. ఒంటికి వెండి రంగు పూసుకుని యాచన చేస్తున్నారు. నిజానికి వారు ఇష్టంతో చేస్తున్న పనికాదు. వీరి వెనుక ఓ ముఠా ఉంది. పిల్లల్ని కొట్టి ఈ పనికి పురుగొల్పుతోంది. స్థానిక డ్రస్ సర్కిల్‌లో ఓ బాలుడికి ఒంటి నిండా సిల్వర్ రంగు పూసి తీవ్రంగా కొట్టి భిక్షాటన చేయిస్తున్న దృశ్యాలను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ బాలుడితో పాటు మరో ముగ్గురు కూడా భిక్షాటన చేయడం వెనుక ఓ ముఠానే ఉందని పేర్కొన్నారు. ఇది వైరల్ అయింది.



ఒంటిపై రంగులు వేసుకొని భిక్షాటన చేస్తున్న చిన్నారులు

హృదయ విదారకం: లోకేశ్

పిల్లల భిక్షాటన వీడియో చూసిన మంత్రి నారా లోకేశ్.. ఇది హృదయ విదారక సంఘటనగా పేర్కొన్నారు. ప్రతి బిడ్డ భద్రత, ప్రేమానురాగాలు, సమాజంలో గౌరవం పొందడానికి అర్హుడు. ఆ చిన్నారిని గుర్తించి అవసరమైన రక్షణ, సంరక్షణ చర్యలు చేపడతాం. చిన్నారిపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనిపై చిన్నారి వీడియో పోస్టు చేసిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ సంతోష్ కుమార్ ప్రతిస్పందిస్తూ.. మంత్రి లోకేశ్ స్పందించడం ఆనందంగా ఉందన్నారు. కాగా, కర్నూలులో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, రాజ్ విహార్ సర్కిల్, కలెక్టరేట్ ఎన్టీఆర్ సర్కిల్, డ్రస్ సర్కిల్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో చిన్నారులతో ముఠా భిక్షాటన చేయిస్తోంది. ఆ చిన్నారులకు సరైన ఆహారం కూడా పెట్టకుండా గంజాయి, వైట్‌నర్ మత్తుకు బానిసలను చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ జిల్లా స్థాయి యంత్రాంగం చూస్తూ కూడా ఈ తతంగాన్ని పట్టించుకోవడంలేదు. మంత్రి లోకేశ్ ఆదేశాలతోనైనా జిల్లా కలెక్టరు, ఎస్పీ తక్షణం స్పందించి వారిని బాలల సదన్‌కు తరలించాలని పలువురు కోరుతున్నారు.

తండ్రీ కొడుకులను కాటేసిన కరెంటు తీగ

- బైక్‌పై వస్తుండగా ఘోరం... అనంతలో విషాదం

యల్లనూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తెగి మీద పడటంతో తండ్రీకొడుకులు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన అనంతపురం జిల్లా యల్లనూరు మండల పరిధిలోని దంతలపల్లి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి రామాంజనేయులు(45), తన కుమారుడు రవి (13)తో కలిసి కడప జిల్లా లింగాల మండలం అంకేన్‌పల్లిలోని తన సోదరి ఇంటికి మంగళవారం బైక్‌పై వెళ్లారు. రాత్రి అక్కడే ఉండి ఉదయమే స్వగ్రామానికి బయలుదేరారు. త్వరగా ఇంటికి వెళ్లాలని ప్రధాన రహదారి మీదుగా కాకుండా బిదనంచెర్ల నుంచి దంతపల్లి మీదుగా వస్తున్నారు. వీరు దంతలపల్లి సమీపానికి రాగానే విద్యుత్ పోల్ డిస్క్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా తీగ తెగిపోయింది. విద్యుత్ సరఫరా అవుతున్న 11 కేవీ తీగ తండ్రీకొడుకుల మీద పడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.

గ్యాస్ లబ్ధిదారుల ఖాతాల్లో 229 కోట్లు: నాదెండ్ల

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.229 కోట్లు జమ చేసిందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 'దీపం-2' పేరుతో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 33.44 లక్షల సిలిండర్లను డెలివరీ చేశామని మంత్రి తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 28.86 లక్షల మంది ఖాతాల్లో సబ్సిడీ కింద రూ.229 కోట్లు జమ చేశామన్నారు.



పంప్డ్ స్టోరేజీ ప్లాంటు పనులు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన కంటైనర్ వద్ద ఆదినారాయణ రెడ్డి వర్గీయుల దౌర్జన్యం, రాళ్లు విసరడంతో కంటైనర్ అద్దాలు ధ్వంసమైన దృశ్యం

జమ్మలమడుగులో కప్పం కడితేనే

'అదానీ'కైనా అనుమతి

- ఇక్కడ ఏం చేయాలన్నా మేమే.. బీజేపీ ఎమ్మెల్యే మనుషుల హల్‌చల్
- కడప జిల్లాకు అదానీ ప్రాజెక్టు.. సబ్ కాంట్రాక్ట్ సీఎం రమేశ్ సంస్థకు
- భగ్గుమన్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బ్యాచ్

(కడప-ఆంధ్రజ్యోతి)

'అదానీ కంపెనీ అయినా మాదే రూల్' అంటూ బీజేపీ ఎమ్మెల్యే అనుచరులు చేసిన రగడ చర్చనీయాంశమైంది. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురంలోని రాగికొండ సమీపంలోని దొంతికోనలో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంటు(హైడ్రోపవర్ ప్రాజెక్టు) నిర్మాణం పనులు చేపట్టిన అదానీ సంస్థ సిబ్బందిపై జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు దాడికి పాల్పడ్డారు. అద్దాలు, వాహనాలను ధ్వంసం చేశారు. దొంతికోన వద్ద సర్వే నంబర్ 309/2, 310, 307, 308లలోని 470 ఎకరాల్లో 1800 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్‌స్టోరేజీ విద్యుత్ ప్లాంటును అదానీ కంపెనీ ఏర్పాటు చేయనుంది. దీనికి రూ.5 వేల కోట్లు వెచ్చించనుంది. ఈ విద్యుత్‌ప్లాంటు ఏర్పాటులో సబ్ కాంట్రాక్టు పనులను బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేపట్టింది. అయితే ఈ పనులు తమకే ఇవ్వాలని ఆదినారాయణరెడ్డి కుటుంబసభ్యులు పట్టుబట్టారు. దీంతో చాలా రోజులుగా నిర్మాణ పనులు మొదలుపెట్టలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రిత్విక్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు మొదలుపెట్టింది. దీంతో ఎమ్మెల్యే సోదరుడు శివనారాయణరెడ్డి, బీజేపీ యువ మోర్చా నేత రాజేశ్‌రెడ్డి సహా సుమారు 200 మంది ప్రాజెక్టు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ మొదలైన పనులను అడ్డుకుని దాడులకు తెగబడ్డారు. కాగా, వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా యజమానులను బెదిరించారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. జమ్మలమడుగును ఎమ్మెల్యే ఆది కుటుంబీకులు మండలాల వారీగా పంచుకున్నారని విమర్శలున్నాయి.

చంద్రబాబు హెచ్చరించినా..

జమ్మలమడుగులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే డబ్బు డిమాండ్ చేస్తున్నారనేది సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డిని ఆయన పిలిచి పరిశ్రమల ఏర్పాటు కోసం తాను కష్టపడుతుంటే మీరు ఇలా చేస్తారా అంటూ తీవ్రంగా మందలించారని తెలిసింది. అయినా కూడా లెక్క చేయకుండా దాడులు చేయడం కలకలం రేపుతోంది. అయితే, స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఆందోళన చేశామని ఎమ్మెల్యే ఆది వర్గీయులు చెబుతున్నారు. అయితే సబ్ కాంట్రాక్టు పనులు తాము చేపట్టడం జీర్ణించుకోలేకే దాడులకు తెగబడ్డారని ఎంపీ వర్గీయులు చెబుతున్నారు. కాగా, ఈ వ్యవహారంలో ఆదినారాయణరెడ్డి వర్గీయులు 200 మందిపై కేసు నమోదు చేశామని కొండాపురం పోలీసులు తెలిపారు.

సీఎం రమేశ్ సంస్థతో విభేదాల్లేవు: ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగులో అదానీ కంపెనీపై దాడి చేయలేదని, ఆ కంపెనీ పనుల కోసం వైసీపీ దందాలు చేస్తుంటే స్థానికంగా తమవాళ్లు తిరుగుబాటు చేసి, అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వివరణ ఇచ్చారు. సీఎం రమేశ్ కంపెనీతో విభేదాలు లేవని తెలిపారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. అదానీ సంస్థలను ఆహ్వానిస్తామని, కానీ, ఆ సంస్థల పేరుతో వైసీపీ వాళ్లు దొంగ కంపెనీలు పెడతామంటే సహించేది లేదన్నారు.

ఏం జరుగుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

అయితే మార్పు ఇంకా కనిపించడం లేదని అన్నారు. 'భూ కబ్జాలు, ఇసుక దోపిడీ, మద్యం కుంభకోణం, మైనింగ్ అక్రమాలు, రేషన్ బియ్యం మాఫియా, చివరికి ఆడుదాం ఆంధ్రాలోనూ దోపిడీ చేశారు. ప్రజల సంపదను ప్రభుత్వ పెద్దలే దోచేయడం దారుణం. ఇటువంటి వ్యక్తులకు శిక్ష పడేలా చేయకుంటే ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని కోల్పోయినట్లే. గత ప్రభుత్వంలో చిత్తూరు జిల్లాలో ఎంత అరాచకం జరిగిందో మీకు తెలుసు. వేల ఎకరాల భూములు కబ్జా చేశారు. చుక్కలు పెట్టించి లాక్కొని, నిషేధిత జాబితాలో చేర్చి తక్కువ ధరకు తీసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోగానే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని తగుల బెట్టేశారంటే ఇది గూండా రాజ్యమా? ఘటన జరిగినప్పుడు హెలికాప్టర్‌లో వెళ్లమని డీజీపీ, సీఐడీ ఏడీజీని పంపాను. ఆ కేసు దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. ఇబ్బందేంటి.. జాప్యమెందుకు?' అని చంద్రబాబు ప్రశ్నించారు. 'అక్కడ రాజకీయ సిఫారసులతో పది చేస్తే, సిబ్బంది సొంతంగా ఐదు చేశారు సర్. ఎన్‌వోసీల వివరాలు బయటికి వస్తాయనే తగుల బెట్టేశారు. అప్పుడున్న సిబ్బందిలో ఎక్కువమంది ఇలాంటివి చేశారు. అందుకే దర్యాప్తులో ఆలస్యం అవుతోంది. బాధ్యులను ఆధారాలతో జైలుకు పంపుతాం' అని పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. 'ఆధారాలు సేకరించండి. టెక్నాలజీ వినియోగించుకుని ఉచ్చు బిగించండి. ఇకపై ఎవరూ అక్రమాలు చేయడానికి సాహసించకూడదు. పోలీసుల పనితీరులో ఇంకా మార్పు రావాలి' అని సీఎం సూచించారు.

మద్యం కేసులో ఆలస్యమెందుకు?

మద్యం కుంభకోణంలో చర్యల్లో జాప్యంపైనా సీఎం ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఫైళ్లు, కంప్యూటర్లు అన్నీ స్వాధీనం చేసుకుని డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తున్నామని అధికారులు బదులిచ్చారు. పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తున్నామని, వీలైనంత త్వరలో కీలక వ్యక్తుల్ని అరెస్టు చేస్తామని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. రేషన్ మాఫియాపై సీఎం పలు ప్రశ్నలు వేసినప్పుడు పోలీసు ఉన్నతాధికారులు మౌనంగా ఉన్నట్లు తెలిసింది. రేషన్ మాఫియాను వదలొద్దని, ఆధారాలు సేకరించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో జరిగిన దోపిడీపైనా అధికారులు మౌనం వహించినట్లు తెలిసింది.

గనుల ఘనులు జైలుకు వెళ్లాల్సిందే

మైనింగ్ దోపిడీ గురించి సీఎం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. 'ఇసుక, మైనింగ్ దోపిడీలో కీలక సూత్రధారి వెంకటరెడ్డి కస్టడీలో ఏమి చెప్పాడు? అందులో నిజానిజాలు సరిచూసుకున్నారా? అరెస్టులవైపు వెళుతున్నారా? అనుమతుల్లేని తవ్వకాలతో అక్రమంగా సహజ సంపద తరలించినవారు, సహకరించిన వ్యక్తులు, వాటాలు తీసుకున్న పెద్దల్ని ఎవరినీ వదలొద్దు. బాధ్యులందరూ జైలుకు వెళ్లాల్సిందే' అని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. సాంకేతిక అంశాల కారణంగానే వెంకటరెడ్డికి బెయిలు వచ్చిందని అధికారులు బదులిచ్చినట్లు తెలిసింది.

బూతుల నోళ్లకు తాళం వేశాం: డీజీపీ

ఐదేళ్ల పాటు ఇష్టారాజ్యంగా బూతులతో సోషల్ మీడియా ద్వారా రెచ్చిపోయిన సోషల్ సైకోల నోళ్లకు తాళాలు వేయగలిగారని పోలీసుల్ని సీఎం చంద్రబాబు అభినందించారు. 'వావి వరసలు లేకుండా తల్లి, చెల్లి, ఆడబిడ్డలనే స్పృహ లేకుండా జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేశారు. అటువంటి సైకోలను గడిచిన రెండు వారాల్లో బాగానే కట్టడి చేశారు' అని సీఎం అన్నారు. సుమారు నాలుగు వేలకు పైగా ఇటువంటి అకౌంట్లను గుర్తించి నిఘా పెట్టామని, సగానికి పైగా క్లోజ్ అయ్యాయని డీజీపీ వివరించారు. మిగిలిన వాటిలో వస్తున్న పోస్టులపైనా నిఘా పెట్టి నిరంతరం పరిశీలిస్తున్నామని చెప్పారు.

> **రౌడీషీటర్ బోరుగడ్డకు రాచమర్యాదలా?**
>
> - పోలీసుల తీరుపై సీఎంఓ ఆరా
>
> (గుంటూరు-ఆంధ్రజ్యోతి)
>
> రాష్ట్రంలో ఎన్నో అరాచకాలకు పాల్పడిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌కు పోలీసులు రాచమర్యాదలు చేయడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. బోరుగడ్డ విషయంలో పోలీసుల తీరు, సోషల్ మీడియాలో జరుగుతున్న రచ్చపై సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బోరుగడ్డ కేసుల విషయంలో పోలీసులు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, ఆయనకు చేసిన రాచమర్యాదలు, అందుకు బాధ్యులపై తీసుకున్న చర్యలు తదితర సమగ్ర సమాచారంతో రావాల్సిందిగా డీజీపీని సీఎంవో కోరినట్లు తెలిసింది. దీంతో అనిల్‌పై కేసులు, విచారణ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసులు, చర్యలు వంటి పూర్తి వివరాలను ఒకటి, రెండు రోజుల్లో ముఖ్యమంత్రిని కలిసి డీజీపీ వివరించనున్నట్లు తెలుస్తోంది.

బే పార్కులో 'భూకోణం'!

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీగా ఉంది. ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనుల్లో ఒక్కటీ చేయలేదు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం తక్షణం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. శారదా పీఠానికి అక్రమంగా, అడ్డగోలుగా చేసిన భూకేటాయింపును రద్దు చేసినట్లే... బేపార్కు భూమినీ స్వాధీనం చేసుకుంటుందా? అని ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఇండో అమెరికన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అనే సంస్థ 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పర్యాటక ప్రాజెక్టు చేపడతామని ప్రతిపాదించి రుషికొండలో 37 ఎకరాలు లీజుకు తీసుకుంది. లీజు కాలం 33 ఏళ్లు. ఈ ఒప్పందం 2000లో జరిగింది. ఈ భూమిలో కొండపైన 28 ఎకరాలు, కొండకు ఎదురుగా రుషికొండ బీచ్‌ను ఆనుకొని 9ఎకరాల భూమి ఉంది. ఇదంతా సీఆర్‌జెడ్ పరిధిలో ఉండడంతో నిర్మాణాలకు అనుమతులు తెచ్చుకోవడంలో ఆలస్యమైంది. కొండపై ప్రాజెక్టుకు 'బే పార్కు' అని నామకరణం చేశారు. వైసీపీ అధికారంలోకొచ్చాక ఆ పార్టీ పెద్దలు విశాఖలో విలువైన భూములు, ప్రాజెక్టులు హస్తగతం చేసుకున్నారు. అందులో బే పార్క్ కూడా ఒకటి. 'ఇస్తారా చస్తారా' అంటూ బెదిరించారు. బ్యాంకు రుణాలు తాము చూసుకుంటామని చెప్పి వారి నుంచి లాగేసుకున్నారు. అయితే, బీచ్‌కు ఆనుకుని ఉన్న తొమ్మిదెకరాల భూమి మాత్రం 25 ఏళ్ల నుంచి అలాగే ఉంది. దాని పక్కనే మరో 3ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కలిపేసుకొని చుట్టూ కంచె వేశారు. రుషికొండలో ప్యాలెస్ నిర్మించినప్పుడు, వర్కర్లు తాత్కాలికంగా నివాసం ఉండడానికి ఈ భూముల్లో షెడ్లు వేశారు. వాటిని తొలగించలేదు. రుషికొండలో ఇప్పుడు ఎకరా విలువ రూ.25 కోట్లు. 9ఎకరాల లీజు భూమి విలువ రూ.225 కోట్లు, ఆక్రమణలో ఉన్న భూమి విలువ రూ.75 కోట్లు. మొత్తం 300 కోట్ల విలువైన భూమి వైసీపీ నేతల 'కబ్జా'లోనే ఉంది.

> **ఏడాది క్రితమే లీజు పెంపు**
>
> బే పార్క్ లీజు గడువు 2032 చివర్లో ముగుస్తుంది. అయితే వైసీపీ పెద్దలు ఈ లీజును 99 ఏళ్లకు పెంచుతూ 2023లో రిజిస్ట్రేషన్ పనులు పూర్తిచేశారు. కొండపైన బే పార్క్ సంగతి పక్కన పెట్టినా, కింద 9ఎకరాల కేటాయింపును రద్దు చేయవచ్చు. ఆక్రమించిన మూడు ఎకరాలనూ స్వాధీనం చేసుకోవచ్చు. సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విశాఖ వాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు తీరిన ఫీజు కష్టాలు

- ఈ ఏడాది నుంచి కాలేజీలకే రీయింబర్స్‌మెంట్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ఐదేళ్లుగా పడుతున్న ఫీజు కష్టాల నుంచి వారిని గట్టెక్కించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన ఫీజులను నేరుగా కాలేజీల ఖాతాలకు జమ చేసే విధానం తీసుకొచ్చింది. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఇచ్చే ఫీజులు(ఎస్సీ విద్యార్థులు మినహా) కాలేజీల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపింది. విద్యార్థుల హాజరు ఆధారంగా ఫీజులు విడుదల అవుతాయని పేర్కొంది. దీనిపై త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనున్నారు. కాగా, జగన్ హయాంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2019కి ముందు ఫీజులను కాలేజీలకు జమ చేసే విధానం ఉండగా, పారదర్శకత పేరుతో జగన్ ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు ఫీజులు ఇచ్చే విధానం తెచ్చింది. అప్పటినుంచి విద్యార్థులకు ప్రభుత్వం చుక్కలు చూపించింది. ఏటా నాలుగు విడతల్లో ఫీజులు విడుదల చేయాల్సి ఉండగా ఒక్క సంవత్సరం కూడా ఫీజులు సకాలంలో ఇవ్వలేదు. మరోవైపు కాలేజీ యాజమాన్యాలు మాత్రం ఫీజుల విడుదలతో తమకు సంబంధం లేదని, ముందుగానే కట్టించుకున్నాయి. దీంతో ఏటా ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీలకు ఫీజులు కట్టారు. ఆ తర్వాత ఎప్పుడో తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజులుపడేవి. 2023-24 విద్యా సంవత్సరంలో మూడు క్వార్టర్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఫీజులు కట్టకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమంటూ కాలేజీలు మెలిక పెట్టాయి. దీంతో స్తోమత లేనివారు అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకున్నారు. పాత విధానం పునరుద్ధరించి ఫీజుల సమస్య పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు ఇప్పుడు పాత విధానం తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

హేమచంద్రారెడ్డిపై విచారణ: విజిలెన్స్

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డిపై వచ్చిన ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ ఉన్నత విద్యాశాఖను ఆదేశించింది. ఇటీవలి కాలంలో ఆయనపై అనేక ఫిర్యాదులు అందాయని పేర్కొంది. వాటిని ఉన్నత విద్యాశాఖకు పంపుతూ తాజాగా లేఖ రాసింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ హోదాలో యూనివర్సిటీలు, ప్రభుత్వ నిధులను పెద్దఎత్తున ఆయన దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు అందాయి.

మీడియం ఎంపికలో టెన్త్ విద్యార్థులకు స్వేచ్ఛ

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులు తమకు సౌలభ్యం ఉన్న మీడియంను ఎంపిక చేసుకునేలా పాఠశాల విద్యాశాఖ స్వేచ్ఛ కల్పించింది. ఈ మేరకు డీఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది. పరీక్షలకు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు త్వరలో మీడియం ఎంపికకు అవకాశం కల్పిస్తారు. 8, 9 తరగతులను ఆంగ్ల మాధ్యమంలో చదివిన విద్యార్థులకు వీలైనంతవరకు అదే మాధ్యమంలో పరీక్షలు రాసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యాశాఖ సూచించింది.

ఖనిజాల అక్రమ రవాణాపై సర్కార్ సీరియస్

- గనుల శాఖ నెల్లూరు రిటైర్డ్ ఏడీపై విచారణకు ఆదేశం

వైసీపీ ప్రభుత్వ హయాంలో విలువైన ఖనిజాల అక్రమ రవాణా, అమ్మకాలపై కూటమి ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం రాకుండా చేసి ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చడంలో జగన్ ప్రభుత్వ పెద్దలతో పాటు అధికారుల పాత్ర ఉందని ప్రాథమిక ఆధారాలు లభించడంతో చర్యలకు ఉపక్రమించింది. కృష్ణపట్నం కేంద్రంగా గతంలో సాగిన అక్రమాలపై కూటమి సర్కారు విచారణ ప్రారంభించింది. క్వార్ట్జ్, బెరైటీస్, గ్రానైట్‌లను గతంలో భారీగా కృష్ణపట్నం పోర్టు నుంచి ఇతర దేశాలకు రవాణా చేశారు. ఈ అక్రమాలకు సంబంధించి నెల్లూరు జిల్లాలో జగన్ ప్రభుత్వ హయాంలో గనుల శాఖ ఏడీగా పనిచేసి ఇటీవల రిటైర్ అయిన జి.రామచంద్రరావుపై విచారణకు ఆదేశిస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఆదేశాలిచ్చారు. విచారణాధికారిగా గనుల శాఖ జేడీ డి.శ్రీనివాసరావును నియమించారు. ఇదిలాఉంటే, ఇదే కేసులో త్వరలో మరో ముగ్గురు అధికారులపైనా విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



విశాఖపట్నం రామకృష్ణా బీచ్‌లో కొత్తగా హెలికాప్టర్ మ్యూజియం ఏర్పాటు చేయబోతున్నారు. ఈ ఏడాది జూన్‌లో సేవల నుంచి విరమించిన యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్‌ను తూర్పు నౌకాదళం అధికారులు... జిల్లా కలెక్టర్‌కు ఇవ్వగా, ఆయన దానిని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థకు అప్పగించి, మ్యూజియంగా మలచాల్సిందిగా ఆదేశించారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్‌ను భాగాలుగా విడదీసి ఐఎన్ఎస్ డేగ నుంచి బుధవారం ఆర్‌కే బీచ్ రోడ్డుకు తీసుకువచ్చారు. భారీ క్రేన్ సాయంతో పనులు చేస్తున్నారు. దీనిని నాలుగు నెలల్లో సందర్శకులకు అందుబాటులోకి తీసుకువస్తారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



మడిసన్నాక కూసింత కళాపోషణ ఉండాలన్నది పాత సినిమాలో ఫేమస్ డైలాగు. చేస్తున్న పనికి కొంత క్రియేటివిటీ ఉపయోగిస్తే శ్రమతగ్గి మెరుగైన ఫలితం వస్తుంది. ఇందుకు నిదర్శనం ఈ చిత్రం. మొక్కజొన్న పొత్తులు కాల్చి విక్రయించేవాళ్లు బొగ్గులను విసనకర్రతో విసురుతూ మండించి పొత్తులను కాల్చడం మనం చూస్తూనే ఉంటాం. విసనకర్ర విసిరి విసిరి చెయ్యి నొప్పెడుతుందో ఏమో... కాస్తంత క్రియేటివిటీతో ఆలోచించి ఓ చిన్న ఫ్యాన్‌ను ఉపయోగించి బొగ్గులను మండించి మొక్కజొన్న పొత్తులను కాలుస్తోంది ఈ పెద్దమ్మ. విశాఖలోని ఆర్కే బీచ్‌రోడ్డులో కనిపించిందీ దృశ్యం. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ఈ చిత్రంలో మూలనపడేసినట్లున్న ఈ పరికరాలు ప్రాణాధారమైన వెంటిలేటర్లు. అక్షరాల నాలుగున్నర కోట్ల రూపాయలు వెచ్చించి వీటిని కొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపయోగంగా వదిలేసిన ఈ వెంటిలేటర్‌లు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. అత్యవసర పరిస్థితిలో రోగులకు కృత్రిమ శ్వాస అందించే ఈ పరికరాలు ఎవరికీ పట్టకుండా పాడైపోతున్నాయి. దాదాపు 90 వెంటిలేటర్లు వినియోగించకుండా ఇలా పక్కన పడేశారు. వీటిని వెంటిలేటర్లు అవసరం ఉన్న ఆస్పత్రులకు తరలిస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. - నరసరావుపేట, ఆంధ్రజ్యోతి



మినీ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు, మినీ లారీలు, చెత్త తీసుకెళ్లే మినీ ఆటోలను అర్హులైన ఎస్సీలకు పంపిణీ చేయాలని 2019లో ఎస్సీ కార్పొరేషన్ వీటిని కొన్నది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని లబ్ధిదారులకు పంచాల్సి ఉంది. అయితే, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటి పంపిణీ నిలిచిపోయింది. ఆ ఎన్నికలు ముగిసి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి... ఆ ప్రభుత్వం కూడా దిగిపోయి మళ్లీ ఎన్నికలు జరిగి టీడీపీ అధికారంలోకి వచ్చింది. కానీ ఐదేళ్ల నుంచి చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలో ఈ ఎక్స్‌కవేటర్లు ఇలాగే నిరుపయోగంగా ఉన్నాయి. లక్షల విలువ చేసే ఈ యంత్రాల్లో కొన్ని దొంగలపాలయ్యాయి. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

విశాఖ టు సీలేరు.. సీప్లేన్ సేవలు..!

- మరోమారు తెరపైకి ప్రతిపాదనలు
- జలాశయాన్ని పరిశీలించిన తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), నవంబరు 20: పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం నుంచి సీలేరు వరకు సీప్లేన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రతిపాదన మరోమారు తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. గూడెంకొత్తవీధి తహసీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ అధికారులతో కూడిన బృందం సీలేరు జలాశయాన్ని బుధవారం సందర్శించింది. మారెమ్మ ఆలయం ఎదురుగా ఉన్న స్నానాల ఘాట్, మెయిన్ డ్యామ్‌ను పరిశీలించింది. సీప్లేన్ ల్యాండింగ్‌కు, టేకాఫ్‌కు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయా..? లేదా..? అనే అంశాలను అధ్యయనం చేసింది. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ... విశాఖ నుంచి సీలేరు వరకు సీప్లేన్ నడపాలని 2017లోనే ప్రతిపాదనలు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. తాజాగా విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్ ట్రయల్ రన్ నిర్వహించడంతో ఈ అంశం తెరపైకి వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే సీలేరు జలాశయాన్ని పరిశీలించామని, ఇది చాలా విశాలంగా, లోతుగా ఉందని చెప్పారు. సీప్లేన్ ల్యాండింగ్, టేకాఫ్‌కు అనుకూలమేనని కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. జలాపుట్ జలాశయంలోనూ సీప్లేన్ ప్రయాణానికి సిబ్బంది సర్వే నిర్వహించారన్నారు. సీప్లేన్ అందుబాటులోకి వస్తే సీలేరు, ధారాలమ్మ ఆలయం, రేయిన్‌గేజ్ వంటి ప్రాంతాలకు పర్యాటకుల రాక పెరుగుతుందన్నారు.

వర్రా కేసులో.. పిటిషనర్లకు దురుద్దేశం!



- నిర్దిష్ట ఆరోపణల్లేకుండా డీఐజీ, ఎస్పీలను ప్రతివాదులుగా చేర్చడానికి వీల్లేదు
- హైకోర్టులో ఏజీ దమ్మాలపాటి వాదనలు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వర్రా రవీందర్‌రెడ్డి అరెస్టుకు సంబంధించి దాఖలైన హెబియస్‌కార్పస్ పిటిషన్‌లో పోలీసు ఉన్నతాధికారులను ప్రతివాదులుగా చేర్చాలని కోరడం వెనుక పిటిషనర్లకు దురుద్దేశం ఉందని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. రవీందర్‌రెడ్డి భార్య కల్యాణి, ప్రత్యక్ష సాక్షిగా చెబుతున్న మూడో వ్యక్తి దాఖలు చేసిన అఫిడవిట్‌లో సదరు ఉన్నతాధికారులపై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు. వారిని ప్రతివాదులుగా చేర్చడం ద్వారా పోలీసు వ్యవస్థను ఆందోళనలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని.. నిర్దిష్ట ఆరోపణలు లేకుండా ఎస్పీ, డీఐజీలను ప్రతివాదులుగా చేర్చడానికి వీల్లేదని తెలిపారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది అక్రమ నిర్బంధం గురించి వాదనలు వినిపించకుండా.. కేసు పరిధిని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం పట్ల కోర్టుకు దురభిప్రాయం కలిగించేలా ప్రయత్నిస్తున్నారని.. ఆయన కోర్టుకు సహాయకారి(అమికస్ క్యూరీ)గా వ్యవహరించడం లేదని, నిందితుడి తరఫున వాదనలు వినిపిస్తున్నారనే విషయాన్ని ఆయన గుర్తించాలని తెలిపారు. మూడో వ్యక్తి దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా కోర్టుపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నిందితుడిని ఈ నెల 10న పోలీసులు అరెస్టు చేశారని.. నిబంధనల ప్రకారం 24గంటల్లో న్యాయాధికారి ముందు హాజరుపరచాల్సి ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో 11న సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టామని వెల్లడించారు. ధర్మాసనం ఉత్తర్వులను ఉల్లంఘించలేదన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ చేసేవన్నీ తప్పుడు ఆరోపణలని పేర్కొంటూ పోలీసు ఉన్నతాధికారులు అఫిడవిట్ దాఖలు చేస్తే సరిపోతుందని వ్యాఖ్యానించింది. కర్నూలు డీఐజీ, కడప ఇన్‌చార్జి ఎస్పీ, పులివెందుల డీఎస్పీ, జమ్మలమడుగు సీఐలను ప్రతివాదులుగా చేర్చాలంటూ పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. నలుగురు అధికారులకూ నోటీసులు జారీ చేసింది. వర్రా రవీందర్‌రెడ్డిని 8నే అరెస్టు చేశారనేందుకు సాక్ష్యంగా పుల్లూరు టోల్‌ప్లాజా సీసీటీవీ ఫుటేజ్‌ను కోర్టుకు సమర్పించామని పిటిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. సంబంధిత ఫుటేజ్ వాస్తవికతను తేల్చేందుకు దానిని భద్రపరచాలని జాతీయ హైవేల అథారిటీ అధికారులను ఆదేశించింది. ఉల్లంఘనలకు పాల్పడ్డారన్న పిటిషనర్ ఆరోపణలపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను 29కి వాయిదావేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపర్చేలా ఆదేశించాలని కోరుతూ రవీందర్‌రెడ్డి భార్య కల్యాణి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా.. రవీందర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రవీందర్‌రెడ్డి, మరో ఇద్దరు నిందితుల అక్రమ నిర్బంధంపై అఫిడవిట్ దాఖలు చేశామని, బాధ్యులైన పోలీసులపై చర్యలకు ఆదేశించాలని కోరారు. వ్యక్తులను అక్రమంగా నిర్బంధిస్తూ పోలీసులు చట్టనిబంధనలు ఉల్లంఘిస్తున్నారని.. అలాంటివారిపై చర్యలు తీసుకునే విషయంలో మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.

వర్రా కస్టడీపై తీర్పు రేపటికి వాయిదా

కడప రూరల్, నవంబరు 20: వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలంటూ పులివెందుల పోలీసులు వేసిన పిటిషన్‌పై తీర్పును జిల్లా ఎస్సీ ఎస్టీ కోర్టు శుక్రవారాని(22వ తేదీ)కి వాయిదా వేసింది. బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి దీనబాబు తీర్పును వాయిదా వేశారు. ఇదే కేసులో నిందితుడైన ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణా అదే రోజుకు వాయిదాపడింది.

అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయరేం?

- ఎమ్మెల్యేలను గెలిపించుకోలేని వాళ్లకు విపక్ష హోదా ఎలా వస్తుంది?: షర్మిల



కడప, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారినే కాదు.. ప్రేరేపించేవారిని కూడా అరెస్టు చేయాలని పీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా తననూ, తన తల్లినీ, సునీతనే కాదు.. ఇతర రాజకీయ నాయకుల ఇళ్లలోని ఆడవాళ్లను అవమానిస్తే చిన్నవాళ్లను బాధ్యులను చేయడంతో సరిపెట్టకూడదన్నారు. పోస్టులు పెట్టిస్తున్న వారిని అరెస్టు చేస్తే మళ్లీ ఇలాంటివి జరగకుండా ఉంటాయని అన్నారు. కడప కలెక్టరేట్ వద్ద షర్మిల బుధవారం విలేకరులతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం వెంటనే చేపట్టాలంటూ అంతకుముందు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆదేశాల మేరకే పోస్టులు పెట్టానంటూ వాటిని పెట్టిన వ్యక్తే స్పష్టంగా చెప్పినపుడు అవినాశ్‌రెడ్డిని ఎందుకు అదుపులోకి తీసుకోలేదో, ఎందుకు విచారించలేదో పోలీసులు సమాధానమివ్వాలన్నారు. చేయించే వాళ్లు ఏ ప్యాలెస్‌లలో బతుకుతున్నా అరెస్టు చేసి ఆడవాళ్లకు భద్రత కల్పించాలని అన్నారు. 'ఎమ్మెల్యే జగన్‌అసెంబ్లీకి వెళ్లడట. మాట్లాడట. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను నిలదీయడట. అసెంబ్లీకి వెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకి లేదా?' అని నిలదీశారు. ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం చేతకాని ఆయనకు విపక్ష హోదా ఎలా వస్తుందని ఎద్దేవా చేశారు. 'చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ' అన్నట్లు.. కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపనలు చేయాలి మళ్లీ మళ్లీలాగా పరిస్థితి తయారైందని షర్మిల ధ్వజమెత్తారు.

రిమాండ్ ఉత్తర్వుల కాపీ నిందితుడు అడగలేదు

- దరఖాస్తే చేయలేదని మా విచారణలో తేలింది: హైకోర్టు
- కౌంటర్ వేయాలని పోలీసులకు ఆదేశం

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టినందుకు నిందితుడు పప్పుల వెంకటరామిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి అదే రోజు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. నిందితుడికి మేజిస్ట్రేట్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చారని తెలిపారు. అతడు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నందున హెబియస్ కార్పస్ పిటిషన్ చెల్లుబాటు కాదని, ప్రస్తుత పిటిషన్‌కు విచారణార్హతే లేదన్నారు. న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. రిమాండ్ ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీ కోసం పిటిషనర్ ఎలాంటి దరఖాస్తూ చేయలేదని పరిపాలనాపరంగా తాము జరిపిన విచారణలో తేలినట్లు పేర్కొంది. సర్టిఫైడ్ కాపీ జారీ చేయాలని సంబంధిత మేజిస్ట్రేట్‌కు తామే సూచనలు చేస్తామని తెలిపింది. వ్యాజ్యం విచారణార్హతపై అభ్యంతరం లేవనెత్తుతున్నందున విచారణ కొనసాగించడానికి పోలీసులు కౌంటర్ దాఖలు చేయడం అవసరమని అభిప్రాయపడింది. కేసు వివరాలతో పాటు వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ వేసేందుకు వారికి సమయం ఇస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో తన కుమారుడు వెంకటరామిరెడ్డి అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టారని పేర్కొంటూ పల్నాడు జిల్లా ఐనవోలు పోలీసులు అక్రమంగా నిర్బంధించి కేసు పెట్టారని.. మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కావంటూ వైసీపీకి చెందిన పప్పుల చలమారెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం విచారణ సందర్భంగా పోలీసుల తరఫున ఏజీ వాదనలు వినిపించారు. నిందితుడికి అరెస్టుకు కారణాలు తెలియజేయలేదన్న వాదనలో వాస్తవం లేదని, అరెస్టుకు కారణాలను నిందితుడు ప్రస్తుత పిటిషన్‌కూ జతచేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ వేశారని, అది బుధవారం విచారణకు కూడా వచ్చిందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయమివ్వాలని అభ్యర్థించారు. ధర్మాసనం అంగీకరించి.. రిమాండ్ ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీ కోసం పిటిషనర్ దరఖాస్తు చేయలేదని తమ విచారణలో తేలిందని, ఈ వ్యవహారాన్ని మరోసారి పరిశీలించాలని పిటిషనర్ తరఫు న్యాయవాదికి సూచించింది.

నందిగం ముందస్తు బెయిల్‌పై విచారణ వారానికి వాయిదా

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ఆరోగ్య మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్‌పై జరిగిన దాడి వ్యవహారంలో నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న మరో కేసు వచ్చే సోమవారం విచారణకు వస్తోందని.. ప్రస్తుత వ్యాజ్యాన్ని కూడా దానికి జత చేయాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు.. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు.

నా తల్లి, చెల్లి పేరుతో రాజకీయాలు

- నా కుటుంబంలో విభేదాలున్నాయి
- చంద్రబాబుకూ కుటుంబం ఉంది
- తన తల్లిదండ్రులకు తిండి పెట్టారా?
- వారికి తలకొరివి పెట్టారా?
- షర్మిలపై బాలకృష్ణ తప్పుడు ప్రచారం చేయించలేదా?
- మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తన తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల పేరుతో రాజకీయం ఎందుకు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబును వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. కుటుంబంలో విబేధాలు ఉన్నమాట వాస్తవమేనని అంగీకరించారు. అదే సమయంలో... చంద్రబాబుకు కూడా కుటుంబం ఉంది కాదా అని జగన్ ప్రశ్నించారు. బుధవారమిక్కడ తాడేపల్లి ప్యాలెస్‌లో తన సానుకూల మీడియాను పిలిపించుకుని మాట్లాడారు. "పదేపదే షర్మిల పేరుతో ఎందుకు రాజకీయం చేస్తున్నారు? గతంలో షర్మిలపై నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ తప్పుడు ప్రచారం చేయించలేదా? చంద్రబాబు ఎప్పుడైనా తన తల్లిదండ్రులను ప్రపంచానికి చూపించారా...వారిని ఇంటికి పిలిచి భోజనం పెట్టారా... తలకొరివి పెట్టారా' అని ప్రశ్నించారు. దళిత మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై కేసులు మీద కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేశారంటూ తప్పుడు కేసు పెట్టారని, ఆ సమయంలో ఆయన అసలు ఊళ్లోనే లేరన్నారు. సోషల్ మీడియాలో పోస్టు పెట్టారంటూ వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పైనా 8 కేసులు పెట్టారని పేర్కొన్నారు. 'సోషల్‌మీడియాలో టీడీపీ నేతలు ఫేక్ ఖాతాలను సృష్టిస్తున్నారు. తప్పుడు వ్యాఖ్యలను, అసభ్యకర పోస్టులను పెడుతున్నారు. వారే తిడతారు. తిరిగి వారే కేసులు పెడతారు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పోలీసులను ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. "రిటైర్డ్ పోలీసు అధికారులు... ఆర్పీ ఠాకూర్, ఏబీ వెంకటేశ్వరరావు, యోగానంద్‌తో ఒక జట్టును సీఎం చంద్రబాబు ఏర్పాటుచేశారు. ఈ ముగ్గురూ...మాట వినని అధికారులు, వైసీపీ నేతల సమాచారం జిల్లాల్లోని టీడీపీ నేతల నుంచి తీసుకుంటున్నారు. వారిపై కక్షసాధింపునకు ఆ సమాచారం వాడుకుంటున్నారు. పోలీసులు అక్రమంగా నిర్బంధించి .. ముఖానికి మాస్కులు వేసి .. కొడుతున్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ తీసిన వీడియోలు ప్రభుత్వ పెద్దలకు పంపుతున్నారు. ఈ వీడియోలను వారు సంతోషంగా చూస్తూ, తమ శాడిజం బయటపెట్టుకుంటున్నారు" అని జగన్ విమర్శించారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై తప్పుడు కేసు పెట్టడం అక్రమమన్నారు.మరో పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబే ఉంటారన్న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ముక్తసరిగా స్పందిస్తూ... "ప్రజలు ఆదరించినంత కాలమే ముఖ్యమంత్రిగా ఉంటారు" అని సమాధానం ఇచ్చారు.

ఆయన.. ఓ బొంకుల బాబు

సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను నెరవేర్చలేక రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై సీఎం చంద్రబాబు రోజుకు ఒక అబద్ధం చెబుతున్నారనీ, ఆయనను బొంకులబాబు అని ఎందుకనకూడదని జగన్ ప్రశ్నించారు. రాష్ట్ర అప్పులపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. "ఐదేళ్లలో మా ప్రభుత్వం చేసిన అప్పు రూ. ఆరులక్షల కోట్లు. కానీ రూ.14 లక్షల కోట్లంటూ అబద్ధాన్ని బాబు ప్రచారం చేస్తున్నారు" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి బాదుడే బాదుడు తిరిగి మొదలైందనీ, ప్రజలపై రూ.18వేల కోట్ల విద్యుత్ భారం వేసిందని విమర్శించారు.



బొంకులెవరివి జగన్ ?

జగన్ మాట్లాడే ప్రతి మాటా తనను తాను అద్దంలో చూసుకున్నట్లుగా ఉంటోందని రాజకీయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎవరివి బొంకులని ప్రశ్నిస్తున్నాయి. ఈ వర్గాల వాదన ప్రకారం.. వలంటీర్లకు ఈ ఏడాది జూన్ నుంచి జీతాలు ఇవ్వడం లేదని, వైపీపీ హయాంలోనే వారిని తొలగించారని అసెంబ్లీలో చంద్రబాబు అన్నారని జగన్ తెలిపారు. అయితే ఆ చర్చ జరిగింది మండలిలో.. జవాబిచ్చింది బాబు కాదు.. మంత్రి స్వామి. కూటమి సర్కారు ఏర్పడి ఆరు నెలలవుతున్నా.. ఉద్యోగ నియామకాలు జరపలేదని జగన్ విమర్శించారు. 2019 ప్రచారంలో తాను వస్తే జనవరి 1నే జాబ్ క్యాలెంటర్ విడుదల చేస్తానని చేయలేదు. తాను ఉన్నప్పుడు పారిశ్రామిక వృద్ధి రేటు పెరిగిందని జగన్ ప్రకటించారు. అయితే, ఐదేళ్లలో భారీ పరిశ్రమలు ఎన్ని వచ్చాయో .. ఎంఎస్ఎంఈలు ఎన్ని వచ్చాయో ఆయనే చెప్పలేకపోయారు. మాట్లాడిన మాటలన్నీ బొంకులేనని రాజకీయవర్గాలు తేల్చేస్తున్నాయి.

నోరేకదా.. అనేస్తే పోలా!

- చంద్రబాబు కుటుంబంపై జగన్ అక్కసు
- నిరాడంబరతకు మారుపేరు ఆ కుటుంబం
- నారావారిపల్లె దాటని తల్లిదండ్రులు
- అధికారం వైపు కన్నెత్తిచూడని తోబుట్టువులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తన కుటుంబంలో విభేదాలున్నాయని, అవి వీధిన పడ్డాయని చెబుతూనే ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబాన్నీ బజారుకీడ్చడానికి జగన్ నానా తంటాలు పడుతున్నారు. తల్లిదండ్రులను భోజనానికి పిలిచారా... తలకొరివి పెట్టారా? వారిని ప్రపంచానికి చూపించారా.. అని జగన్ కొత్త ప్రశ్నలేస్తున్నారు. చంద్రబాబు 1975 ప్రాంతంలో విద్యార్థి సంఘనేతగా రాజకీయాల్లోకి వచ్చారు. తర్వాత యూత్ కాంగ్రెస్ నేతగా, అలా..అలా ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు. కుమారుడి విజయాలకు తల్లిదండ్రులు లోలోపల ఆనందించి ఉంటారు గానీ పేరొందిన నాయకుడి తల్లిదండ్రులుగా వారెప్పుడూ భావించలేదు. చంద్రబాబు 1995 సెప్టెంబరు 1న సీఎంగా ప్రమాణం చేశారు. ఆయన తల్లిదండ్రులను ఇంటర్వ్యూ చేద్దామని తిరుపతి నుంచి విలేకరులు నారావారిపల్లె వెళ్లారు. తల్లి అమ్మణ్ణమ్మ ఇంటి దగ్గర లేరు. తండ్రి ఖర్జూర నాయుడు మాత్రం నిద్రిస్తున్నారు. ఇరుగుపొరుగువారిని అడిగితే ఆమె పొలానికి వెళ్లారని చెప్పారు. అటు వెళ్లిన మీడియా ప్రతినిధులకు చంకలో బుట్ట పెట్టుకొని గట్టుపై నడుస్తూ ఆమె కనిపించారు. "అమ్మ..బాబన్న సీఎం అయ్యారు. నువ్వేంటి ఇక్కడ ఉన్నావు" అని అంటే "ఇవ్వాళ్ల కూలోళ్లు రాలేదయ్యా. ఏడ పని అక్కడే ఆగిపోయింది. పోయి పనిచేసుకోవాలా" అంటూ ఆమె ముందుకు నడిచారు. "అదేమిటి? బాబన్న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి మిమ్ములను పిలుచుకొని వెళ్లలేదా" అని అడిగితే... "వాడు రమ్మన్నాడయ్యా. అంత పెద్ద ఊరులో మేం ఉండలేం. మీ తాతకు (చంద్రబాబు తండ్రి) ఇల్లు ఇడిసిపెట్టి బయటకు పోవడం ఇష్టం ఉండదు" అని ఆమె సింపుల్‌గా తేల్చేశారు. చంద్రబాబు సీఎం కాక ముందు మంత్రిగా, కర్షక పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. అప్పుడు కూడా ఆయన తల్లిదండ్రులు, తోబుట్టువులు అతి సాధారణ జీవితమే గడిపారు. ఆ కుటుంబంలో ఎవరూ తాము సీఎం బంధువులమని వీర్రవీగనూ లేదు. ఏ హడావుడీ చేయలేదు. వారు తన వద్దకు రారు కాబట్టే చంద్రబాబే వారి వద్దకు వెళ్తుంటారు. సంక్రాంతికి ఇంటికి వెళ్లి కుటుంబంతో గడపడానికి ఆయన ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం కూడా ఇదే. అంత సింపుల్‌గా ఉన్న కుటుంబం ప్రస్తావన తెస్తూ.. 'అందరికీ చూపించావా.... అన్నం పెట్టావా?' అని జగన్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉంది. నోటికొచ్చిందల్లా మాట్లాడేయడం, తనలాగే ఇతరులూ బజారున పడాలని ఆశించడం జగన్ నైజమని టీడీపీ వర్గాలు మండిపడుతున్నాయి.

"ప్రజాస్వామ్యంలో గుంటూరు మేయర్ వాడిన పదజాలాన్ని అంగీకరించలేం. సేవచేసి ప్రజలకు దగ్గరవ్వాలేతప్ప అసభ్యకర భాషతో కాదు. మురికి భాషను ఉపయోగించి ఎన్నికలను గెలవాలని అనుకోకూడదు. అసభ్యకర భాష వాడినవారు ఏ పార్టీ వారైనా శిక్షించాల్సిందే. మనోహర్ నాయుడు వాడిన పదజాలాన్ని ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో వినియోగించడాన్ని ఆమోదించలేం" - హైకోర్టు

ఇదేం భాష..?

నగర మొదటి పౌరుడు మాట్లాడేది ఇలాగేనా?

కుటుంబ సభ్యులూ, తల్లులపైనా దాడులా?

- కావటి మనోహర్ నాయుడిపై మండిపడిన హైకోర్టు
- సెక్షన్ 41(ఏ) నోటీసు ఇవ్వాలని పోలీసులకు నిర్దేశం

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు వాడిన భాషపై హైకోర్టు మండిపడింది. కార్పొరేషన్ మేయర్, నగర ప్రథమ పౌరుడు వాడే భాష ఇదేనా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు విధానాలు, పాలసీలను విమర్శించాలేగానీ... అసభ్య పదజాలంతో కుటుంబసభ్యులు, తల్లులపై దాడి చేయడం ఏంటని ప్రశ్నించింది. నగర మొదటి పౌరుడిగా బాధ్యతగా మెలగాలని మనోహర్‌నాయుడికి సూచించాలని ఆయన తరఫు న్యాయవాదిని ఆదేశించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశించింది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షపడేవే అయినందున నిందితుడికి సెక్షన్ 41(ఏ)కింద నోటీసులివ్వాలని ఆదేశించింది. ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 6వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను మేయర్ మనోహర్ నాయుడు దూషిస్తూ పోలీస్ లాఠీతో దాడి చేశారని, జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ నేత లోకేశ్‌లను అసభ్య పదజాలంతో దూషించారంటూ టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు గుంటూరు అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు మనోహర్‌నాయుడుపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా, పిటిషనర్ తరఫున న్యాయవాది పాలపర్తి ప్రభాకర్ వాదనలు వినిపించారు.

25న రండి.. ఆర్జీవీకి మళ్లీ పోలీసుల నోటీసు

ఒంగోలు క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ఒంగోలు పోలీసులు మరోసారి నోటీసు జారీ చేశారు. ఈ నెల 25న విచారణకు హాజరుకావాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు బుధవారం ఆర్జీవీ వాట్సాప్‌కు మెసేజ్ ద్వారా సమాచారం ఇచ్చారు. కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వర్మపై టీడీపీ నాయకుడు రామలింగం ఫిర్యాదు మేరకు మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే.

సజ్జల భార్గవ్‌రెడ్డిపై కేసుల వివరాలివ్వండి: హైకోర్టు

అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డిపై నమోదైన కేసుల వివరాలు తమ ముందుంచాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా, ప్రకాశ్‌నగర్ పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ భార్గవ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం పోలీసులు పెట్టిన కేసులోనూ ముందస్తు బెయిల్ కోసం మరో పిటిషన్ వేశారు. ఈ రెండు వ్యాజ్యాలూ బుధవారం విచారణకు వచ్చాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. అరెస్టు నుంచి భార్గవ్‌రెడ్డికి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పోలీసులు వివరాలు సమర్పించాక అన్ని విషయాలనూ పరిశీలిస్తామని స్పష్టంచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.